అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 12-04-2025

సంపుటి : 11 సంచిక : 51 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



వక్ఫ్ సవరణచట్టానికి వ్యతిరేకంగా చార్మినార్ వద్ద నిరసన ప్రదర్శన




బెదిరిస్తే బెదరం

ట్రంప్‌పై చైనా ఆగ్రహం

యూఎస్‌పై టారిఫ్‌లు 125 శాతానికి పెంపు

న్యూఢిల్లీ : అమెరికా, చైనా మధ్య టారిఫ్ యుద్ధం రోజు రోజుకు తీవ్రమవుతోంది. ట్రంప్ భయపెడితే ఎవరూ బెదిరే వాళ్ల లేరని చైనా స్పష్టం చేసింది. బ్లాక్ మెయిల్లకు తలొగ్గమని మరోమారు తెలిపింది. అమెరికా వరుసగా టారిఫ్‌లను పెంచుతున్న వేళ చైనా ...2లో

భారత్ నుంచి వంద మంది



ఇది పెగాసస్ టార్గెట్ చేసిన వాట్సప్ వినియోగదారుల సంఖ్య

మెక్సికోది మొదటి స్థానం..

స్పైవేర్ బారిన 456 మంది

ప్రపంచవ్యాప్తంగా 51 దేశాల్లో బాధితులు

వివరాలు 11లో

తెలంగాణ లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి





మానవ హక్కుల కమిషన్ చైర్మెన్‌గా షమీమ్ అక్తర్

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం 11లో..

సీనియర్ సిటిజన్ల కన్నా కాసులే మిన్న



రైల్వేశాఖ రాయితీ ఎత్తివేతతో... ఐదేండ్లలో ఖజానాకు రూ.8,913 కోట్ల ఆదాయం

సమాచారహక్కు చట్టం ద్వారా వెల్లడి

వివరాలు 11లో



పూలే మార్గం అందరికి ఆచరణీయం

అంబర్‌పేటలో పూలే విగ్రహానికి సీఎం నివాళి

నవతెలంగాణ-అంబర్‌పేట

పూలే మార్గం అందరికి ఆచరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు ఆధ్వర్యంలో హైదరాబాద్ అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ...11లో

మూసీ పునరుజ్జీవ పనులు వేగవంతం చేయండి

సీఎం రేవంత్ ఆదేశం

వివరాలు 12లో

వ్యూహాలను సమీక్షిస్తాం

రాజకీయ, సాంస్కృతిక పంథాకు పదును పెడతాం

సరికొత్త పోరాట నమూనాలను రూపొందిస్తాం

మా మహాసభలు లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల్లో కొత్త ఆశలు నింపాయి

మన ప్రజాస్వామ్య పునాదులు ఒత్తిడిలో ఉన్నాయి :

నవతెలంగాణతో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ



దేశ ప్రజాస్వామ్య పునాదులు ఎన్నడూ లేనంత ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ఏప్రిల్ 2 నుంచి 6 వరకు మదురైలో జరిగిన సీపీఐ(ఎం) 24వ పార్టీ మహాసభ దేశంలో వామపక్ష, ప్రగతిశీల శక్తులకు కొత్త వెలుగునిచ్చిందని సీపీఐ(ఎం) నూతన ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగ విలువలను క్షీణింపజేస్తోందని, మతపరమైన విభజనలను తీవ్రతరం చేస్తోందని ప్రజలపై తీవ్రమైన ఆర్థిక, సాంస్కృతిక దాడిని కొనసాగిస్తోందని విమర్శించారు. వామపక్షాల రాజకీయ, సాంస్కృతిక వ్యూహాన్ని పున్ణసమీక్షించాలని మహాసభ పిలుపునిచ్చిందన్నారు. మహాసభ తీర్మానాలు పోరాడే శక్తులలో కొత్త ఆశను, ఉత్సాహాన్ని రేకెత్తించాయని చెప్పారు. నవతెలంగాణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలను వెల్లడిస్తూ పార్టీ మహాసభ ఆమోదించిన కార్యాచరణ ప్రణాళికను వివరించారు.

సీపీఐ(ఎం) స్వంత బలాన్ని పెంచాలనే పార్టీ మహాసభ పిలుపును రాజకీయంగా ఎలా అర్థం చేసుకోవాలి?

పార్టీ మహాసభ రెండు కీలకమైన పనులను నిర్దేశించింది. మొదటిది.. సీపీఐ(ఎం), వామపక్షాల స్వంత బలాన్ని గణనీయంగా పెంచుకోవడం. రెండోది.. ప్రమాదకరమైన మోడీ పాలనకు వ్యతిరేకంగా రాజకీయ సైద్ధాంతిక పోరాటాన్ని విస్తృతం చేయడం. మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం దీనినే స్పష్టం చేస్తుంది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం జాతిని తిరోగమనానికి నడపడం మాత్రమే కాదు, మొత్తం భారతీయ సమాజ నిర్మాణాన్ని విషపూరితం చేస్తోంది. నయా ఫాసిస్ట్ ధోరణులను ప్రదర్శిస్తోంది. మోడీ ప్రభుత్వం ఒకదాని తరువాత ఒకటిగా తీసుకుంటున్న చర్యలు మన రాజ్యాంగ విలువలన్నింటినీ నాశనం చేస్తున్నాయి. పార్టీ మహాసభ ముగిసిన తర్వాత ఒకే రోజులో రెండు ముఖ్య పరిణామాలు జరిగాయి. మొదటిది... తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 10 బిల్లులను నిరోధించడంలో ...3లో

సమానత్వం కోసం పోరాడిన తత్వవేత్త ఫూలే

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



పూలేకు నివాళ్లు అర్పిస్తున్న జాన్‌వెస్లీ

నవతెలంగాణ-అంబర్‌పేట

అన్ని రంగాల్లో మనుషులంతా సమానత్వంతో జీవించాలని, ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ తన జీవితాన్ని ధారపోసిన భారతీయ సామాజిక తత్వవేత్త మహాత్మ జ్యోతిరావు పూలే అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. శుక్రవారం పూలే 199వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తా వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక దార్శనికునిగా, సంఘ సంస్కర్తగా, వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటానికి బాటలు వేసి వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప వ్యక్తి పూలే అని కొనియాడారు. పూలే 19వ శతాబ్దంలో ...11లో

జాబ్‌మేళాలో తోపులాట

పలువురికి గాయాలు..స్థానిక ఆస్పత్రిలో చికిత్స



25 వేల మందికిపైగా హాజరైన నిరుద్యోగులు

తగిన ఏర్పాట్లు లేక గందరగోళ పరిస్థితులు

అనంతరం కొనసాగిన ఇంటర్వ్యూలు

మేళాను ప్రారంభించిన మంత్రులు

అవకాశాలు అందిపుచ్చుకొని ముందుకు సాగాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

నిరుద్యోగాన్ని పారదోలేందుకే జాబ్ మేళా : మంత్రి సురేఖ

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఎంకే నాయుడు కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అధిక సంఖ్యలో అభ్యర్థులు తరలి రావడంతో తోపులాట జరిగింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. గాయపడిన వారికి సమీప ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించిన అనంతరం జాబ్ మేళాలో ఇంటర్వ్యూ చేయించారు. ఈ మెగా జాబ్ మేళాలో 56 కంపెనీలు పాల్గొననున్నట్టు వారం, పది రోజులుగా విస్తృతంగా ప్రచారం చేయడంతో శుక్రవారం దాదాపు 25 వేల మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. కానీ అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచే నిరుద్యోగులు కన్వెన్షన్ హాల్‌కు చేరుకున్నప్పటికీ గేట్లు తెరవలేదు. ఉదయం 9:30 గంటలకు రావాల్సిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క దాదాపు గంటన్నర ఆలస్యంగా ...10లో

కంచ గచ్చిబౌలి భూముల స్కాంలో బీజేపీ ఎంపీ హస్తం



రూ.10 వేల కోట్ల అవినీతికి తెరలేపిన రేవంత్

సుప్రీం తీర్పుల ప్రకారం అది ముమ్మాటికీ అటవీ భూమే : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంచ గచ్చిబౌలి భూముల్లో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.10వేల కోట్ల అవినీతికి తెరలేపారని ఆరోపించారు. "ఈ భూ కుంభకోణం కర్త, కర్మ క్రియ ముఖ్యమంత్రే. రూ. పది వేల కోట్ల లోన్ ఇచ్చిన ఐసీఐసీఐ బ్యాంకు తన క్రెడిబులిటీని కోల్పోయింది. త్వరలోనే ఆ బ్యాంకు కుప్పకూలడం ఖాయం. ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి. కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రధాని మోడీ వెంటనే విచారణకు ఆదేశించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో జరిగిన పర్యావరణ విధ్వంసంపై దేశం మొత్తం నివ్వెరపోయిందని అన్నారు. రాత్రికి రాత్రి బుల్డోజర్లను పెట్టి వందల ఎకరాల్లో చెట్లను కూల్చివేసి మూగజీవాలకు నిలువనీడ లేకుండా చేశారని ఆరోపించారు. "కంచ గచ్చిబౌలిలోని ఆ 400 ఎకరాలు ముమ్మాటికీ అటవీ భూమే. రిజర్వ్ ఫారెస్ట్ అని ప్రత్యేకంగా డిక్లేర్ చేయకపోయినా అడవులకు ఉండాల్సిన లక్షణాలు ఉంటే యాజమాన్య హక్కులు ఎవరి పేరు మీద ఉన్నా దాన్ని అటవీ ...11లో

కేసీఆర్ భూదోపిడీపై విచారణ జరపాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూదోపిడీపై విచారణ జరపాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 'నా' అనుకున్న వారికి వేల ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. శుక్ర వారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఇతర పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేండ్లలో భూ దోపిడీపై చర్చకు సిద్ధమా? దమ్ము, ధైర్యముంటే చర్చకు రావాలంటూ మాజీ మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్టుకు లింక్ పెట్టడమేంటని ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతం నవ్వుకుంటున్నారని తెలిపారు. ఈ-ఫార్ములా రేసు కేసులో కేటీఆర్ ఏదో ఒక రోజు అరెస్టు కాక తప్పదని స్పష్టం చేశారు. పదేండ్ల పాలనలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాలను విక్రయించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న వేల ఎకరాలను కేసీఆర్ తన వారికి మాత్రమే అమ్ముకున్నారని విమర్శించారు. కంచ గచ్చిబౌలి భూముల గురించి పదేండ్లలో ఎందుకు పోరాడలేదని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల సమస్య కోర్టు వివాదంలో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఐఎంజీ సంస్థ అధినేత బిల్లీరావుతో కమీషన్ మాట్లాడుకొని ఆ భూములను పట్టించు కోలేదని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి 400 ఎకరాలను సాధించామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఆ భూములను కాపాడకపోయి ఉంటే, ఆ భూమి ఐఎంజీ చేతికి వెళ్లి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లీరావుతో మాట్లాడుకున్న వేల కోట్ల కమీషన్ పోయిందనే ...2లో

చెత్తకుప్పకు ధారావి నివాసితులు

పునరావాసం కోసం డియోనార్ డంప్ యార్డు

మహారాష్ట్రలో ఉన్న అతిపెద్ద మురికివాడ ధారావి. ఇక్కడ ఎంతో మంది దారుణ పరిస్థితుల్లోనే జీవిస్తున్నారు. అయితే, వీరి కోసం ధారావి మురికివాడ పునరాభివృద్ధి ప్రాజెక్టును ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ ప్రాజెక్టులోని 50వేల నుంచి లక్ష మంది నివాసితులకు ముంబయిలోని అతిపెద్ద వ్యర్థాల డంప్‌లలో ఒకటైన డియోనార్ ల్యాండ్‌ఫిల్ వద్ద పునరావాసం కల్పించే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించింది. అయితే, విషవాయువులను వెదజల్లే ఈ మురికి ప్రదేశానికి నివాసితులను తరలించాలనే ప్రభుత్వ నిర్ణయంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు చర్యలపై ప్రశ్నలను లేవనెత్తుతున్నారు.

అతిపెద్ద వ్యర్థాల డంప్‌లో ఇదీ ఒకటి

దాదాపు లక్ష మందికి అక్కడే 'అద్దె యూనిట్లు'

విషవాయువులను వెదజల్లే కూపం

సగటున గంటకు 6202 కేజీల మిథేన్ విడుదల

తరలింపు ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

'మహాయుతి' సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు

చర్చనీయాంశంగా అదానీ-మహారాష్ట్ర 'ధారావి ప్రాజెక్టు'

ముంబయి : ధారావి మురికివాడ పునరాభివృద్ధి ప్రాజెక్టును అదానీ గ్రూప్-మహారాష్ట్ర ప్రభుత్వ జాయింట్ వెంచర్ నిర్వహిస్తున్నది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ), క్షేత్రస్థాయి సందర్శనలు, ఈ ప్రాజెక్టుల్లో భాగమైన అధికారుల ఇంటర్వ్యూలలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. డియోనార్‌కు తరలింపు ప్రక్రియ కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) రూపొందించిన పర్యావరణ నిబంధనలు, మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నదని వెల్లడవుతున్నది. క్లోజ్డ్‌ల్యాండ్‌ఫిల్ (మూసివేయబడిఉన్న చెత్తకుప్ప)లో అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో సీపీసీబీ 2021 మార్గదర్శకాల ప్రకారం..



ఆస్పత్రులు, గృహాలు, పాఠశాలలు, సౌకర్యాలను ల్యాండ్‌ఫిల్ లోపల నిర్మించకూడదు. దాని సరిహద్దు నుంచి వంద మీటర్ల అభివృద్ధి రహిత జోన్ తప్పనిసరి.

డియోనార్.. డేంజర్ ప్లేస్

డియోనార్ ప్రాంతం విషవాయువులను వెదజల్లే కూపం. వ్యర్థాల కుప్పల నుంచి బయటకు వచ్చే ద్రవం, భూగర్భజలాలు, ఉపరితల నీరు, నేలను విషపూరిత సేంద్రీయ, అకర్బన కాలుష్య కారకాలతో కలుషితం చేసే అవకాశం ఉన్నది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రిన్సిపల్ బెంచ్‌కు సమర్పించిన 2024 సీపీసీబీ నివేదిక ప్రకారం.. డియోనార్ ల్యాండ్‌ఫిల్ నుంచి సగటున ప్రతి గంటకు 6202 కేజీల మేథేన్ విడుదలవుతుంది. భారత్‌లోని టాప్ 22 మీథేన్‌హాట్‌స్పాట్‌లలో ఇది ఒకటి. దీంతో ధారావి నివాసితులను డియోనార్ ప్రదేశానికి తరలించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. మహారాష్ట్రలోని మహాయుతి సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏమిటీ ఈ ప్రాజెక్టు?

ధారావిలో ఉన్న 600 ఎకరాలలో 296 ఎకరాలు ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్టు (డీఆర్‌పీ) కోసం కేటాయించారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద మురికివాడను..మెరుగైన ...10లో



22 మంది మావోయిస్టుల లొంగుబాటు

ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

నవతెలంగాణ-ములుగు

నిషేధిత సీపీఐ(మావోయిస్టు)కి చెందిన 22మంది మావోయిస్టులు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఎదుట శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్ అధికారుల సమక్షంలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం కోసం నిర్వహిస్తున్న 'పోరుకన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకొని హింసాత్మక నక్సలిజం మార్గాన్ని వదిలిపెట్టి లొంగిపోయినట్టు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. ఇందులో ఏసీఎం-03, పార్టీ సభ్యుడు - 01, ఆర్‌పీసీ కమిటీకి చెందిన 18 మంది, మొత్తం 22 మంది లొంగి పోయినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ములుగు ఎస్పీ అజ్ఞాతంలో పని చేస్తున్న మావోయిస్టు నాయకులు, సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయి తమ కుటుంబంతో ప్రశాంతంగా జీవించాలని, లొంగిపోయిన వారికి జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల సదుపాయాలు అందించడానికి పోలీసు శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఆర్పీఎఫ్ పీఎంజీ పంచమీలాల్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, వెంకటాపురం సీఐ కుమార్, పస్ర సీఐ రవీందర్, వెంకటాపురం ఎస్ఐ తిరుపతి, కన్నాయిగూడెం ఎస్ఐ వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరిస్తే బెదరం

(మొదటిపేజీ తరువాయి)

కూడా అదే స్థాయిలో స్పందిస్తోంది. తాజాగా చైనాపై యూఎస్ సుంకాలను 145 శాతానికి చేర్చగా.. చైనా సైతం ఏమాత్రం తగ్గకుండా అమెరికాపై టారిఫ్‌లను 125 శాతానికి చేర్చింది. డోనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు చైనా ఏమాత్రం బెదరడం లేదు. యూఎస్ చర్యలకు ప్రతి సవాళ్లను విసురుతోంది. గతంలో అమెరికా దిగుమతులపై సుంకాలను 84 శాతానికి పెంచగా.. తాజాగా దీన్ని 125 శాతానికి చేర్చింది. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల ట్రంప్ పలు దపాలుగా సుంకాలను క్రమంగా పెంచుతూ 145 శాతానికి చేర్చారు. మొత్తానికి ఈ పరస్పర సుంకాలతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రతరమైంది.

యూరప్ కలిసి రావాలి : జిన్‌పింగ్

అమెరికాపై చర్యలపై ఇటీవలే భారత్‌కు స్నేహహస్తం అందించిన చైనా.. తాజాగా యూరప్ దేశాలు తమతో కలిసి రావాలిన కోరింది. అమెరికా టారిఫ్ విధానలపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందిస్తూ.. తమపై అమెరికా విధించిన 145 శాతం సుంకాలను ఏకపక్ష బెదిరింపుగా ఉన్నాయని అన్నారు. బెదిరింపులను ప్రతిఘటించడానికి యూరోపియన్ యూనియన్ తమతో కలిసిరావాలని కోరారు. బీజింగ్‌లో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో భేటీ సందర్భంగా షీ జిన్‌పింగ్ మాట్లాడుతూ.. చైనా, యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అప్పుడే తమ సొంత చట్టబద్ధ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. అదే విధంగా అంతర్జాతీయ పారదర్శకత, న్యాయాన్ని కాపాడొచ్చన్నారు.

తుది వరకు పోరాటం

అమెరికా సుంకాల యుద్ధమే చేయాలని భావిస్తే తాము తుది వరకు పోరాడతామని చైనా స్పష్టం చేసింది. అమెరికా చర్చలకు రావాలంటే తమ తలుపులు తెరిచే ఉంటాయని పేర్కొంది. తాము ఘర్షణకు ప్రయత్నించబోమని, ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కోవడానికైనా వెనుకాడబోమని తెలిపింది. 'చైనా వైఖరి స్పష్టంగా, స్థిరంగా ఉంది. కవ్వింపు చర్యలకు భయపడం. అమెరికా మాట్లాడాలనుకుంటే.. మా తలుపులు తెరిచే ఉంటాయి. కానీ పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా చర్చలు జరగాలి. చైనాతో ఒప్పందం చేసుకోవాలంటే ఒత్తిడి, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటివి పనిచేయవు' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి హి యోంగ్కియాన్ అన్నారు.

డంపింగ్ యార్డ్ మాకొద్దు

నల్లవల్లి గ్రామ పంచాయతీకి నోటీసు..
ప్రారంభమైన ప్రజాభిప్రాయం
మొదటి రోజు వ్యతిరేకించిన
నాలుగు గ్రామాల ప్రజలు

పనులు ప్రారంభించిన 2 నెలల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణా..?

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్-నల్లవల్లి గ్రామంలో జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డ్ తమ కొద్దంటూ స్థానికులు వ్యతిరేకించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం రెండు నెలల క్రితమే రాంకీ సంస్థ పనులు చేపట్టింది. స్థానికులు దాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం చేపట్టారు. భూముల సర్వే చేయకుండానే డంపింగ్ యార్డ్ పనులు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ రైతులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ నెల 18 వరకు ఎలాంటి పనులు కొనసాగించవద్దంటూ స్టే విధించింది. పనులు తాత్కాలికంగా ఆగిపోయినా డంపింగ్ యార్డ్ పెట్టాలన్న ఆలోచనలో రాంకీ సంస్థ ఉండటంతో 11 గ్రామాలకు చెందిన ప్రజలు జేఏసీగా ఏర్పడి 66 రోజులుగా స్థానికంగా గ్రామాల వారీగా నిరవధిక దీక్షలు కొనసాగిస్తున్నారు. అనేక రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసు..

కోర్టు స్టే ఉండటంతో డంపింగ్ యార్డ్ పనుల్ని తాత్కాలికంగా నిలిపి వేశారు. ప్రజాందోళన కొనసాగుతున్న వేళ ఈ నెల 3న గుమ్మడిదల తహసీల్దార్ పరమేశం ఎ1-నోటిఫికేషన్ జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాలిడ్ వ్యర్థాల నిర్వహణ కోసం గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లోని బిలా దాఖల్ సర్వే నెంబర్‌లో ఉన్న 152 ఎకరాల భూమిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడానికి సిఫార్సు చేశారు. నోటీస్ జారీ చేసిన రోజు నుంచి 15 రోజుల్లోపు స్థానిక ప్రజలు డంపింగ్ యార్డ్ గురించి ఆసక్తి, వ్యతిరేకత చూపే వాళ్ల తమ అభిప్రాయాన్ని తెలియజేయాల్సిందిగా నోటీసులో పేర్కొన్నారు. తహసీల్దార్ జారీ చేసిన నోటీస్ గురించి మండల వాసులంతా తెలుసుకుని డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తూ అభిప్రాయం తెలియచేయాలని తీర్మానించుకున్నారు. జేఏసీ ఈ మేరకు ప్రజలకు పిలుపునిచ్చింది. దాంతో శుక్రవారం మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి, మంబాపూర్‌కు చెందిన 1000 మంది వరకు తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయవద్దంటూ అభిప్రాయం తెలియజేస్తూ తహసీల్దార్ కార్యాయంలో సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంకు వినతులు అందజేశారు.

18 వరకు కోర్టు స్టే ఉండటంతో ఆగిన పనులు: ఆర్డీఓ



పనులు ప్రారంభించిన తర్వాత ప్రజాభిప్రాయమా..?

డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ముందే ప్రజాభిప్రాయం చేయాల్సి ఉన్నా జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ, రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న పరిస్థితి ఉంది. పనులు మొదలు పెట్టిన రెండు నెలల తర్వాత ప్రజాభిప్రాయం ఎలా సేకరిస్తారని జేఏసీ నాయకులు ఆర్డీఓను శుక్రవారం నిలదీశారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్పీ సంజీవరావు నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పోలీసులు మోహరించారు.

18 వరకు స్టే ఉన్నది: రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి, ఆర్డీఓ

ప్యారానగర్ భూముల సర్వేకు సంబంధించి హైకోర్టు స్టే విధించడం వల్ల అక్కడ పనులు జరగట్లేదు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనున్నందున ఆసక్తి ఉన్న వాళ్ల, వ్యతిరేకించే వాళ్ల తమ అభిప్రాయాల్ని తెలియజేసేందుకు వీలుగా ప్రజాభిప్రాయాన్ని కోరాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.

14 నుంచి భూ భారతి

విలేకర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ - మణుగూరు, నవతెలంగాణ బ్యూరో



భూ భారతిని ఈనెల 14న ప్రారంభిస్తామని, దొరల ప్రభుత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రగతి భవన్‌ను జ్యోతిరావు పూలే భవనంగా మార్చామని రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రూ.20 కోట్లతో పినపాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని, పులుసు బొంత ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం రూ.1.57 కోట్ల ఎకరాల భూమిని తాకట్టు పెట్టారని అన్నారు. ధరణి కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దాన్ని బంగాళాఖాతంలో పడేసి అనేక సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా శిల్పా రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రభుత్వ అధికారులతో భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. 2025 భూ భారత చట్టం.. పేదరైతు నుంచి ఆసాముల వరకు అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. గత ఐదేండ్లలో రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. అప్పల భారంతో కూరుకుపోయిన రాష్ట్రా న్ని ప్రతి సమస్య పరిష్కరించుకుంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే పులుసు బొంత ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కూనవరం గ్రామ పంచాయతీలోని వంక ముఖేందర్ గృహంలో సన్న బియ్యం భోజనం చేశారు. మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబా బాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు.

పోర్టల్‌ను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఈ నెల 14న తెలంగాణ భూ భారతి(రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్) యాక్ట్, 2025ను ఆవిష్కరిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి రోజున రైతులకు మేలైన సేవలందించేందుకు ఈ కొత్త చట్టాన్ని అందుబాటులోకి తేనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ ఇందుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) మెంబర్ కమిషనర్ నవీన్ మిట్టల్ శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు.



కేసీఆర్ భూదోపిడీపై విచారణ జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

అక్కసుతోనే కేటీఆర్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఏ ప్రభుత్వమైనా ఒక సంస్థ ద్వారానే రుణాలు సేకరిస్తున్నదన్నారు. కోకాపేటలో వేల ఎకరాలను రూ.100 కోట్లకు ఎకరం చొప్పున అమ్ముకోలేదా? అని ప్రశ్నించారు. టీజీఐఐసీ ద్వారా తీసుకున్న రూ.10వేల కోట్ల రుణాలతో రైతులకు రుణమాఫీ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాలను అమ్ముకున్నప్పుడు పర్యావరణం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. పదేండ్లలో లక్ష ఎకరాలను డీఫారెస్ట్ చేసి అమ్ముకున్నారని ఆరోపించారు. 400 ఎకరాల భూముల్లో కంపెనీలు నిర్మిస్తే, రాష్ట్ర ప్రజలకు లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని విమర్శించారు. లిక్కర్ స్కాం చేసింది కూడా కేసీఆర్ కుటుంబమేనన్నారు. అడ్డమైన వాళ్ల వచ్చి మాట్లాడుతున్నారనీ, ఆ మాటలను నమ్మొద్దంటూ ప్రజలను కోరారు. చాలా తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడీ చేసింది కేసీఆర్ కుటుంబమేనని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సగంసగం తెలుసుకుని రాజకీయ లబ్ది కోసం కేటీఆర్ మాట్లాడుతారంటూ ఎద్దేవా చేశారు. బీసీ కులగణన వల్ల బీఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టిందని చెప్పారు. రైతులు బాగుపడు తుంటే కేటీఆర్ కి కడుపునొప్పి వస్తోందని ఎద్దేవాచేశారు. ఏఐ టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారంటూ బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు రాకూడదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ దోపిడీని భరించలేకనే రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు.

నేతన్న, రైతన్నల సంక్షేమమే తమ ప్రాధాన్యత

- రూ.34కోట్లతో నేతన్నలకు రూ.లక్ష రుణమాఫీ పూర్తి
- నేతన్న జీవనోపాధి కల్పనకు రూ.900కోట్ల ఆర్డర్లు అందించాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సిరిసిల్ల ఆపెరల్ పార్క్‌లో మరో పరిశ్రమ యూనిట్ ప్రారంభం



టెక్స్‌పోర్ట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

నవతెలంగాణ - సిరిసిల్ల

నేతన్నలు, రైతన్నల సంక్షేమమే ప్రాధాన్యతగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆపెరల్ పార్క్‌లోని 7.6 ఎకరాల్లో రూ.62 కోట్లతో ఏర్పాటైన పంక్చుయేట్ వరల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ (టెక్స్‌పోర్ట్) యూనిట్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ప్రారంభించారు. పరిశ్రమ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. నేతన్నల జీవనోపాధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు ఒకేసారి రూ.20,600 కోట్ల రుణమాఫీ చేసిందని, నేతన్నలకు రూ.34 కోట్ల రుణమాఫీ పూర్తి చేసిందని తెలిపారు. నేతన్నలకు రూ.914 కోట్ల బకాయిలు విడుదల చేశామని, రూ.900 కోట్ల ఆర్డర్లు అందించామని చెప్పారు. త్వరలోనే వర్కర్ టూ ఓనర్ కార్యక్రమం పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. టెక్స్‌పోర్ట్ సమస్యలు పరిష్కరించి పరిశ్రమ ప్రారంభించామని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామన్నారు. వేములవాడ అభివృద్ధికి నిధులు కేటాయించామని, శాతవాహన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామని చెప్పారు. స్థానికులకు ఉపాధి కల్పించే పరిశ్రమలకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. టెక్స్‌పోర్ట్ యూనిట్ ఏర్పాటు సంతోషకరమని, భవిష్యత్తులో విస్తరణకు సహకరిస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు చీరల ఆర్డర్లు సిరిసిల్ల నేతన్నలకే ఇచ్చామని, పేదల కోసం సన్న బియ్యం పథకం అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు రుణమాఫీ చేశామని, మహిళా సంఘాలకు చీరల పంపిణీకి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో కాటన్, పాలిస్టర్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం పరిశ్రమలో శిక్షణ పొందిన మహిళలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కంపెనీ సీఈఓ చంద్రశేఖర్, ఎస్పీ మహేష్ బీ గీతే, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధా బాయ్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ రాఘవేందర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కులకై టీడబ్ల్యూజేఎఫ్ నిరంతర పోరాటం



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి. బసవపున్నయ్య
టీడబ్ల్యూజేఎఫ్‌లో 200 మంది జర్నలిస్టుల చేరిక

నవతెలంగాణ-మహేశ్వరం

జర్నలిస్టుల సమస్యలపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) భవిష్యత్తులో పెద్ద ఎత్తున జర్నలిస్టులను ఏకతాటిపై తీసుకొచ్చి బలమైన ఉద్యమం నిర్వహించబోతుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మామిడి సోమయ్య, బి. బసవపున్నయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఎస్ఎన్ గార్డెన్‌లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మిద్దెల సత్యనారాయణ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం ఎల్లవేళలా పోరాడుతుందని తెలిపారు. గత ప్రభుత్వం లాగానే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ప్రత్యేక రక్షణ చట్టం, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. ఆయా సంఘాలకు చెందిన 200 మంది జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి జగదీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ బి.దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్ నరేష్, నరసింహారెడ్డి, ఆంజనేయులు అలుగొండ శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యూహాలను సమీక్షిస్తాం

- రాజకీయ, సాంస్కృతిక పంథాకు పదును పెడతాం
- సరికొత్త పోరాట నమూనాలను రూపొందిస్తాం
- మా మహాసభలు లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల్లో కొత్త ఆశలు నింపాయి

'నవతెలంగాణ'తో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ చర్య తప్పు అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని దెబ్బతీస్తోందనే సీపీఐ(ఎం) వైఖరిని ఈ తీర్పు బలపరుస్తుంది. రెండోది... పెట్రోల్, డీజిల్‌పై సుంకాలు పెంచింది. వంట గ్యాస్ ధరలు పెంచింది. మోడీ ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక దాడిని కొనసాగిస్తోందన్న మా విమర్శ అక్షర సత్యమని ఇది మరోసారి రుజువు చేసింది. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విస్తృత పోరాటాలను నిర్మించాలంటే సీపీఐ(ఎం) బలాన్ని పదిరెట్లు పెంచాలి. సంస్థాగతంగా, పార్టీ, వర్గ ప్రజా సంఘాల ప్రభావం, సామర్థ్యాన్ని పెంచాలి. దీనికి ఉపయోగపడే అనేక విషయాలను పార్టీ మహాసభ నిర్మాణ సమీక్షా నివేదికలో చర్చించాం. మానవులకు జీవ కణాల వలె, పార్టీకి జీవ కణాలైన శాఖలు చాలా ముఖ్యమైనవి. దేశవ్యాప్తంగా దాదాపు లక్ష శాఖలు ఉన్నాయి. శాఖల కార్యకలాపాలను సమన్వయం చేసే స్థానిక కమిటీలు, ఉపకమిటీలు ఉన్నాయి. జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలు, కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో ఉన్నాయి. ఈ కమిటీల పనితీరును, సామర్థ్యాలను అనేక రెట్లు పెంచాలని పార్టీ మహాసభ నిర్ణయించింది. పార్టీ స్వంత బలాన్ని పెంచుకోవడంలో ఇదొక కీలకమైన కర్తవ్యం. దీనికి సమాంతరంగా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై స్థానికంగా ఆందోళనలు చేపట్టాలి. ప్రజల స్థానిక సమస్యలపై పోరాటాలను విజయవంతం చేయడంపై దృష్టి పెట్టాలని మహాసభ నిర్ణయించింది. పార్టీ సభ్యులు, ప్రజా సంఘాలు ప్రజలతో మమేకమై కార్యకలాపాలను చేపట్టాలని నిర్ణయించాం. వయనాడ్ కొండచరియల విపత్తు బాధితులకు ఇండ్లు అందించే ప్రాజెక్టులో భాగంగా డీవైఎఫ్ఐ కార్యకర్తలు రూ.20.4 కోట్లను సేకరించారు. వ్యర్థ పదార్థాలను సేకరించి విక్రయించి బిర్యానీ ఛాలెంజ్ నిర్వహించారు. ఈ విధంగా సేకరించిన మొత్తాన్ని పార్టీ కేంద్ర కమిటీకి సమర్పించినప్పుడు చాలామందికి ఆశ్చర్యం కలిగింది. ఇటువంటి కార్యకలాపాలతో సాధించిన విజయాలను మదురై పార్టీ మహాసభ గుర్తు చేసింది. ఇది కొత్త పోరాట నమూనాలను స్వీకరించడానికి మాకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను.

సంఘ్ పరివార్‌ను సైద్ధాంతికంగా, సాంస్కృతికంగా ఎదుర్కోవడానికి మీరు ఎలాంటి ప్రణాళికను అమలు చేయాలనుకుంటున్నారు?

సంఘ్‌పరివార్ ప్రభావం సమాజంలో లోతుగా పాతుకు పోయింది. ఆర్‌ఎస్‌ఎస్ అనేక పేర్లతో, వివిధ రూపాల్లో ఉన్న సంస్థల ద్వారా పనిచేస్తుంది. మన దేశంలోని చాలా రాజకీయ పార్టీలు దీనివల్ల కలిగే ముప్పును తీవ్రంగా పరిగణించడానికి ఇష్టపడటం లేదు. బీజేపీని తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్న మరో రాజకీయ పార్టీగా మాత్రమే చూస్తున్నాయి. బీజేపీని కేవలం ఒక రాజకీయ పార్టీగానే చూడలేము. సీపీఐ(ఎం) పార్టీ కార్యక్రమంలో పేర్కొన్నట్టుగా, బీజేపీ అనేది ఫాసిస్ట్ ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో పని చేస్తున్న ఒక రాజకీయ పార్టీ. ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళికను సాకారం చేయడానికి ఏర్పడింది. దేశంలోని ఇతర ప్రతిపక్ష పార్టీలు ఈ కోణంలో చూడలేకపోవడం వల్ల సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పరిమితులు ఏర్పడుతున్నాయి. ప్రతిపక్షాలలో ఈ స్పష్టత లేకపోవడం సంఘ్‌పరివార్ పట్ల సైద్ధాంతిక ప్రతిఘటనను బలహీనపరుస్తున్నది.

సంఘ్‌పరివార్‌కు వ్యతిరేకంగా సీపీఐ(ఎం), వామపక్షాల వైఖరిని, భావజాలాన్ని ఎలా వ్యాప్తి చేయబోతున్నారు?

1990 ప్రారంభంలో దేశ రాజకీయాల్లో బీజేపీ ముప్పుగా ఎదగడం ప్రారంభించినప్పుడు, 'ఫ్రంట్‌లైన్' వారపత్రిక ఆరెస్సెస్ అంటే ఏమిటి? అనే దానిపై అప్పటి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి రాసిన 'వాట్ ఈజ్ హిందూ స్టేట్' అనే వ్యాసం ప్రచురించింది. దీనిని ఫ్రంట్‌లైన్ స్వయంగా పుస్తకంగా కూడా ప్రచురించింది. ఇప్పుడు పార్టీ మహాసభ సందర్భంగా దాన్ని తిరిగి ప్రచురించారు. బీజేపీ అన్ని రాజకీయ పార్టీల వంటిది కాదన్న సీపీఐ(ఎం) వైఖరికి అది అద్దం పడుతుంది. కానీ బూర్జువా మీడియా ఆధిపత్యం ఉన్న భారతీయ సమాజంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల ప్రమాదం గురించి సీపీఐ(ఎం), వామపక్షాలు చెప్పేది తగినంతగా వ్యాప్తి చెందడం లేదు. ఈ బలహీనతను పరిష్కరించడానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని పార్టీ మహాసభ నిర్ణయించింది. ఇది ఒక సాంస్కృతిక, రాజకీయ లక్ష్యం. ఇది కేవలం సాంస్కృతిక సంఘాలపై ఆధారపడటంతోనే నిర్వహించలేం. అన్ని వర్గ, ప్రజా సంఘాల్లో ప్రజల సాంస్కృతిక జీవితంలో జోక్యానికి ఒక సంస్థాగత వ్యవస్థ ఉండాలి. ప్రస్తుతం ఇది ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో జరుగుతోంది. అయితే, సంఘ్ పరివార్ సంస్థలు వ్యక్తిగతంగా, సమిష్టిగా ఇండ్లలో, కార్యాలయాల్లో నిర్వహించే సూక్ష్మమైన పనిపై దృష్టి పెట్టాలి. దీనిని ఎదుర్కోవడానికి, ప్రజలను వారి నివాస ప్రాంతాల్లో సందర్శించడం, వారితో ఓపికగా మాట్లాడటం, మతపరమైన ఆలోచనల పట్టు నుంచి వారిని విడిపించడానికి వివిధ స్థాయిలలో క్రమపద్ధతిలో పనిచేయాలి.




వామపక్షాలకు ఈ దేశంలో భవిష్యత్తులేదనే వారికి మీ సమాధానం ఏమిటి?

సాధారణంగా ప్రపంచ పరిస్థితిని అంచనా వేసేటప్పుడు, కొన్ని చోట్ల తీవ్ర మితవాద పెరుగుదలను ఉదహరిస్తూ కమ్యూనిస్టులు, వామపక్షాలకు భవిష్యత్తు లేదని వాదించేవారు ఉన్నారు. కానీ కమ్యూనిస్టులు, వామపక్షాల ప్రభావం లేని ప్రపంచం భవిష్యత్తు గురించి ఆలోచనాపరులైన ప్రజలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలు కోట్లాది మంది ప్రజలపై ఎన్ని భరించలేని కష్టాలను రుద్దుతున్నాయి? ఆక్స్‌ఫామ్ వంటి స్వతంత్ర పరిశోధనా బృందాలు దీనిపై గణాంకాలను అందిస్తాయి. ప్రపంచ జనాభాలో 95 శాతం మంది సంపద మొత్తం కంటే, ఒక శాతం మంది అత్యంత ధనవంతుల సంపద ఎక్కువ. బిలియనీర్ల సంపద ప్రతిరోజూ 2.7 బిలియన్ డాలర్లు పెరుగుతోంది. మరోవైపు ద్రవ్యోల్బణం 1.7 బిలియన్ల కార్మికుల వాస్తవిక ఆదాయాన్ని తగ్గిస్తోంది. ఔషధాలు, వ్యవసాయం, సాంకేతికత వంటి రంగాలలో ఒక సమూహం ప్రపంచ గుత్తాధిపత్యాన్ని సాధించింది. ఏడు సోషల్ మీడియా, టెక్నాలజీ, చిప్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 12 ట్రిలియన్ల అమెరికా డాలర్లకు చేరుకుంది. వారు ఈ ఆధిపత్యాన్ని ఉపయోగించి ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు. రాజకీయ జోక్యం చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు పన్నులు తగ్గించడం ద్వారా, కార్మిక చట్టాలను బలహీనపరచడం ద్వారా కార్పొరేట్లకు సహాయం చేస్తున్నాయి.

ప్రపంచంలో ఉక్రెయిన్, గాజాలో దోపిడీ వ్యవస్థ సృష్టించే యుద్ధాలు, మారణహోమాన్ని మనం చూస్తున్నాము. అధిక లాభాల కోసం సహజ వనరులను దోపిడీ చేయడం వెనుక పెట్టుబడిదారీ విధానం చోదక శక్తిగా ఉంది. దీనిని నిరోధించగలిగే శక్తులు కమ్యూనిస్టులు మాత్రమే. ఇప్పటికే ఈ వెలుగులో ప్రపంచ జనాభాలో 25శాతం మంది అసమానతలు లేని సామ్యవాద సమాజాలను నిర్మించడానికి మార్గాలను అన్వేషిస్తున్న దేశాలలో నివసిస్తున్నారని అంచనా. అందువల్ల, ప్రపంచ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తే వారికి పెట్టుబడిదారీ విధానం సృష్టిస్తున్న దుస్థితి, దానిని అంతం చేయగలిగేది కమ్యూనిజమేనన్న వాస్తవం బోధపడుతుంది.


ప్రపంచంలోనే దేశాల మధ్య వైరుధ్యాలు వేర్వేరుగా ఉన్నాయి కదా!, అన్ని దేశాల్లో పరిస్థితులను ఒకేలా అర్థం చేసుకోవడం సాధ్యమా?

అవును, ప్రపంచంలోని దేశాల మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. అన్ని దేశాల్లో పరిస్థితులు ఒకేలా ఉండవు. కానీ అన్ని దేశాల్లో ప్రజలు దోపిడీకి గురవుతున్నారు. అందుకే ప్రతి దేశానికి అనువైన రూపంలో సమ సమాజాన్ని అభివృద్ధి చేయవచ్చని సీపీఐ(ఎం) దృఢంగా విశ్వసిస్తున్నది. భారత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సోషలిస్ట్ సమాజాన్ని ప్రజా ప్రజాస్వామ్య మార్గం ద్వారా నిర్మించాలనే ఆలోచనను పార్టీ 24వ మహాసభ ముందుకు తెచ్చింది. ప్రపంచంలోలానే, భారతదేశంలో 2017-18లో మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా 32 శాతం. 2024-25లో ఇది 26.5 శాతానికి తగ్గింది. 2014-15లో 20.8 శాతంగా ఉన్న ఆదాయపు పన్ను ఆదాయం వాటా 2024-25లో 30.9 శాతానికి పెరిగింది. కార్పొరేట్ పన్ను కోతల వల్ల ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.1.45 లక్షల కోట్లు నష్టపోతోంది. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత అసమానతలు కలిగిన దేశంగా మారింది. జనాభాలో ఒక శాతం మంది నియంత్రణలో దేశ ఆదాయంలో 22.6 శాతం ఉంది. దేశ సంపదలో 40.1 శాతం వారివద్దే ఉంది.



భారతదేశం బలమైన మత ప్రభావం కలిగిన దేశం. కమ్యూనిస్టులు, సోషలిస్టులు మత వ్యతిరేకులని జరుగుతున్న ప్రచారం సీపీఐ(ఎం) బలోపేతానికి ఆటంకం కలిగించడం లేదా?

కమ్యూనిస్టులు మత వ్యతిరేకులనేది నిరాధారమైన ప్రచారం. కమ్యూనిస్టులు మత విశ్వాసాలకు వ్యతిరేకం కాదు. మతం పేరుతో జరుగుతున్న ఉన్మాద చర్యలకు, మతోన్మాదానికి, మత విభజనలకు వ్యతిరేకం. 1864లో ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ (ఫస్ట్ ఇంటర్నేషనల్)ను కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, మిఖాయిల్ బకునిన్ ఏర్పాటు చేసినప్పుడు దీనిని స్పష్టం చేశారు. రష్యన్ విప్లవకారుడు బకునిన్ ఇంటర్నేషనల్‌లో మతపరమైన భావజాలాలతో సంబంధం లేని వారిని మాత్రమే సంస్థలో సభ్యత్వంలోకి చేర్చాలని వాదించారు. మార్క్స్, ఎంగెల్స్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికుల విముక్తి కోసం పోరాటంలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్న అన్ని మతపరమైన, దైవిక వ్యక్తులను సంస్థలో చేర్చవచ్చని మార్క్స్, ఎంగెల్స్ వాదించారు. బకునిన్ వైఖరిని అంగీకరించే యాంత్రిక భౌతికవాదాన్ని సీపీఐ(ఎం) సమర్థించదు. మత విశ్వాసులను సమీకరించడంతో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడం, విస్తరించడం సీపీఐ(ఎం) వైఖరి. ఇది 24వ పార్టీ మహాసభ డాక్యుమెంట్ మరింత స్పష్టం చేసింది.



పెరుగుతున్న బీజేపీ ప్రభావాన్ని ఎలా ఎదుర్కొంటారు?

కేంద్రంలో అధికారంలో ఉండటం కొన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైఖరిని అంగీకరించడానికి మార్గం సుగమం చేసింది. సంఘ్‌పరివార్ చేతుల్లో గాంధీజీ రక్తం మరకలు ఉన్నాయని, గాంధీజీని చంపిన తుపాకీతోనే గుజరాత్ మారణహోమం చేశారని, కల్బుర్గి, గౌరీ లంకేష్, దభోల్కర్ ప్రాణాలను తీశారని మన దేశంలో అందరికీ అర్థమయ్యేలా చేస్తేనే కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకున్న నయా-ఫాసిస్టులను తరిమికొట్టగలం. వారు రెండు శాతం ఓట్ల తేడాతో కేంద్రంలో అధికారంలో ఉన్నారు. అందువల్ల, మోడీని ఓడించగల శక్తులు ఆయన చుట్టూ ఉన్నాయనే వాస్తవిక, ఆశావాద నమ్మకాన్ని మనం ప్రజల్లో కలిగించగలగాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం ముగియదు. ఈ వ్యక్తులు దశాబ్ద కాలంగా క్రమపద్ధతిలో భారతీయ సమాజంలోని దాదాపు ప్రతి భాగాన్ని మతోన్మాదంతో విషపూరితం చేశారు. భారతీయ సమాజ పరిరక్షణకు ఒక భారీ రాజకీయ, సాంస్కృతిక చికిత్స చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిని సాధించడానికి సీపీఐ(ఎం), భావసారూప్యత కలిగిన పార్టీలు, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంస్థలు, వ్యక్తులు ఐక్యంగా ఉండాలని ప్రతిపాదిస్తున్నది. దీనిని సమర్థవం తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే సీపీఐ(ఎం), వామపక్షాలు ఇప్పుడున్న దానికి పదిరెట్ల బలాన్ని పొందాలి.



ఈ ప్రశ్నకు బదులేదీ?



ఇది సినిమా పాట కాదండీ! నిజ జీవితం.. తర్కానికి అందని న్యాయం! దుర్మార్గమంటే ఏమిటి? క్రూరత్వానికి పర్యాయపదం ఏమిటి? లైంగిక దాడి అంటే ఏమిటి? న్యాయమంటే ఏమిటి? అన్యాయానికి వత్తాసు పలకటం ఏ విధంగా జరుగుతుంది? ఇటువంటి లక్షోపలక్షల న్యాయబద్ధమైన ప్రశ్నలు ఇప్పుడు భారతీయుల మెదళ్లలో మొలకెత్తుతున్నాయి.

గుల్ఫిషా ఫాతిమా వయస్సు 31 ఏండ్లు. 2020 నుంచి తీహార్ జైల్లో మగ్గుతున్నది. ఈ నెల 9వ తేదీకి జైల్లో అడుగుపెట్టి ఐదేండ్లు పూర్తయ్యాయి. ఒక పేద ముస్లిం కుటుంబంలో పుట్టిన గుల్ఫిషా ఫాతిమా ఉ.పా చట్టం (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) కింద అరెస్టయ్యేనాటికి ఢిల్లీ యూనివర్సిటీలో ఉర్దూ ఆనర్స్ చదువుతున్నది. రేడియో జాకీగా పనిచేస్తున్నది. సీఏఏ వ్యతిరేక ఆందోళనలో గుల్ఫిషా ఫాతిమా చురుగ్గా పాల్గొన్నది. ఇదే ఢిల్లీ పోలీసులకు, మోడీ ప్రభుత్వ ఆగ్రహానికి కారణమైంది. 2020 ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లకు కారణమైన వారిలో గుల్ఫిషా కూడా ఒకరని ప్రభుత్వం లెక్కకట్టి అరెస్టు చేసింది. ఆమెకు వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యాన్ని కూడా పోలీసులు చూపించలేక పోయినారు. ఆమె నేరంపై విచారణ మొదలే కాలేదు. ఐదేండ్లు గడిచిపోయాయి. ఆమె 31 ఏండ్ల జీవితంలో 5 ఏండ్లు జైలు పాలు.

గత మూడేండ్లుగా ఆమె బెయిల్ కోసం ప్రయత్నిస్తూ ఉన్నది. రెండు సార్లు బెయిల్ దరఖాస్తు హైకోర్టు డివిజన్ బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. కానీ బెయిల్‌పై తీర్పు ఇవ్వక మునుపే జడ్జీల బదిలీ జరిగిపోతున్నది. సుప్రీంకోర్టు బెయిల్ విషయంలో జోక్యం చేసుకోవటానికి నిరాకరించింది. 'బెయిల్ రూల్ జైలు ఎగ్జంప్షన్' చెప్పటానికి, వినటానికి బాగుంటుంది కానీ, ఆచరణలో అది అందరికి సమానంగా ఆపాదించబడదు. ఇప్పుడు మూడోసారి బెయిల్ కోసం విచారణ జరగనున్నది.

ఇప్పుడు ఇటువంటిదే మరో సందర్భం చూద్దాం. ఢిల్లీ రాష్ట్రానికి ప్రస్తుత న్యాయశాఖ మంత్రిగా ఉన్న కపిల్ మిశ్రా ఆనాడు ఢిల్లీలో జరిగిన అల్లర్లలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని, ఘర్షణ రెచ్చగొట్టాడని ప్రత్యక్షసాక్షిగా మహమ్మద్ ఇలియాస్ స్వయంగా పోలీసు స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫిర్యాదు తీసుకోవటానికి నిరాకరించారు. దానితో ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. కపిల్ మిశ్రాపై తాను చేసిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని పోలీసులకు ఆదేశం ఇవ్వమని జిల్లా కోర్టును అభ్యర్థించాడు. ఇలియాస్ చేసిన ఆరోపణను పరిశీలించిన అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వైభవ్ చురాసియా, ఇలియాస్ చేసిన ఆరోపణలు, సాక్ష్యాలు అల్లర్లలో కపిల్ మిశ్రా పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించింది. అల్లర్లు జరిగిన ప్రాంతంలో కపిల్‌మిశ్రా ఉన్నాడని, ఆయన స్వయంగా ఇచ్చిన వాంగ్మూలంలో తాను అక్కడే ఉన్నట్టు అంగీకరించడాని, 'అదర్ సైడ్ ముస్లిమ్స్' అనే మాట ఉపయోగించటం, ముస్లింల పట్ల వ్యతిరేక భావాన్ని సూచిస్తున్నదని, కనుక ఎఫ్ఐఆర్ నమోదు చేసి, విచారణ చేయమని కోర్టు పోలీసులను ఆదేశించింది.

ఈ ఆదేశంపై స్టే ఇవ్వాలని కోరుతూ, కపిల్ మిశ్రా, ఢిల్లీ పోలీసులు వేర్వేరుగా హైకోర్టుకు వెళ్లారు. పోలీసులైతే ఏకంగా కపిల్ మిశ్రాకు క్లీన్ చిట్ ఇచ్చేశారు కూడా. ఈ స్టే ఎంత త్వరగా వచ్చిందంటే, మన న్యాయ స్థానాలు ఇంత తొందరగా స్పందిస్తాయా అని మూర్ఛపోవాలి. ఏప్రిల్ 1న జిల్లా జడ్జి విచారణకు పోలీసులను ఆదేశిస్తే, దానిపై ఏప్రిల్ 8 న హై కోర్టును కపిల్ మిశ్రా, పోలీసులు ఆశ్రయిస్తే, త్వరలో పరిశీలిస్తామని కోర్టు చెప్పిన మర్నాడే హైకోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా స్టే ఆర్డర్ కూడా జరిగిపోయింది. ఒక న్యాయ శాఖమంత్రి మీద చేసిన ఆరోపణల్లో ప్రాథమిక ఆధారాలున్నాయని జిల్లా జడ్జి భావించి, విచారణకు ఆదేశిస్తే, ముద్దాయిగా వున్న ఢిల్లీ న్యాయ శాఖమంత్రి రాజీనామా చేయలేదు. పైగా పోలీసులు కూడా ఆ మంత్రికి మద్దతుగా కోర్టుకెళ్ళి విచారణ అవసరం లేదని చెప్పటం మన నిష్పక్షపాత న్యాయస్థానాల్లో జరిగే వింత.

వడ్డించేవాడు మనవాడు అయితే కడబంతిన కూర్చున్నా అన్ని అందుతాయనే సామెత ఊరకే రాలేదని ఇటువంటి వాటిని చూస్తే అనిపిస్తుంది. ఐదేండ్లుగా బెయిల్ కోసం ఎదురుచూస్తూ, జైల్లో మగ్గుతున్న గుల్ఫిషా ఫాతిమా ఒకవైపు, ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి గనుక విచారించమని కోర్టు ఆదేశంపై స్టే మరో వైపు, న్యాయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఎక్కడ వెతుక్కోవాలి? రాజ్యాంగ ప్రతుల్లోనా, న్యాయ స్థానాల మెట్ల మీదా? న్యాయ మూర్తుల హృదయాల్లోనా? దీనికి ఎవరు చెబుతారు సమాధానం?

- కర్లపాలెం

బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో భేటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలిలో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లు ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం దాన్ని నిజం చేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో ఆమె భేటీ అయ్యారు. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జోతిబా పూలే విగ్రహ ఏర్పాటుకు మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బహుజనుల సాధికారతకు ప్రతీకగా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్టించాలని కోరారు. ఇదే డిమాండ్‌తో తాము అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతు కూడగట్టామన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతోనే రిజర్వేషన్ల అమలుకు ఉన్న 50 శాతం పరిమితి అడ్డంకి తొలగిపోయిందని అన్నారు. ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం కష్టతరమేమి కాదన్నారు. ఈ బిల్లును కేంద్రం ఆమోదించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి మోడీ అపాయింట్‌మెంట్‌ను వెంటనే తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు.

పూలే విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తున్నాం : కవిత

హైదరాబాద్‌లో మహాత్మా జోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. అసెంబ్లీ ఆవరణలో విగ్రహం పెట్టేవరకు పోరాడతామని చెప్పారు. అంతకుముందు హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో ఉన్న మహాత్మా జోతిబా పూలే విగ్రహానికి బీసీ నాయకులతో కలిసి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రాంచందర్, కో కన్వీనర్ బొల్ల శివ శంకర్, యూపీఎఫ్ నాయకులు అలకుంటల హరి, కొట్టాల యాదగిరి, ఎత్తరి మారయ్య, గోపు సదనందు, విజేందర్ సాగర్, రాచమల్ల బాలకృష్ణ, డి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కవిత పోరాటానికి మద్దతు : జాన్‌వెస్లీ

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్సీ కవిత పోరాటానికి పూర్తి మద్దతు తెలుపుతున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన అభినందనీయమన్నారు. కుల అసమానతలను నిర్మూలించకుండా దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్లదనేది తమ నమ్మకమని అన్నారు. కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణన వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

పూలే స్ఫూర్తితో మనువాదంపై మహోద్యమం

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు
- కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- మేడ్చల్ జిల్లాలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె. వెంకట్, ఎం. అడివయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

సామాజిక విప్లవ స్ఫూర్తి ప్రదాత జోతిబా పూలే స్ఫూర్తితో మనువాదంపై మహోద్యమం నిర్మించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అంబర్‌పేట బతుకమ్మ కుంట నుంచి ఛే నెంబర్ మీదుగా పూలే విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పూలే విగ్రహానికి సీఐటీయూ నగర అధ్యక్షులు కుమార్‌తో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. పూలే నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. ఆయన స్ఫూర్తితో కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాన్ని చేపట్టాలన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడాలని తెలిపారు. బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా కార్పొరేట్ శక్తులకు మోడీ అమ్ముతున్నారని, దాంతో దళిత, గిరిజన, బలహీనవర్గాలకు క్రమంగా రిజర్వేషన్లు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. పూలే పోరాట స్ఫూర్తితో బీసీ కులగణన వంటి న్యాయమైన డిమాండ్ సాధనకు ఉద్యమించాలన్నారు. మతోన్మాద మనువాద శక్తులపై పోరాడుతూ రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, ప్రభుత్వ రంగ సంస్థలను, సామాజిక న్యాయాన్ని మతసామరస్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను సవరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బీజేపీ విధానాలు ఉన్నాయన్నారు. నాడు బొంబాయి నూలు మిల్లు కార్మికుల పోరాటంలో పూలే ప్రత్యక్షంగా పాల్గొని కార్మికులకు బాసటగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు, కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి బిత్ర సుబ్బారావు, సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు మోహన్, మల్లికార్జున్, వెంకటయ్య, రాజు, సోమయ్య, సురేష్ మాలోత్ వీర్య, శంకరయ్య శ్రీను, ఏసు, జనార్ధన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సైనిక్‌పురిలోని మెయిన్ రోడ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలే స్ఫూర్తితో సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కె.చంద్రమోహన్, సుల్తాన్, రమేష్ బాబు, జిల్లా నాయకులు రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

బీహార్, యూపీ, జార్ఖండ్‌లో

భారీ వర్షాలు

102 మంది మృతి

న్యూఢిల్లీ : బీహార్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్‌లో భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా ఈ మూడు రాష్ట్రాల్లోనూ 102 మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. బీహార్‌లో అత్యధికంగా 80 మంది మరణిం చారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసాయి. దీంతో అనేక ప్రాంతాలు జలమ య్యాయి. పిడుగులు, వడగండ్ల కారణంగా మరణాలు సంభవిం చినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటుంబాల ఒకొక్కరికీ రూ 4 లక్షల పరిహారాన్ని ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ప్రకటించారు. అయితే రాష్ట్రంలో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉందని ఆర్‌జేడీ నాయకులు తేజస్వీ యాదవ్ తెలిపారు. వర్షాలతో నష్టపోయిన రైతులకు కూడా పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ఒక్క అడుగు వెనక్కు?



డోనాల్డ్ ట్రంప్‌కు తత్వం బోధపడ్డట్టుంది. ప్రపంచ దేశాలతో రాజీకి వస్తున్నాడా!! మూడునెల్లపాటు తాను ప్రకటించిన పన్నుల యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లు చేసిన ప్రకటన దేనికి సూచిక ? ప్రపంచ మార్కెట్ల మీద చైనా ఎలాంటి గౌరవం ప్రదర్శించని కారణంగా 125శాతం విధిస్తున్నట్లు, దానిపై ఎలాంటి సంప్రదింపులు ఉండవని ట్రంప్ చెప్పటం మేకపోతు గాంభీర్యం తప్ప మరొకటి కాదు. యావత్ ప్రపంచం మీద పన్నుపోరు ప్రకటించిన అతగాడి నిర్వాకం కారణంగా స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయన్నది తెలిసిందే. మూడు నెలల వాయిదా ప్రకటనతో ప్రపంచవ్యాపితంగా స్టాక్‌మార్కెట్లు కోలుకున్నాయి. చిత్రం ఏమిటంటే చైనా మీద విధించిన 125 శాతంపై వెనక్కు తగ్గేది లేదన్న తర్వాత కూడా చైనా స్టాక్ మార్కెట్లు మిగతా వాటితో పాటు గురువారం నాడు పెరిగాయి. ఈ పూర్వరంగంలో చైనా మీద ప్రతి సుంకాలు ఎందుకు ప్రభావం చూపలేదు ? పర్యవసానాలేమిటి? అసలు ట్రంప్ ఎందుకు వెనక్కు తగ్గాడనే చర్చ, విశ్లేషణలు ప్రారంభమయ్యాయి.

మూడు నెలల వాయిదాకు దోహదం చేసిన అంశాలేమిటి? తమ మంత్రిత్వశాఖలు, వాణిజ్య ప్రతినిధితో 75దేశాలు సంప్రదింపులు జరిపినట్లు ట్రంప్ చెప్పుకున్నాడు. అలాంటి వారి మీద సభ్య సమాజం ఉచ్చరించటానికి సిగ్గుపడే పదజాలంతో వ్యాఖ్యానించాడు.వారంతా ఒప్పందం చేసుకోవటానికి చచ్చిపోతున్నారన్నాడు.రిపబ్లికన్ పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ 'మనకు ఫోన్లు చేస్తున్న దేశాల వారు ప్లీజ్ ప్లీజ్ సర్ ఒప్పందం చేసుకోండి, నేను ఏదైనా చేస్తాను' అని చెబుతున్నారని, చివరకు తనను ముద్దు పెట్టుకుంటానన్నారని నోరుపారేసుకున్నాడు. ఇది నిజమా? అబద్దాలు, గొప్పలు చెప్పటంలో ఆరితేరిన ట్రంప్ గురించి తెలిసినప్పటికీ తెరవెనుక సిగ్గు ఎగ్గూలేని అలాంటి బాపతు ఉన్నా ఆశ్చర్యం లేదు. చైనా సరేసరి తగ్గేదేలే అని చెప్పింది. మిత్రపక్షంగా ఉన్న ఐరోపా సమాఖ్య 2300కోట్ల్ డాలర్ల మేరకు అమెరికా వస్తువుల మీద పన్ను విధించనున్నట్లు ప్రకటించింది, కెనడా కూడా అదే బాటలో ఉంది.మన దేశం మౌనభాషనే కొనసాగిస్తోంది. అటూ ఇటూ ఏదీ చెప్పకుండా గోడమీద పిల్లి వాటాన్ని ప్రదర్శిస్తున్నాం. ఎక్కువ పన్నులు విధించిన దేశాల నుంచి సరుకులను మనదేశానికి దిగుమతి చేసుకొని వాటిని తిరిగి ఎగుమతి చేయవద్దని మన వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ మన ఎగుమతిదార్లను హెచ్చరించారు. పిటిఐ వార్త మేరకు చైనా, ఇతర ఆసియన్ దేశాల సరుకులను మన దేశం నుంచి ఎగుమతి చేయవద్దని చెప్పారట. అలా జరుగుతోందని గతంలో ఎన్నడూ మన ప్రభుత్వం చెప్పలేదు. ఇప్పుడు అలా మాట్లాడారంటే ఎవరి మెప్పు పొందేందుకో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ మరో సందేహం కూడా తలెత్తుతోంది. గతంలో అలా చేసిఉంటే అసలు నిజంగా మన ఎగుమతులు పెంచామని బీజేపీ పాల కులు కొట్టుకుంటున్న డబ్బా మీదనే అనుమానం వస్తోంది. మనది 'దలాల్' ప్రభుత్వమా?

> ఎక్కువ పన్నులు విధించిన దేశాల నుంచి సరుకులను మనదేశానికి దిగుమతి చేసుకొని వాటిని తిరిగి ఎగుమతి చేయవద్దని మన వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ మన ఎగుమతిదార్లను హెచ్చరించారు. పిటిఐ వార్త మేరకు చైనా, ఇతర ఆసియన్ దేశాల సరుకులను మన దేశం నుంచి ఎగుమతి చేయవద్దని చెప్పారట. అలా జరుగుతోందని గతంలో ఎన్నడూ మన ప్రభుత్వం చెప్పలేదు. ఇప్పుడు అలా మాట్లాడారంటే ఎవరి మెప్పు పొందేందుకో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ మరో సందేహం కూడా తలెత్తుతోంది. గతంలో అలా చేసిఉంటే అసలు నిజంగా మన ఎగుమతులు పెంచామని బీజేపీ పాల కులు కొట్టుకుంటున్న డబ్బా మీదనే అనుమానం వస్తోంది. మనది 'దలాల్' ప్రభుత్వమా?

అసలు పన్నుల వాయిదా నిర్ణయానికి దారితీసిందేమిటి? మొదటి కారణంగా చెప్పుకోవాలంటే అమెరికాలో ఏప్రిల్ ఐదున 150 సంస్థల పిలుపు మేరకు 20లక్షల మంది జనం1400 ప్రదేశాల్లో నిరసనలు, ప్రదర్శనలు చేశారు. వెనక్కు తగ్గకపోతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తొలుత మద్దతు ప్రకటించిన ద్రవ్య పెట్టుబడిదారులు, ఇతరులు కూడా పర్యవసానాలను చూసి వైఖరి మార్చుకుంటున్నారు. ఒక్కరంటే ఒక్క ఆర్థికవేత్త కూడా సానుకూలంగా మాట్లాడిన ఉదంతం లేదు. ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాత భారీగా పెరుగుతుందని ఆశించిన ఎలన్ మస్క్ సంపద ఇప్పటి వరకు 13,500కోట్ల డాలర్లు హరించుకుపోయింది. చైనాతో సహా ఎవరి మీదా పన్నులు వేయవద్దని, పునరాలోచించాలని ట్రంప్‌ను మస్క్ గట్టిగా కోరినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక రాసింది. చైనా వెనక్కు తగ్గకపోగా ఐరోపా సమాఖ్య కూడా ప్రతిఘటనకు పిలుపు ఇచ్చింది. పన్నుల విధింపులో కీలక పాత్ర పోషించిన సలహాదారు పీటర్ నవారో, మరో కీలక సలహాదారు ఎలన్‌మస్క్ రోడ్డెక్కి దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఈ పరిణామాలతో గోడమీద పిల్లులు కూడా వ్యతిరేక శిబిరంలో చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్వదేశంలో పెట్టుబడులు పెట్టి వస్తూత్పత్తి చేయాలన్న పిలుపుకు పెద్ద స్పందన కనిపించటం లేదు. మూడు నెలల కాలంలో లొంగుబాటును ప్రదర్శించే దేశాల మీద కొన్ని ఒప్పందాలను రుద్ది లబ్ది పొందే ఎత్తుగడ కూడా దీని వెనుక ఉండవచ్చు. ఈ వ్యవహారం కూడా త్వరంలోనే బట్టబయలు కానుంది. ఒకడుగు వెనక్కు వేసిన ట్రంప్‌ను దారికి తేవాలంటే అమెరికన్లు మరింతగా వీధుల్లోకి రావాలి, బాధిత దేశాలన్నీ సమైక్యం కావాల్సిన అవసరం ఉంది. భారీ విజయం పొందిన యాభై రోజుల్లో "పిచ్చివాడు" అని పిలిపించుకున్న చరిత్ర, అంత వ్యతిరేకత మూటగట్టుకున్నవాడు ట్రంపే!

చెట్టుంటేనే కదా ఓ పిట్ట వాలేది ,
పిట్టను చూసే కదా పది పక్షులు
పేరంటానికి వచ్చేది .
గోరువంకల గుసగుసలు, కోకిల గానాలు,
నెమలి నాట్యాలు,
పచ్చని భూతల్లి గుండెల
మీదనే గదా పల్లవించేది .
నీటి కుంటలు, పిల్ల కాలువలు ...
నగరానికెంత దూప తీరుస్తున్నాయో చూశావా..?
మీరోడ్డు మోటర్లు వదిలే పొగను పీల్చుకొని
మీ గుండెలకెన్ని టన్నుల ఆక్సిజన్‌ను
అందిస్తున్నాయో ...
ఎప్పుడైనా గమనించావా..?

అహాలనూ, అధికారాలనూ వదిలి,
ఒంటరి బాటసారివై ఓసారి
అడవిలో తిరిగిచూడు.
సైనికుల్లా బారులుగా సాగే ఎర్రచీమలు,
ఈత చెట్టుకు అల్లుకున్న

విధ్వంస రచన



దుసరి తీగల హొయలు,
కొలనుపక్క జువ్వి చెట్టుమీద
గుడ్డి కొంగల కాపురాలు,
మద్దిచెట్టు కొమ్మల మీద నెమలి క్రీంకారాలు,
గరక పాకిన మైదానం మీద లేడి పిల్లల దుంకులాట,
జిట్టరేగి పొదలో చుట్టుకున్న పాము,
కుందేలు సోపతి .
పరుపు బండలు, నిగిడిన గుండ్లు,
చినుకు పడితే అడవి వెదజల్లే సుగంధాలు,
ఓసారి గుండె నిండా కండ్లు చేసుకొని
చూడు,
ఎన్ని ఇంద్రధనస్సులు, మరెన్ని స్వర్గసీమలు
కనిపిస్తాయో..?
ఎన్ని కరెన్సీ నోట్ల కట్టలు ఖర్చు చేసినా
ఓ అడవిని సృష్టించగలమా ?
భూమంటే రియల్ ఎస్టేటని, అడవంటే
ఆక్రమించునదని
రాజకీయ దళారుల వద్ద పాఠాలు నేర్చుకున్న
కలల బేహారులకేమి తెలుసు...
మనిషికీ, అడవికీ ఉన్న అనుబంధం.

అధికారమంటే .అమ్మకం, కొనుగోళ్లుగా
మారిన ప్రజాస్వామ్యంలో వన్యప్రాణుల
ఎలిజీలను బుద్ధిజీవులే గదా వినగలిగేది .
విద్యార్థి ప్రసూణాల నిరసనలను,
వన ప్రేమికుల ఆలోచనలను
అవలోకించండి
మీ బుల్డోజర్ ఆదేశాలను తగలేయండి.
అడవిని వన్యప్రాణులతో మననీయండి.

- పుప్పాల కృష్ణమూర్తి

సమస్యల వలయంలో సాగునీటి ప్రాజెక్టులు



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

తెలంగాణలో దాదాపు అరవై శాతం జనానికి వ్యవసాయమే జీవనాధారం. అంతటి ప్రాధాన్యత గల ఈరంగం పట్ల పాలకుల చిత్తశుద్ధి కరువైంది. పేరుకు మాత్రం పెద్ద ప్రాజెక్టులు చేపట్టడం,వాటి నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడం వెరసి దశాబ్దాలుగా పనులు నత్తనడకన సాగడం, రాష్ట్రంలోని ప్రాజెక్టుల పనితీరుకు పరాకాష్ట. సాగునీటి నిపుణులు ఎంత వారించినా గత సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి నిధులన్నీ నీళ్లపాలు చేసింది. కొత్త ప్రభుత్వమైనా ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తిచేస్తుందా అంటే ఆ వైపు దృష్టే లేదనిపిస్తోంది.బడ్జెట్‌లో నిధులు కేటాయించడం వరకు బాగానే ఉన్నా వాటిలో సగం మాత్రమే ఖర్చు చేయడం మూలాన ఏడాదిలో పూర్తికావాల్సిన రిజర్వాయర్ కాస్తా ఏండ్లతరబడి కొనసాగుతున్నది. కేవలం రెండువేల కోట్ల రూపాయలతో ఏడాదిలో పూర్తయ్యే పదహారు ప్రాజె క్టులు ఉన్నా వాటిని పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది. అవి పూర్తయితే దాదాపు ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరం దుతుంది. కమీషన్లకు కక్కుర్తి పడి గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టులను ఏటీఎంలుగా మార్చుకుందనే అపవాదు ఉంది. దాన్ని తొలగించి పనిచేయాల్సిన కాంగ్రెస్ సర్కార్ కూడా అదే విధానంతో ముందుకు సాగుతున్నదనే విమర్శ మూటకట్టుకుంటోంది.

తెలంగాణ రాష్ట్రంలో 34 భారీ ప్రాజెక్టులు, 39 మధ్య తరహా ప్రాజెక్టులు, ఒకటి ఆధునికీకరణ , వరద నివారణ ప్రాజె క్టుతో మొత్తం 75 ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. 31 భారీ మధ్య తరహా (24 భారీ- 7 మధ్య తరహా) 52.95 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలి. చిన్నతరహా ఎత్తిపోతల పథకాల ద్వారా 4.76 లక్షల ఎకరాలు, చెరువుల ద్వారా 29.88 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది. వీటికింద ఇంకా 1.09 లక్షల ఎకరాలు, రాష్ట్రంలో మొత్తంగా 73.57 లక్షల ఎకరాలకు నీటి వసతి కల్పించాలి. ఇంకా 54 లక్షల ఎకరాలకు నీరందించాలి. ప్రస్తుతం 2025-26లో 5.05 లక్షల ఎకరాలకు, 2026-27లో 5.10 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించాలనేది మన ప్రభుత్వ లక్ష్యం.2025-26 బడ్జెట్‌లో రూ.23.330.65 కోట్లు కేటాయించింది.ఇందులో భారీ మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.10,838.18 కోట్లు, చిన్నతరహా వనరులకు రూ.948.60 కోట్లు మొత్తం రూ. 11,786.78 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసింది. మిగిలిన నిధులు రుణాలకు, సిబ్బందికి వ్యయం చేస్తుంది. 2023-24లో రూ.15,488.11 కోట్లు కేటాయించి రూ.11,210.57 కోట్లు వ్యయం చేసింది. 2024-25లో రూ.11,210.57 కోట్లు కేటాయించి ఫిబ్రవరి 25వరకు రూ.6,946.66 కోట్లు మాత్రమే కేటాయించింది. నిధులు కేటాయించినప్పటికీ వాటిని ఖర్చుచేసి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది.

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలను ప్రారంభంలో జూరాల ప్రాజెక్టునుండి రూ.38,500ల కోట్లతో 2004లో అప్పటి ప్రభుత్వం రూపొందించింది. దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రీ- డిజైన్‌చేసి జూరాల నుండి 250 కిలోమీటర్ల దిగువన గల శ్రీశైలం వెనుక నీటి నుండి ఎత్తి పోతలుగా 2016లో మార్చింది. రీ-డిజైన్ తర్వాత 3 ఫిబ్రవరి2025 నాటికి రూ.32,662 కోట్ల వ్యయం చేసింది. ఇంకా రూ.43వేల కోట్లు కావాలి. ఈ ప్రాజెక్టు కింద మహబూబ్ నగర్,(2,35,319 ఎకరాలు) నాగర్‌కర్నూల్ 1,03,389, నారాయణపేట్ 1,60,955, రంగారెడ్డి 3,59,046, వికారాబాద్ 3,41,952, నల్లగొండ 26,339 ఎకరాలు మొత్తం 12.30లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడంతోపాటు, 30టీఎంసీలు హైదరాబాద్‌కు తాగునీటికి సరఫరా చేయాలి. దిండి ఎత్తిపోతలను నార్లపూర్ నుండి నిర్మాణానికి మార్పుచేసింది. దిండి ఎత్తిపోతలకు రూ.6,190 కోట్ల పరిపాలన ఆమోదంతో ప్రారంభించింది. రూ.1800ల కోట్లతో ఐదు ప్యాకేజీలు 2026 సెప్టెంబర్ వరకు పూర్తి చేయాలి.పాలమూరు ఎత్తిపోతల ప్రధాన ప్రాజెక్టులు నార్లపూర్ రిజర్వాయర్, ఏదుల రిజర్వాయర్, వట్టెం రిజర్వాయర్, కరివెన రిజర్వాయర్, ఉదండాపూర్, ప్రాజెక్టులు పూర్తయ్యాయి. కానీ, కాల్వలు ప్రారంభించలేదు. ఈసారి బడ్జెట్‌లో రూ.1,714 కోట్లు మాత్రమే కేటాయించడంతో పనులు ఇంకెప్పుడు పూర్తయ్యేను అనే ప్రశ్న ప్రజల నుంచి వస్తున్నది.

కాళేశ్వరం ఎత్తిపోతల 2005లో ప్రాణహిత - చేవెళ్ల పథకం పేరుతో రూ.18,500ల కోట్లతో ప్రారంభించింది. ప్రాణహిత నుండి ఎల్లంపల్లికి లిఫ్ట్‌ద్వారా రోజుకు 2 టీఎంసీల చొప్పున 140 టీఎంసీలు ఎత్తిపోయాలి. ఎల్లంపల్లి నుండి మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండ పోచమ్మ, చేవెళ్లకు నీటిని అందించాలి. దీన్ని రీ-డిజైన్ ద్వారా ప్రాణహితకు బదులు గోదావరి నదిపై ప్రాణహిత కలిసిన తర్వాత మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణం చేసింది. మేడిగడ్డ వెనకనీటితో అన్నారం, సుండిల్ల ద్వారా ఎల్లంపల్లికి పంపాలి. అక్కడి నుండి మిడ్‌మానేరు ద్వారా గత డిజైన్‌నే అమలు చేయాలి. రీ-డిజైన్ వల్ల ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1.25 లక్షల కోట్లకు పెరిగింది. ఇంతవరకు రూ.1.10 లక్షల కోట్లు వ్యయం చేసింది. కానీ, ప్రాజెక్టు ప్రారంభించిన నెల రోజుల్లో 2023లో మేడిగడ్డ ప్రాజెక్టు కుంగింది. అన్నారం సుందిల్లకు బుంగలు పడ్డాయి. ఈ విధంగా ఈ మూడు ప్రాజెక్టులు పనికిరాకుండా పోయాయి. కాళేశ్వరం ఏడో బ్లాక్‌లో కుంగిన ఫిల్లర్లపై విజిలెన్స్ విచారించి 22మార్చి 2025న నివేదిక ఇచ్చింది. 17 మంది ఇంజనీర్లపై క్రిమి నల్ కేసులు చేపట్టాలని, మరో 30 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నివేదిక ఇచ్చింది. నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టి పై కూడా చర్యలకు సిఫారసులు చేసింది. మేడిగడ్డతో పాటు అన్నారం- సుందిల్ల ప్రాజెక్టులపై కూడా విచారణ సాగింది. నిర్మాణ లోపాలతో పాటు క్వాలిటీ కంట్రోల్ ఆపరేషన్, మెయింటేనెన్స్ విభాగాల్లో పనిచేసే వారిపై చర్యలు చేపట్టాలని ఆదేశించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లలో నీటిని నిల్వ పెట్టరాదని సలహా ఇచ్చింది. రానున్న కాలంలో ఈ మూడు ప్రాజెక్టులను వినియోగించరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ శాఖ కూడా సూచించింది. ఈ ప్రాజెక్టు పునర్ నిర్మాణం చేయడానికి రూ.20 వేల కోట్లు కావాలి. ఈ ప్రాజెక్టు నిర్వాహణ ద్వారా ఎకరాకు ప్రభుత్వం రూ.40వేలు రాయితీగా భరించాలి. ఈ మూడు ప్రాజెక్టులను తొలగించి ప్రాణహితనుండి ఎల్లంపల్లికి నీరు తేవడం ద్వారా ఎల్లంపల్లినుండి దిగువ ప్రాజెక్టులు ఉపయోగపడతాయి. ప్రాణహిత-ఎల్లంపల్లి - గంధమల్ల రిజ ర్వాయర్ వరకు నీటిని ఉపయోగించినచో ప్రభుత్వంపై ఎకరాకు రూ.10వేలు మాత్రమే వ్యయం చేయాలి అందువల్ల ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



> కాళేశ్వరం ఎత్తిపోతల 2005లో ప్రాణహిత - చేవెళ్ల పథకం పేరుతో రూ.18,500ల కోట్లతో ప్రారంభించింది. ప్రాణహిత నుండి ఎల్లంపల్లికి లిఫ్ట్‌ద్వారా రోజుకు 2 టీఎంసీల చొప్పున 140 టీఎంసీలు ఎత్తిపోయాలి. ఎల్లంపల్లి నుండి మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, చేవెళ్లకు నీటిని అందించాలి. దీన్ని రీ-డిజైన్ ద్వారా ప్రాణహితకు బదులు గోదావరి నదిపై ప్రాణహిత కలిసిన తర్వాత మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణం చేసింది. మేడిగడ్డ వెనకనీటితో అన్నారం, సుండిల్ల ద్వారా ఎల్లంపల్లికి పంపాలి. అక్కడి నుండి మిడ్‌మానేరు ద్వారా గత డిజైన్‌నే అమలు చేయాలి. రీ-డిజైన్ వల్ల ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1.25 లక్షల కోట్లకు పెరిగింది. ఇంతవరకు రూ.1.10 లక్షల కోట్లు వ్యయం చేసింది. కానీ, ప్రాజెక్టు ప్రారంభించిన నెల రోజుల్లో 2023లో మేడిగడ్డ ప్రాజెక్టు కుంగింది. అన్నారం సుందిల్లకు బుంగలు పడ్డాయి. ఈ విధంగా ఈ మూడు ప్రాజెక్టులు పనికిరాకుండా పోయాయి.

లక్ష్యం సరే, చిత్తశుద్ధే కావాలి..

గతంలో రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పేర్లతో ఖమ్మం జిల్లాలో 4 లక్షల ఎకరాలకు రూ.6వేల కోట్లతో ప్రభుత్వం పథకాలు చేపట్టింది. సీతారామ సాగర్ రీ-డిజైన్‌వల్ల ఆయకట్టు 6.5 లక్షల ఎకరాలకు పెంచుతూ రూ. 30వేల కోట్ల అంచనాలతో నిర్మాణం మొదలుపెట్టింది. 2025-26 బడ్జెట్‌లో రూ.709.35 కోట్లు కేటాయిం చింది.దీన్ని వచ్చే వానాకాలం వరకు పూర్తి చేయాలని లక్ష్యంతో పనులు సాగుతున్నాయి. సీతారామ సాగర్ నుండి ఏన్కూర్ వరకు అనుసంధాన కాల్వ నిర్మించాలి. చిన్న కాళేశ్వరం, మోడికుంట, లోయర్ పెనుగంగా, చనకా-కొరటా, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ సాగర్, కొయిల్‌సాగర్, రాజీవ్ భీమా, నెట్టంపాడు, కల్వకుర్తి, దిండి, ఎఎంఆర్ ప్రాజెక్టు, ఎస్ఎల్‌బిసి టన్నెల్, శ్రీరాంసాగర్ 2వ దశ, సదర్‌మాట్, నీల్‌వాయ్, పాలెంవాగులు 75 శాతం పూర్తయ్యాయి. వీటిని రానున్న సంవత్సరంలో పూర్తి చేయాలని బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుండి ఎఐబిపి కింద మోడికుంట, చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల, దిగువ పెనుగంగా, చనాక-కొరట ప్రాజెక్టులకు నిధులివ్వాలని కోరింది. అలాగే, కడెం ప్రాజెక్టు, లోయర్ మానేరు ప్రాజెక్టుకు పూడిక తీయడానికి డ్రెడ్జింగ్ చేయడానికి ప్రభుత్వ ఖర్చు లేకుండా "జాతీయ పూడికతీత - 2022"తో పనులు చేయించాలని కేంద్రాన్ని కోరింది. 450 చిన్న లిఫ్టులు రిపేర్లు చేయాలి. హుజూర్‌నగర్ కోదాడలో పనులు త్వరాగా ప్రారంభించాలి. ఇంత వరకు ప్రాజెక్టుల భూ సేకరణకు 5.04 లక్షల ఎకరాలు సేకరించాల్సి ఉండగా 3.89 లక్షల ఎకరాలు సేకరించింది.ఇంకా 1.147 లక్షల ఎకరాలు సేకరించాలి. నిర్వాసితులకు 30,870 గృహ నిర్మాణాలు, 48,183 ఇండ్ల పట్టాలిచ్చింది. డిసెంబర్ 2024 వరకు రూ.2,747 కోట్ల వ్యయంతో 46,904 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించింది.ఇంకా 14వేల కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. నీటి పారుదల శాఖలో 675 ఏయి పోస్టులను భర్తీ చేసింది. ఇంకా 500ల మందిని భర్తీ చేయాల్సి ఉంది.

చిక్కువీడని అంతర్రాష్ట్ర సమస్యలు

ఆంధ్రా, తెలంగాణ మధ్య ఉన్న నీటి సమస్యను కేంద్రం తేల్చడం లేదు. రెండు రాష్ట్రాల మధ్య తగదా పెట్టి చోద్యం చూస్తున్నది. సమస్యను పరిష్కరించాలని ఇరు రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చినా బ్రిజేష్ ట్రిబ్యునల్ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నది. ఈ మధ్యకాలంలో ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ విషయమై ఘర్షణ వాతావరణం తలెత్తగా దాన్ని సున్నితంగా పరిష్కరించాల్సింది పోయి ప్రాజెక్టులన్నింటినీ కేంద్ర జలవనరుల శాఖకే అప్పజెప్పాలని కేంద్రం అడుగుతున్నది. అంటే క్రిష్ణా మీద, జూరాల నుంచి, నాగార్జున సాగర్‌పై నిర్మించిన ప్రాజెక్టులన్నింటినీ కేంద్రం తమ ఆధీనంలో ఉంచుకుని ఎవరికి ఎంత నీటి వాటాను ఇవ్వాలో నిర్ణయిస్తుందన్నమాట! అంటే రాష్ట్రాలు తమ చెప్పుచేతల్లో ఉండాలనే వేస్తున్న ఎత్తుగడగా ఇది కనిపిస్తున్నది తప్ప సమస్యను పరిష్కరించే ఉద్దేశం అస్సలు కనపడటం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం క్రిష్ణా రివర్‌బోర్డు మేనేజ్‌మెంట్‌కు ప్రాజెక్టులకు అప్పగించరాదని శాసనసభలో తీర్మానం చేసింది. కేఆర్‌బీఎం అధికార పరిధిపై సుప్రీంకోర్టులో కేసు వేసింది. అయితే ఏపీ నిర్మిస్తున్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పింది. దీనివల్ల గోదావరి నీటిని తెలంగాణ ఉపయోగించుకోకుండా నష్టం వాటిల్లుతుంది.

వీటికి సంబంధించిన వివాదాలు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు నడుస్తున్నాయి. 2004లో వేసిన ట్రిబ్యునల్ నేటికీ మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య పరిష్కారం చేయడంలో విఫలమౌతున్నది. ప్రతియేటా నీటి వనరులకు కేటాయించిన నిధులు వ్యయం చేయడం లేదు. మైనర్ ఇరిగేష్ ఐడిసి లిఫ్ట్ పథకాలు, చెరువులు, మధ్య తరహా ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలి. భారీ ప్రాజెక్టులను నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలి. ఇందుకు తగిన నిధులు కేటాయించాలి. అప్పుడు మాత్రమే ప్రాజెక్టుల సమస్య పరిష్కారమవుతుంది. రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు దాటినా నీటి పంపిణీ వివాదాన్ని పరిష్కరించకుండా ఇరు రాష్ట్రాల మధ్య కేంద్రం ఘర్షణ పెట్టిన తీరు ప్రజలు గమనించాల్సిన అవసరం ఉన్నది. ■

హిందూ మతోన్మాదానికి అంబేద్కర్ ఓ సవాల్



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

స్వాతంత్ర్య భారతదేశం అంబేడ్కర్ 134వ జయంతి జరుపుకోవటానికి సిద్ధమవుతున్న సందర్భంలో ఒక పక్కపార్లమెంట్ సాక్షిగా జరిగిన ఘోర అవమానం.మరోపక్క ఆయన ఎన్నడూ లేనంత ఎత్తుకు ఎదిగినట్లు కనిపిస్తున్నది.అనేకముఖ్య ఘట్టాల్లో, ఉద్యమాల్లో నవభారత నిర్మాణం, ప్రజాస్వామ్యం, సామాజిక రుగ్మతలు లేని దేశం కోసం అంబేడ్కర్ కృషి చేశారు. ఆయన జీవితానుభవంలో గుర్తించిన సామాజిక సమస్యలు, ఉద్యమాలు, అధ్యయనం, ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలి. భారత సమాజం గురించి ఆయన లోతుగా పరిశీలన చేసి లేవనెత్తిన అనేక ప్రశ్నలు నేటికీ సజీవంగా నిలిచి ఉండటం,ఆయన కృషిని,ప్రాధాన్యతని నేటికీ గుర్తు చేస్తున్నాయి.1871 ఏప్రిల్ 14వ తేదీన మధ్య భారతదేశంలో మౌ అనే ప్రాంతంలో, మత భావాలను విశ్వసించే,పేద మెహర్ కుటుంబంలో భీమ్ రావ్ అంబేడ్కర్ జన్మించారు.పాఠశాల విద్యాభ్యాసం సతారాలోను, కళాశాల విద్యాభ్యాసం ముంబైలోను పూర్తిచేసిన అంబేడ్కర్ 1913-17లో కొద్దికాలం పాటు బరోడా మహారాజు దగ్గర సేవలందించారు.లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కొలంబియా విశ్వవిద్యాలయంలో, గ్రేస్ ఇన్ బాక్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య నభ్యసించిన ఈ నవయువకుడు ఆనాటి సమకాలీన రాజకీయ నాయకుల్లో చాలా మందికి లేనటువంటి, అమోఘమైన పాండిత్యాన్ని సంపాదించారు. సామాజిక అడ్డంకులు ముఖ్యంగా పక్షపాత వైఖరి, సామాజిక అణచివేతలు, కులపీడనలు వంటివి ఎదుర్కొని ఈ ఘనత సాధించారు.

1920లలో తొలినాళ్లకే అంబేడ్కర్ ఎంఎ, పిహెచ్‌డి అర్థశాస్త్రంలో ఎమ్మెస్సీ,డి.ఎస్.సి, బారిస్టర్ ఎట్ లా పూర్తి చేశారు.తనకి ముప్పై ఏండ్లొచ్చేసరికే ప్రముఖ విద్యావేత్తలు, అధ్యయనకారులు తమ జీవితకాలంలో సాధించలేనన్ని నిజ జీవితఅనుభవాలను అంబేడ్కర్ గడించారు. నాలుగు దశాబ్దాల తన ప్రజాజీవితంలో అనేక వివాదాస్పద అంశాలలోనూ, అధిగమించటానికి వీలు లేనటువంటి సామాజిక అంధకారంలో నుంచి వెలుతురులా ఉద్భవించారు. అలెగ్జాండర్ గోల్డెన్‌వైజర్ 1916మే నెలలో సామాజిక శాస్త్రాలపై సెమినార్ జరిపినప్పుడు, మొట్టమొదటి సారిగా అంబేడ్కర్ భారతదేశంలో కులాల తీరు తెన్నులు, పుట్టుక, అభివృద్ధి అనే అంశంపై చాలా అద్భుతమైన పత్రాన్ని అందించారు. పారదర్శకత, నిజాయితీ, పట్టుదల వంటి అపూర్వగుణాలు కలిగిన ఉదారవాది డా.అంబేడ్కర్. తాత్వికంగా మొదట ఆదర్శవాదం వైపు మొగ్గినప్పటికీ, అంతిమంగా బుద్ధుని సిద్ధాంతం వైపు ఆకర్షితుడయ్యారు. మార్క్సిజం పుస్తకాలను కూడా చాలా లోతుగా అధ్యయనం చేశారు. 1950లో ఆయన న్యాయశాఖ మంత్రిగా ఉండి హిందూ కోడ్ బిల్లు తెచ్చినప్పుడు, అదే జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా అంబేడ్కర్‌ను దెబ్బతీశారు. అంబేడ్కర్ జీవించినంత కాలం, ఆయన ప్రత్యర్థులు, విమర్శకులు మరీ ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ఆయన్ను ఆ యుగంలోని వ్యూహాత్మక లక్ష్యాన్ని గుర్తించలేని వ్యక్తిగా పదేపదే అభివర్ణించేవారు.ఆ ప్రచారం బాగా ప్రాచుర్యం పొంది, ఆఖరికి మీడియా కూడా ఆయన్ను ఒక రెండో తరగతి దేశనాయకుడిగా,షెడ్యూల్డ్ కులాలకే పరిమితమైన నాయకుడిగా చిత్రీకరించింది. వస్తుగతంగా చూస్తే ఆయనంత ఉన్నత వ్యక్తి, సాహసోపేతమైన దేశ నాయకులు చాలా తక్కువమంది ఉన్నారన్నది సుస్పష్టం.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచిన స్వాతంత్ర్య పోరాటంలో దీనికి తగినంత ప్రాధాన్యత ఇవ్వబడలేదు. దేశ రాజకీయ దృశ్యపథంలో ఎప్పుడూ నికరంగా కేంద్ర స్థానం వహిస్తూ, తీవ్రవాద శైలితో, సామాజిక అంశాల్లో ఎటువంటి సర్దుబాటు ధోరణి ప్రదర్శించకుండా ఎన్నో ఉద్య మాలకు నాయకత్వం వహించారు అంబేడ్కర్. సమాజంలోని అసమానతలు, మతాల్లో ఇమిడి ఉన్న అణచివేత ధోరణులు, సాంప్రదాయ వారసత్వాలు, మెజారిటీ సమాజం రుద్దిన విలువలను గమనించారు. అంబేడ్కర్ రాజ్యాంగసభలో,రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన కమిటీకి అధ్యక్షత వహించి,ప్రధాని నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో కొంతకాలం ఉన్నప్పటికీ, భారత రాజకీయాల్లో కాంగ్రెసేతర, కాంగ్రెస్ వ్యతిరేక భావధారకు ఆయన్నే మనం ఆద్యుడిగా పరిగణించాలి.కానీ వాటికి భిన్నంగా హిందూ మితవాదం బాగా పైచేయి సాధించి,మెజారిటీ మతమౌఢ్యం, సామాజిక అభివృద్ధి నిరోధకత్వాలు సాగిస్తున్న రాజకీయ,సిద్ధాంత ఎదురుదాడి ప్రస్తుత దేశపరిస్థితికి అద్దం పడుతున్నాయి. అంబేడ్కర్ వారసత్వాన్ని సొంతం చేసుకోవడానికి హిందూత్వవాదులు చరిత్రసారాన్ని వక్రీకరించి మరీ ప్రయత్నాలు సాగిస్తున్నారు.ఇటువంటి పరిస్థితుల్లో కులవ్యవస్థపైనా,చాతుర్వర్ణ, సనాతన ధర్మాల పైనా ప్రతిఒక్కరూ పోరాడాలి. అంటరానితనాన్ని మార్పు లేకుండా యథాతథంగా నిలిపి ఉంచే సామాజిక దొంతరలపైనా హిందూ ధర్మశాస్త్రాల ఆధిపత్యం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై నేడు ఉద్యమించాలి. ప్లాటో రిపబ్లిక్ ఏ కారణం వల్ల వైఫల్యాన్ని ఎదుర్కొందో,సరిగ్గా అదే కారణం మూలంగానే చాతుర్వర్ణ వ్యవస్థ కూడా తప్పని సామాజిక తిరుగుబాటుదారుడైన,ఈ పీడిత వర్గ మేధావి హెచ్చరించారు.



ఈ దుర్మార్గ వ్యవస్థ మూలంగా హిందువుల్లో దిగువ వర్గాలు ప్రత్యక్షంగా కార్యాచరణలోకి దిగకుండా పూర్తిగా నిస్సహాయులుగా చేయబడ్డారని అంబేడ్కర్ వేలెత్తి చూపి ఇంతకంటే నీచమైన సామాజిక వ్యవస్థ మరొకటి రాబోదని హెచ్చరించారు.ఈ వ్యవస్థ ప్రజలను పరస్పర సహాయ కార్యకలాపాలు చేయనివ్వకుండా కుంటుపరిచి,వారిని నిస్సహాయులుగా,చచ్చుబడిన వారిలా చేస్తుందని తెలిపారు.ఆయన సామాజిక, ఆర్థిక,ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తూనే ఈ వ్యవస్థ రాజకీయ రంగంలో కలగజేసే ప్రభావాలపై దృష్టి సారించి అవిరళమైన కృషి చేశారు. ధర్మశాస్త్రాలపై ఉన్న విశ్వాసాన్ని సర్వనాశనం చేయడం,వాటి పునాదిగా గల కులపరమైన నిరంకుశత్వాన్ని నాశనం చేయడమే దీనికి వాస్తవ పరిష్కారమని అంబేడ్కర్ భావించారు.ఇటువంటి విషయాల్లో గాంధీ అర్ధ శతాబ్దానికి ముందే 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హిందూ మతానికి ఓసవాల్' అని ప్రకటించాడంటే అందులో ఆశ్చర్యమేమీలేదు. నిజంగానే ఆయన ఈనాటికీ ఒక సవాల్ గానే నిలిచి ఉన్నారు.అందువల్లనే హిందూత్వ వాదులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమికి చెందిన కొన్ని శక్తులు నేడు ఆయనను నిర్లక్ష్యం చేయలేని స్థితిలో ఉన్నాయి. సామాజిక పురోగతిని నిరోధించటానికి పూనుకున్న వారిని వ్యతిరేకిస్తూ, సామాజిక ఛాందసవాదం, అవకాశవాద రాజకీయాలపై యుద్ధాలు సాగిస్తూ 1940 దశకం చివరిలో, 1950 దశకం తొలిలో హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాలకు నాయకత్వం వహించారు.కానీ ఛాందసవాద శక్తులు ఆయన ప్రయత్నానికి వెన్నుపోటు పొడిచాయి.

వారసత్వం, వంశపారంపర్య పాలననూ,ఏక పార్టీ వ్యవస్థను ఆయన ద్వేషించారు.ఒకే పార్టీ ప్రజామోదమైన ప్రభుత్వాన్ని నడపటం అంటే,నిరంకుశత్వం తెరవెనుక నుండి పాలన సాగించే ఒక రూపంగా ప్రజాస్వామ్యం తయారవ్వడాన్ని అనుమతించడమే అనేది అంబేడ్కర్ ప్రముఖ సూత్రీకరణల్లో ఒకటి.నిరంకుశత్వం ఎన్నికయినదయినప్పటికీ, అది నిరంకుశత్వం కాకమానదు. నిరంకుశత్వం కూలదోయబడే అవకాశం ఉండటం,దాన్ని తోక ముడిచేటట్లు చేయగల అవకాశం ఉండటం,దాని ప్రత్యర్థి పార్టీ దాని స్థానంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉండటమే నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిజమైన గ్యారంటీ అని అంబేడ్కర్ హెచ్చరించారు. ఏకపార్టీ పాలన ప్రాతిపదికన గానీ,లేదా నిద్రపోయే హక్కులని నిద్రపోనీ అనే సామాజికతత్వ ప్రాతిపదికతో ఉండే రాజకీయ సుస్థిరత గానీ అంబేడ్కర్‌కు గిట్టని విషయాలు. అంబేడ్కర్ దూరదృష్టితో వెలిబుచ్చిన రాజకీయ భావాల్లో రెండు నేటి కాలానికి కూడా వర్తిస్తాయి.వాటిలో మొదటిది రాజకీయ స్వేచ్ఛలను ఒక గొప్ప వ్యక్తి పాదాల కింద ఉండనివ్వకండని,రెండోది రాజకీయాలలో భక్తి లేదా వీరాధన ఉంటే అది అధోపతనానికి దారి అని చెప్పారు.అందుకే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్ది,వైరుధ్యాలను పరిష్కరించాలని లేకపోతే అవి ప్రజాస్వామ్య పునాదుల్ని నాశనం చేస్తాయని అంబేడ్కర్ ఆనాడే హెచ్చరించారు.కాబట్టి నేడు ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభాలను అధిగమించేందుకు పోరాడటమే ఆయనకు నేడు మనమిచ్చే నిజమైన నివాళి.

> ఈ దుర్మార్గ వ్యవస్థ మూలంగా హిందువుల్లో దిగువ వర్గాలు ప్రత్యక్షంగా కార్యాచరణలోకి దిగకుండా పూర్తిగా నిస్సహాయులుగా చేయబడ్డారని అంబేడ్కర్ వేలెత్తి చూపి ఇంతకంటే నీచమైన సామాజిక వ్యవస్థ మరొకటి రాబోదని హెచ్చరించారు.ఈ వ్యవస్థ ప్రజలను పరస్పర సహాయ కార్యకలాపాలు చేయనివ్వకుండా కుంటుపరిచి,వారిని నిస్సహాయులుగా,చచ్చుబడిన వారిలా చేస్తుందని తెలిపారు.ఆయన సామాజిక, ఆర్థిక,ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తూనే ఈ వ్యవస్థ రాజకీయ రంగంలో కలగజేసే ప్రభావాలపై దృష్టి సారించి అవిరళమైన కృషి చేశారు. ధర్మశాస్త్రాలపై ఉన్న విశ్వాసాన్ని సర్వనాశనం చేయడం,వాటి పునాదిగా గల కులపరమైన నిరంకుశత్వాన్ని నాశనం చేయడమే దీనికి వాస్తవ పరిష్కారమని అంబేడ్కర్ భావించారు.ఇటువంటి విషయాల్లో గాంధీ అర్ధ శతాబ్దానికి ముందే 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హిందూ మతానికి ఓసవాల్' అని ప్రకటించాడంటే అందులో ఆశ్చర్యమేమీలేదు. నిజంగానే ఆయన ఈనాటికీ ఒక సవాల్ గానే నిలిచి ఉన్నారు.

(ఏప్రిల్ 14 డాక్టర్ అంబేడ్కర్ జయంతి) ■



అసమాన వ్యవస్థపై తిరుగుబాటు చేసిన గొప్ప సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

అట్టడుగు వర్గాల కోసం అసమాన వ్యవస్థపై మొట్టమొదటిసారిగా తిరుగుబాటు చేసిన గొప్ప విప్లవ కారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో పూలే జయంతి సందర్భంగా ఆయన పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన జయంతి సభ జరిగింది. ఈ సభలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని కుల జాడ్యం మన దేశంలో ఉందని కులం పేరుతో ఆధిపత్యం చేస్తూ సామాజిక ఆర్థిక దోపిడీ కొనసాగిందని, దానికి వ్యతిరేకంగా తన జీవితాంతం పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. అణచివేతలకు, అవమానాలకు గురవుతున్న అట్టడుగు వర్గాల ప్రజల తరపున దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా వారి జీవితాలలో వెలుగులు నింపిన మహాయోధుడు అణగారిన ప్రజల పక్షాన పోరాటం చేసిన గొప్ప యోధుడు జ్యోతిరావు పూలే అని, ఆయన చేసిన త్యాగాలను పోరాటాలను గుర్తు చేసుకుని స్ఫూర్తితో మనం ముందుకు పోవటమే ఆయనకి మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. కానీ ఈనాడు మోడీ ప్రభుత్వం పూలే ఆశయాలకు తూట్లు పొడుస్తుందని ఆరోపించారు. విద్యారంగంలో పూర్తిగా ప్రయివేటీకరణకు బార్లా తలుపులు తెరిచి చదువును "కొనే" పరిస్థితిని ఈ ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. బలహీన వర్గాల కోసం ప్రభుత్వ విద్యపై నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యపై దృష్టి పెడితే దేశం అన్ని రంగాల్లో ముందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, నాయకులు మెరుగు సత్యనారాయణ, దొంగలు తిరుపతిరావు, ఎంఏ జబ్బార్, ఎస్.మనోహర్, పి.రమ్య, భూక్య శ్రీను, బోడపట్ల సుదర్శన్, వై.శ్రీనివాసరావు, సదానందం, నెల్లూరి వీరబాబు, నాగుల్ మీరా, నర్రా రమేష్, జే.వెంకన్న బాబు, తుడుం ప్రవీణ్ సుధాకర్, అమరావతి, పగడాల నాగేశ్వరరావు, గుమ్మడి బిక్షం, బి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన టార్పాలిన్ పట్టాలు, గన్ని బ్యాగులు, మంచినీరు వంటి సౌకర్యాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన పట్టాలు సరిపడ లేకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కాంటాలు వేసిన బస్తాలను సకాలంలో ట్రాన్స్పోర్ట్ చేయకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. కాంటాలు వేసిన బస్తాలను 24 గంటల లోపు సంబంధిత మిల్లులకు ట్రాన్స్పోర్ట్ చేయాలని అవసరమైన గన్ని బ్యాగులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తాలు పేరుతో మిల్లర్లు తరుగుతీస్తూ కోతలు పెడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించిన వెంటనే కాంటాలలో జాప్యం చేయకుండా సకాలంలో పూర్తిచేసి రైస్ మిల్లులకు ట్రాన్స్పోర్ట్ చేయాలన్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో బిల్లులు చెల్లించాలని, క్వింటాకు 500 రూపాయల బోనస్‌ను రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, బెల్లం లక్ష్మి, కట్టేకోల వెంకన్న పాల్గొన్నారు

అంటరానితనం నిర్మూలనపై 'జ్యోతిరావు పూలే' పోరాడారు

ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనపై మహాత్మా జ్యోతీరావు పూలే పోరాడారని, భారతదేశంలో మహిళా విద్యకు ఆయన భార్య సావిత్రి బాయి పూలేకు సంపూర్ణ సహకారం అందించి మహిళా విద్యకు మార్గదర్శకులు అయ్యారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతీరావు పూలే 199వ జయంతి వేడుకలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, మొహమ్మద్ కమల్‌పాషా, చల్లగుండ్ల కృష్ణయ్య, నాగళ్ల ప్రసాదరావు, ఖలీల్, షరీపుద్దీన్, రామారావు, సందీప్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి, కంటె నాగలక్ష్మి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

యర్రా శ్రీకాంత్‌కు నివాళి


నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మండలం లింగన్నపాలెం గ్రామంలో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో సిపిఎం గ్రామ కార్యదర్శి బాణాల కృష్ణమాచారి అధ్యక్షతన కామ్రేడ్ ఎర్ర శ్రీకాంత్ సంతాప సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు పాల్గొని ఎర్ర శ్రీకాంత్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ జానీ మియా, సజ్జ నాగేశ్వరరావు, దిరిశాల రామకృష్ణ, బాణాల నాగ బ్రహ్మాచారి, చెంగల తిరుపతమ్మ, కానుగుంట్ల నాగచారి ప్రాణాల వెంకటేశ్వర్లు, షేక్ ఉద్దండు సాహెబ్, జుంజునూరు కృష్ణ, తోటకూర పిచ్చియ్య పాల్గొన్నారు.

ఘనంగా రైతు సంఘ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-తల్లాడ



మండలంలోని గోపాల్‌పేట, కుర్నవల్లి గ్రామాలలో ఘనంగా రైతు సంఘ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. గోపాల్‌పేట గ్రామంలో పారసాని సత్యనారాయణ, కుర్నవల్లి, గ్రామంలో ఐలూరు అప్పిరెడ్డి, జెండాను ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ 1936వ సంవత్సరం ఏప్రిల్ 11న సమస్యలపై పోరాటాల నిర్వహిస్తున్న సమయంలో రైతులందరూ ఐక్యంగా పోరాడాలని, సంఘాన్ని ఏర్పాటు చేసుకుని, ఆనాటి నుండి నేటి వరకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న రైతు సంఘం జెండాను అన్ని గ్రామాల్లో ఆవిష్కరిస్తున్నారన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొమ్మినేని రాంబాబు, సుంకర కృష్ణయ్య, పారసాని రాజేశ్వరరావు, మాసవరపు రాఘవయ్య, దొడ్డపనేని నాగేశ్వరరావు, కట్ట దర్గయ్య, ఐలూరి రామిరెడ్డి, శీలం సిద్ధారెడ్డి, పోతురాజు కోటయ్య, ఎక్కిరాల పాపులు, పామర్తి సత్యం రెడ్డి తదితరులు, పాల్గొన్నారు .

సన్నబియ్యం పంపిణీ...! పేద కుటుంబాల్లో ఆనందం...!!

- ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్
- ఆదివాసీ ఇంట్లో సన్నబియ్యంతో ఎమ్మెల్యేకు భోజనం

నవతెలంగాణ-సత్తుపల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం రేషను దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం పట్ల పేదల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధి గుడిపాడులోని ఆదివాసీ ఇంట్లో శుక్రవారం సన్నబియ్యంతో ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టరు మట్టా రాగమయి దంపతులు పాల్గొని సన్నబియ్యంతో భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టరు మట్టా దయానంద్ విజయకుమార్, ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, ఉడతనేని అప్పారావు, మొహమ్మద్ కమల్‌పాషా, మాజీ కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి, కంటె నాగలక్ష్మి, నాగుల్‌మీరా, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ పూచి యశోద, పూచి గోవర్ధన్, కొల్లి నరసింహారావు, వీరాస్వామి, కృష్ణవంశీ, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-మధిర

పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్ర వారం మధిరలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ ఒకవైపు ఉపాధి అవకాశాలు దెబ్బతిని కొనుగోలు శక్తి పడిపోయి ప్రజలు అచేతన స్థితిలో ఉంటే ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన పాలకులు ప్రజలపై భారాలు మోపటం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, పట్టణ మండల కార్యదర్శులు పడకంటి మురళి, మందా సైదులు, నాయకులు పాపినేని రామ నర్సయ్య, తేలపోలు రాధాకృష్ణ, ఓట్ల శంకర్రావు, వి.మధు, గోపి పట్టణ మండల కమిటీ సభ్యులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

కూసుమంచి : గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి ప్రజలపై రూ.3700 కోట్ల భారం వేసిందని సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ విమర్శించారు. మండల కేంద్రంలోని యడవల్లి పద్మా రెడ్డి భవనం నుండి మండల కేంద్రం వరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు.

ఎర్ర శ్రీకాంత్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి : బండి రమేష్

ఎర్రా శ్రీకాంత్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లటం మన తక్షణ కర్తవ్యం అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎడవల్లి పద్మా రెడ్డి భవనంలో శ్రీకాంత్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాంత్ మృతి ముఖ్యంగా ఖమ్మం త్రీ టౌన్, ఖమ్మం పట్టణానికి తీరని లోటన్నారు. చిన్నతనం



నుండి సిపిఎం పట్ల అంకితభవంతో పనిచేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో మనందరం పయనించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు శీలం గురుమూర్తి, యడవల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు, తాళ్ళూరి వెంకటేశ్వరరావు, మూడు గన్యా నాయక్, మండల కమిటీ సభ్యులు వెంగళరావు, జువ్వజి శీను, చీర్ల రాధాకృష్ణ, వెంకటయ్య, డాక్టర్ బాబురావు, చారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



రైతులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ఆంధ్ర బ్యాంక్ కర్షక సేవ సహకార సంఘం

ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

రైతన్నలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మండలంలోని కాచిరాజుగూడెం గ్రామంలో ఆంధ్ర బ్యాంక్ కర్షక సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్యం, విద్య మాత్రమే మన భవిష్యత్తు తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి అన్నారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న సమయంలో రైతులతో మాట్లాడుతున్న, పరిశీలిస్తున్న సందర్భంలో పాత జనరేషన్ తాతలు, బామ్మలు మనకంటే మంచి ఆరోగ్యంతో ఉండటం గమనించానన్నారు. మన పాత తరం వారు ఎటువంటి చెడు అలవాట్లు లేకుండా పౌష్టికాహారం తిని, చాలా దృఢంగా ఉంటూ ఎక్కువ సంవత్సరాలు జీవించారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, మహిళలతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ తమ్మినేని విజయలక్ష్మి జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి భాయి, ఖమ్మంరూరల్ ఎంపీడీవో కుమార్, తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతిపత్రం

కాచిరాజుగూడెం గ్రామ పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాచిరాజుగూడెం పరిధిలోని రేగులతండా, వాల్యా తండా గ్రామాలకు ప్రత్యేకంగా రేషన్ షాపు లేకపోవడం వలన ప్రతి నెల రెండు కిలోమీటర్లు వచ్చి కాచిరాజుగూడెంలో రేషన్



తీసుకోవాల్సి వస్తుందని, ఆ తండాలకు రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొన్నం వెంకటరమణ, పొన్నం భాస్కర్‌రావు, కారుమంచి గురవయ్య పొన్నం మురళి, షైక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో హస్తం పాలన అస్తవ్యస్తం

జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు విమర్శ

నవతెలంగాణ ముదిగొండ

రాష్ట్రంలో హస్తం పాలన అస్తవ్యస్థమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో చితికిపోతున్న తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనే కోరుకుంటున్నారని జడ్పీ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం ముదిగొండలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్ లో జరిగే పార్టీ రజతోత్సవ సభలో పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని లింగాల పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతూ ప్రజలను దగా చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు .రైతులకు రుణమాఫీ,రైతు భరోసా విషయంలో మాయమాటలు చెపుతూ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో మండలంలోని ప్రతి గ్రామము నుండి పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని లింగాల కమల్ రాజు కోరారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రథమ సంవత్సరంలోనే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత



పెరిగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు తుంగలో తొక్కి సరికొత్త పథకాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం డ్రామాలాడుతుందన్నారు. అనంతరం చలో వరంగల్ పోస్టర్స్ ను పార్టీ నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మండల కార్యదర్శి గడ్డం వెంకట్, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎస్కె ఖాజా,నాయకులు పోట్ల ప్రసాద్, పచ్చా సీతారామయ్య,ఎర్ర వెంకన్న,బత్తుల వెంకట్రావు, పడిశాల భద్రయ్య, ఓరుగంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు ధాన్యం తరుగు తీయవద్దు

- అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



యాసంగి పంట కొనుగోలు సమయంలో మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం తరుగు తీయవద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యాసంగి పంట కొనుగోలు ఖమ్మం జిల్లాలో ప్రారంభమైందని, జిల్లాలో 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటి వరకు 212 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేశామని, 25 కేంద్రాలు కొనుగోలు ప్రారంభించాయని, 13 కేంద్రాలలో ధాన్యం వివరాలు ఓపిఎంఎస్‌లో నమోదు చేశారని తెలిపారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో రైస్ మిల్లులకు ధాన్యం అలాట్మెంట్ చేశామని, కొనుగోలు ప్రక్రియకు మిల్లర్లు సహకారం అందించాలని అన్నారు. కొన్ని రైస్ మిల్లులలో బస్తాకు నాలుగు కిలోల తరుగు తీస్తున్నట్లు సమాచారం అందుతుందని అన్నారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు పంపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లో తరుగు తీయడానికి వీలులేదని అన్నారు. ధాన్యం తూర్పారా పట్టిన తర్వాత మాత్రమే రైస్ మిల్లులకు తరలిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించే సమయంలో నాణ్యత ప్రమాణాలను వ్యవసాయ విస్తరణ అధికారి సర్టిఫై చేయాలని, నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని అన్నారు. రైస్ మిల్లులకు నాణ్యత ప్రమాణాలు లేకుండా ధాన్యం పంపిస్తే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి, కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు మెమో జారీ చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. రైస్ మిల్లులు నాణ్యత ప్రమాణాలు లేని ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దని, అనవసరంగా తరుగు పేరిట కోతలు విధించవద్దని అదనపు కలెక్టర్ తెలిపారు. రాబోయే 10 రోజుల్లో మరోసారి ధాన్యం భద్రపరిచే గోదాం ఖాళీ అవుతాయని, ఎటువంటి ఇబ్బందులు రావని అదనపు కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల దగ్గర ఏదైనా లోపాలు ఉంటే తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి గంగాధర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.శ్రీలత, మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను వంచించిన కాంగ్రెస్

నవతెలంగాణ-కారేపల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ పార్టీ వంచించిందని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ విమర్శించారు. శుక్రవారం కారేపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశంలో మదన్‌లాల్ మాట్లాడుతూ ఎన్నికలలో మోసపూరిత హామీలతో ప్రజలను మోసగించిందన్నారు. రైతు రుణమాఫీ 40 శాతం కూడా పూర్తి చేయకుండానే రైతు మాఫీ చేసినట్లు చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. ఉద్యమాల గడ్డ వైరా నియోజకవర్గం నుండి ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరుగు బీఆర్ఎస్ అవిర్భావ బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లు వాంకుడోత్ జగన్, ఉన్నం వీరేందర్, వైరా నియోజకవర్గ రైతు బంధు మాజీ కన్వీనర్ హన్మకొండ రమేష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సీలాల్, మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్ పాల్గొన్నారు.

లక్ష్మీ సాహితీని సన్మానించిన మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం స్థానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన సంగేపు వెంకటేశ్వర్లు, కవితా దంపతుల కూతురు సంగేపు లక్ష్మీ సాహితి ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాల్లో స్టేట్‌లో129 ర్యాంకు, మల్టీ జోన్ 1లో 69 ర్యాంకు సాధించిన సందర్భంగా శుక్రవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ర్యాంకర్ లక్ష్మీ సాహితీని శాలువాతో సన్మానించారు. కృషి, అంకిత భావం, పట్టుదలతో ర్యాంకు సాధించిన లక్ష్మీ సాహితీని అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొర్రా రాజశేఖర్, గుమ్మడిదల వెంకట నారాయణ, లక్ష్మీ సాహితి తల్లిదండ్రులు కవిత, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ- ఎర్రుపాలెం

ఇటీవల కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన ఫోటోగ్రాఫర్ కుటుంబ సభ్యులకు ఖమ్మం జిల్లా ఫోటో గ్రాఫర్ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెంకి చెందిన తాటికొండ గోపాలకృష్ణమాచారి పదివేల రూపాయలను, జిల్లా ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మారగాని వెంకట్ పది వేల రూపాయల నగదును భార్య రమాదేవికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫోటోగ్రాఫర్ సంఘం సభ్యులు పార్వతి, తిరుపతిరావు, మురళీధర్, హరినాథ్, మహేష్, అశోక్, ముత్యాలరావు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం

ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి జిల్లాలో శనివారం పర్యటిస్తారని ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. తొలుత ఉదయం 10:30 గంటలకు నగరంలోని గట్టయ్య సెంటర్‌లో గల ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఆర్గానిక్ మేళాను ప్రారంభిస్తారు. ఆ తర్వాత పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు నగరంలోని ప్రకాష్ నగర్‌లో గోదాంను ప్రారంభిస్తారని, 4:30 గంటలకు శ్రీనివాస్ నగర్‌లో సీపీఎం రాష్ట్ర నేత యర్రా శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సాయంత్రం 5 గంటలకు 58వ డివిజన్ దొరన్న కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 5:30 గంటలకు రఘునాథపాలెం మండలం జింకల తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6 గంటలకు రఘునాథపాలెం మండలం వీ. వెంకటాయపాలెంలో సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవానికి హాజరవుతారని పేర్కొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ- ఎర్రుపాలెం



జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ దంపతులు శుక్రవారం సందర్శించారు. న్యాయ మూర్తి దంపతులను ఆలయ అర్చకులు దేవాలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి వస్త్రములు సమర్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమములో ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్ మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్ర మూర్తి, ఆలయ పర్యవేక్షకురాలు కె విజయకుమారి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ రాజీవ్ శర్మ, మురళీమోహన్‌శర్మ నాయకులు చావా రామకృష్ణ, మూల్పూరి శ్రీనివాసరావు, బుర్ర మురళి, నన్నపనేని రామారావు, వాసిరెడ్డి శివకుమారి, గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లులను తనిఖీ చేసిన తహశీల్దార్


నవతెలంగాణ-ముదిగొండ

ధాన్యం దిగుమతులలో పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న రైస్ మిల్ యాజమాన్యం అవకతవకులకు పాల్పడుతున్నారని సమాచారం మేరకు తహశీల్దార్ కొక్కుల సునీత ఎలిజిబెత్ శుక్రవారం సువర్ణాపురం రైస్ మిల్లును ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లులో ఉన్న ధాన్యం బస్తాలను పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ధాన్యం బస్తాల దిగుమతుల్లో అవకతవకులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తాహశీల్దార్ సునీతఎలిజిబెత్ మిల్లు యాజమాన్యాన్ని హెచ్చరించారు.

రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న కేంద్రం

గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రాయల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ముదిగొండ



భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం అవహేళన చేస్తుందని గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం మండల పరిధిలో వెంకటాపురం ఆర్కే ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో పాదయాత్రలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. బిజెపి పదేళ్లుగా దేశంలో ప్రజాస్వామ్య విధానాలు లేకుండా పాలన చేస్తుందని రాయల మండిపడ్డారు. సమావేశంలో డిసిసి జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, బిసి సెల్ మండల అధ్యక్షులు పల్లపాటి కృష్ణ, నాయకులు పసుపులేటి దేవేందర్, సామినేని వెంకటేశ్వరరావు, మల్లెల అజయ్‌కుమార్, ఇలవల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు మహాత్మ జ్యోతిబాపూల

సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి

నవతెలంగాణ-మధిర



అమరజీవి, ఆదర్శప్రాయుడు మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా మధిర సిపిఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ సమాజాన్ని అభ్యుదయం వైపు నడిపించాలంటే విద్య ఆయుధంగా పనిచేస్తుందన్నారు. విద్యను క్రింది కులాలకు అందించుటకు యనలేని కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, మందా సైదులు పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, పాపినేని రామ నరసయ్య, తేలపోలు రాధాకృష్ణ, మల్లారం మాజీ సర్పంచ్ మందడపు ఉపేంద్రరావు, వడ్రానపు మధు, షేక్ ఉద్దండు సాహెబ్, ఎలిజాల గోపి తదితరులు పాల్గొన్నారు.

మళ్ళీ పగిలిన మిషన్ భగీరథ పైపు లైన్

నవతెలంగాణ-వైరా

మండలంలో స్టేజి పినపాక, గౌండ్ల పాలెం వద్ద రెండు చోట్ల మిషన్ భగీరథ పైపు లైన్ పగిలి పోయి స్టేజి పినపాక నుండి దాచాపురం వరకు గల 10 గ్రామాలకు ఇప్పటికే వారం రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. స్టేజి పినపాకతో గౌండ్ల పాలెం వద్ద పగిలిన మిషన్ భగీరథ పైపు లైన్‌కు గురువారం సాయంత్రం వరకూ మరమ్మతులు చేశారు. మరమ్మతుల అనంతరం అదే రోజు రాత్రి నీరు విడుదల చేయగా పైప్ లైన్ మరోసారి పగిలి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికే నీటి కోసం అల్లాడుతున్న 10 గ్రామాలకు మరలా ఇంకెన్ని రోజులు ఎదురు చూడాలో? తెలియని పరిస్థితి ఏర్పడింది. మిషన్ భగీరథ స్కీంకు ముందే మధిర నియోజక వర్గానికి బోడేపూడి సుజల స్రవంతి మంచినీటి పథకం నిరంతరాయంగా నడిచింది. భగీరథ వచ్చిన తర్వాత వైరా మండల గ్రామాలకు బోడేపూడి సుజల స్రవంతి నుండే నీటి సరఫరా అవుతున్నప్పటికీ నిర్వహణ మిషన్ భగీరథ కంట్రోల్ ఉన్నది. కానీ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు 6 మండలాల పరిధిలో ఒకే ఒక్క జెసిపిని మరమ్మతులకు ఉపయోగించటం వల్ల చిన్న పనికైనా పెద్ద పనికైనా జెసిపిని ఉపయోగించాల్సిందే. అందువల్ల మంచినీటి పునరుద్ధరణ పనులు ఆలస్యం అవుతుంది. వేసవి తీవ్రతతో ప్రజలు మంచినీటి కోసం అలమటిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పగిలి పోయిన పైపు లైనుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించి నీళ్ళివాలని బాధిత గ్రామాల దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి మృతి

నవతెలంగాణ-పెనుబల్లి



మండలంలోని వీఎం బంజర హైస్కూల్‌కు చెందిన కడియం వంశీ సోమవారం రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాదులో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. స్కూలు నుండి ఇంటికి తిరిగి వెళుతుండగా వియం బంజర్‌లోని మసీదు సమీపాన గల హైవే రోడ్డు యూటర్న్‌లో లారీ విద్యార్థికి తగలడంతో కాలు నుజ్జునుజ్జు అయింది. ఖమ్మం నుండి హైదరాబాదుకు మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విద్యార్థికి ఖరీదైన వైద్యం అందించేందుకు మండలంలోని ఉపాధ్యాయులు పుర ప్రముఖులు శక్తికి మించి విరాళాలు అందజేశారు. అయినప్పటికీ విద్యార్థికి మరణం అనివార్యమైంది. 9వ తరగతి చదువుతున్న తమ కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యార్థి సంఘటన జరిగిన హైవే రోడ్డు ప్రదేశంలో స్టాప్ బోర్డు ఏర్పాటు చేయాలని ఎస్సై వెంకటేష్‌ను సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చలమాల విట్టల్ రావు, మాజీ సర్పంచ్ తావు నాయక్ అధికార ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.



బీఆర్ఎస్ బహిరంగ సభను జయప్రదం చేయండి

- పార్టీ కమిటీ పిలుపు

నవతెలంగాణ-వైరా

ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి గ్రామంలో జరగనున్న బీఆర్ఎస్ రజోత్సవ మహాసభను జయప్రదం చేయాలని బిఆర్ఎస్ వైరా పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, మాజీ ఎంపీపీ కట్ట కృష్ణార్జున రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ ముల్లపాటి సీతారాములు విజ్ఞప్తి చేశారు. మద్దెల రవి అధ్యక్షతన శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో వార్డుకు సుమారు పదిమంది చొప్పున మహాసభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని కోరారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యమని ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, స్థానిక సంస్థల్లో తమ సత్తా చాటందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తడికమల్ల నాగేశ్వరరావు, నాయకులు మాదినేని ప్రసాద్, దొంత బోయిన గోపి, దొంత బోయిన వెంకటేశ్వర్లు, ఏదునూరి శ్రీను, ఆదూరి ప్రేమ్, బానోత్ సక్కుబాయి, మడుపల్లి కృష్ణ, కారుకొండ బోస్, నల్లగొండ నాని, మాచర్ల శంకర్, దొంత బోయిన చింతయ్య, బానోతు వీరన్న, తన్నీరు కిషోర్, ఓర్సు రవి, బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.



మనువాదంపై పోరాడటమే పూలేకు అర్పించే నిజమైన నివాళి

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ-ఖమ్మం

మనువాదంపై పోరాటాలు చేయడమే నేడు జ్యోతిరావు పూలేకు అర్పించే నిజమైన నివాళి అని, మహనీయుల మాసమైన ఏప్రిల్ నెలలో కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు నిర్వహించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఎన్ఎస్పి క్యాంపు సంఘం జిల్లా కార్యాలయంలో, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముత్తమాల ప్రసాద్, నందిపాటి మనోహర్‌లు పూలమాలలు వేసి పూలేకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నాయకులు బోట్ల సాగర్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు నకరికంటి చిరంజీవి, జె.వెంకన్న బాబు, నర్రా రమేష్, పాపిట్ల సత్యనారాయణ, కొమ్ము శ్రీను, కర్లకుంట నరేష్, చెరుకుపల్లి వీరభద్రం, పగిడిపల్లి వెంకట్రావు, గుర్రం ఉపేందర్, ఆంతోటి రవి కుమార్ పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ భవన్‌లో జ్యోతిరావు పూలే జయంతి

నవతెలంగాణ-ఖమ్మం

సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఖమ్మం టీఎన్జీవోస్ భవన్‌లో ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యవర్గం ఘనంగా నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, యూనియన్ నాయకులు వల్లపు వెంకన్న, కె.దుర్గాప్రసాద్, జైపాల్, టి.శ్రీకాంత్, పి.రాధాకృష్ణ, బి.చందు, లలితకుమారి,పాల్గొన్నారు.



విద్యను ఆయుధంగా మలచిన సామాజిక ఉద్యమ నేత పూలే



- సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్

అణగారిన వర్గాల కోసం విద్యను ఆయుధంగా మలచిన సామాజిక ఉద్యమ నేత పూలే అని, దోపిడీ రహిత సమాజం కోసం జీవితాంతం ఉద్యమించిన సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శుక్రవారం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పూలే జయంతి సందర్భంగా పూలే చిత్ర పటానికి పార్టీ జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ మనువాదం, సామాజిక దురాచారాలకు, కుల వివక్షతకు వ్యతిరేకంగా సంస్కరణ ఉద్యమానికి పూలే శ్రీకారం చుట్టారని, స్త్రీ అభివృద్ధి సమాజ అభివృద్ధిగా భావించి స్త్రీ విద్య ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు మహిళల విద్య కోసం 1948లో పాఠశాల స్థాపించి తన ఇంటి నుండి సావిత్రిబాయి పూలేను పాఠశాలకు పంపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, నాయకులు హరి వేంకటేశ్వరరావు, గుడిమెట్ల రజిత, బొంతు సమత, గుడిమెట్ల మోహనరావు, కొంగర సుధాకర్, గుమ్మా నరసింహారావు, షేక్ నాగుల్ పాషా, తోట కృష్ణవేణి, కంసాని మల్లికాంబ, సంక్రాంతి పురుషోత్తమరావు, ఓర్సు సీతారాములు, యనమద్ది రామకృష్ణ, మల్లెంపాటి రామారావు, మాడపాటి మల్లికార్జునరావు, మాడపాటి వెంకటి, కొత్త సీతారామయ్య, కురుగుంట్ల శ్రీనివాసరావు, వడ్లమూడి మధు, మాడపాటి రాజేష్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పాలడుగు సమస్యలపై ఆందోళన

- ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలి
- సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్

నవతెలంగాణ-వైరాటౌన్



మండలం పరిధిలోని పాలడుగు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన, ధర్నా చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పాల్గొని మాట్లాడుతూ గత మూడు రోజులుగా గ్రామంలోని స్థానిక సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి ఇంటింటి సర్వే చేసి పలు రకాల సమస్యలను అధ్యయనం చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో సంవత్సర కాలం నుండి మిషన్ భగీరథ మంచినీరు రాక తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అదేవిధంగా చాలాకాలం నుండి వీధి లైట్లు వెలగక రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఉపాధి హామీ పని అందరికీ కల్పించడం లేదని, ఉపాధి పని బిల్లులు చాలా కాలం నుండి రావడం లేదని, పంచాయతీ కార్మికులకు వేతనాలు అందడం లేదని, అదేవిధంగా అంతర్గత రోడ్లు గుంతలు పడి వర్షాకాలంలో నడవడానికి ఇబ్బందిగా తయారయ్యాయని, అట్టి రోడ్లను సిసి రోడ్లు వేయాలని, పాలడుగు గ్రామం నుండి రాపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణం చేయాలని, రేషన్ కార్డులు సమస్య, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్లు తదితర సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సమస్యలు అన్నింటినీ వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నా ప్రదేశం నుండి భగీరథ మంచి నీటి సమస్యపై సంబంధిత ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో, వీధి లైట్ల సమస్యలపై ఎంపీడీవో, ఎంపీవోలతో మాట్లాడి సమస్యలు పరిష్కారం కోసం హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని చెప్పడంతో అధికారులు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఏప్రిల్ 21న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా రూరల్ మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, వైరా డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వరరావు, పాలడుగు గ్రామ కార్యదర్శి షేక్ మజీద్ బి, షేక్ సైనాబి, షేక్ రెహనా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థుల జయకేతనం

- గోల్డ్, సిల్వర్, మెడల్స్ కైవసం

నవతెలంగాణ-వైరా



జాతీయ స్థాయిలో సిల్వర్ జోన్ ఫౌండేషన్ న్యూ ఢిల్లీ వారు నిర్వహించిన ఎన్ఎస్ఓ (జాతీయ సైన్స్ ఒలంపియాడ్), ఐఎంఓ (ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్), ఐఈఓ (ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్) పోటీ పరీక్షలలో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థులు 18 మంది గోల్డ్ మెడల్స్, 17 మంది సిల్వర్ మెడల్స్ 09 మంది కాంస్య మెడల్స్‌తో సహా మొత్తం 46 మంది పతకాలు సాధించినట్లు న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా వివిధ పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్. పి. భూమేష్ రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ఐఎంఓలో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

2వ తరగతి– ఆర్ సంకీర్తన, 3వ తరగతి –టీ మహేష్, 4వ తరగతి : ఎస్‌కె సఫీయ, 5వ తరగతి పి.శ్రీ రామ్ సురేష్,

సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు : 2వ తరగతి –టి భవిజ్ఞ శ్రీ, 3వ తరగతి మోక్షజ్ఞ, 4వ తరగతి బి.వెంకట అశ్విత్ రెడ్డి, బి.గోకుల్, పి.హాసిని, కె.సంకేత్ రాయ్, 5వ తరగతి ఆర్.జ్యోతిష్ మనోహర్, 7వ తరగతి ఎల్.ప్రకృతి.

బ్రోన్జే మెడల్స్

2వ తరగతి :బి గౌతమ్ కుమార్, 3వ తరగతి : ఎన్ తేజల్, 4వ తరగతి : సీహెచ్ చేతన్, 7వ తరగతి : సీహెచ్ కౌశిక్,

ఎన్ఎస్ఓలో గోల్డ్ మెడల్స్ సాధించిన వారు : 2వ తరగతి : బి.గౌతమ్ కుమార్, టి.భవిజ్ఞ శ్రీ, 3వ తరగతి : టి.మహేష్, 5వ తరగతి :ఎస్‌కె ఇర్ఫాన్ ఖాన్, 6వ తరగతి కె.వెంకట శ్రీ రామ్, 7వ తరగతి ఎల్.ప్రకృతి, 9వ తరగతి టి.జేసుసాలైష,

సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

3వ తరగతి : ఎం.సౌమ్య శ్రీ, 5వ తరగతి : ఎం రిధిమా, 6వ తరగతి : సీహెచ్ జ్ఞానవర్ధన్, 7వ తరగతి : బి.భాను ప్రసాద్, 9వ తరగతి : బి మహేశ్వరీ

బ్రోన్జే మెడల్స్ సాధించిన విద్యార్థులు

5వ తరగతి : ఎస్ కె ముషాహిద్, 6వ తరగతి : బి.యశ్విత, 7వ తరగతి : కె.ధన్యత, 9వ తరగతి కె ప్రీతిజ.

ఐఇఓలో గోల్డ్ మెడల్స్ సాధించిన వారు : 2వ తరగతి : డి.సాహితి, 3వ తరగతి : ఎం.సౌమ్య శ్రీ, 7వ తరగతి :బి.అభినవ్, 8వ తరగతి : ఎస్.గోపీచంద్, 9వ తరగతి : డి.గౌతమీ.

సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు.

2వ తరగతి :బి.గౌతమ్ కుమార్, 3వ తరగతి :టి.మహేష్, 7వ తరగతి : ఎస్ నారాయణ, 9వ తరగతి : ఎస్.కృష్ణ విశ్వశ్రీ.

బ్రోన్జే మెడల్స్ సాధించిన విద్యార్థులు

9వ తరగతి : ఆర్.విజయ భాను

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్. పి. భూమేష్ రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షలలో పాల్గొనటం ద్వారా తమ ప్రతిభను నిరూపించుకున్నామని అన్నారు. అదే విధంగా విద్యార్థులలో పోటీతత్వం అలవడుతుందన్నారు. దాని ద్వారా భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలను మనం సమర్థవంతంగా ఎదుర్కోనవచ్చునని అన్నారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా సృజనాత్మకమైన ఆలోచనా ధోరణిని అలవర్చుకుంటే భవిష్యత్తులో మరిన్ని పథకాలను సాధించవచ్చునని విద్యార్థులనుద్దేశించి అన్నారు. అంతర్జాతీయ సైన్స్, మాథ్స్ , ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లలో గోల్డ్, సిల్వర్, బ్రోన్జే పథకాలను సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షాజీమాథ్యూ, ఎఓ నరసింహరావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం

ప్రయివేటు, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు సంబంధించి 28 మందికి రూ.10.7 లక్షలు మంజూరయ్యాయి. ఎంపీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని లబ్ధిదారులకు వేగంగా చెక్కులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు షేక్. ఇమామ్ భాయ్, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, గోనెల భుజంగరెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, ఇమ్మడి తిరుపతిరావు, పాపా నాయక్ పాల్గొన్నారు.

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో జైల్లో చిప్పకూడు తిన్న కవిత వ్యాఖ్యలు హాస్యాస్పదం



నవతెలంగాణ-బోనకల్

ఢిల్లీ లిక్కర్ స్కాంలో జైల్లో చిప్ప కూడు తిన్న కల్వకుంట్ల కవిత ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం హాస్యాస్పదంగా ఉందని జనసేన మధిర నియోజకవర్గ ఇన్చార్జి తాళ్లూరి డేవిడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1200 మంది విద్యార్థుల బలిదానాలతో రాష్ట్రం సాధించబడిందన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై ఎమ్మెల్యేగా, ఎంపీగా ఓడిపోయినా కవిత వ్యాఖ్యలు చేయటం ఆమె దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకుడని కవిత వ్యాఖ్యానించడం పెద్ద ఆశ్చర్యం కాదన్నారు. ఇద్దరూ అవినీతి అక్రమాలకు పాల్పడి జైలు జీవితం గడిపిన వారే కాబట్టి ఒకరిని ఒకరు గొప్పగా చెప్పుకోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదన్నారు. ఏపీలో 30 ఏళ్లు అధికారం నాదేనని విర్రవీగిన బూతు నాయకులకు ప్రతిపక్ష హోదా లేకుండా చేసిన పవన్ కళ్యాణ్ పవర్ ఏంటో ఆంధ్ర ప్రజలకు తెలుసునన్నారు. మారుమూల గ్రామాల్లో, నక్సలైట్లు తిరిగే ప్రాంతంలో సైతం నడుచుకుంటూ వెళ్లి, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, గోకులాలు, మంచినీటి సౌకర్యం కల్పించిన గొప్ప నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత కవితకు గాని వయసు జగన్మోహన్ రెడ్డికి కానీ లేదన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు అనుమల నరేష్, మడుపల్లి పవన్, సంఘపు నరేంద్ర, ఆరికట్ల కళ్యాణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాలలోనే పోషక పదార్థాలు

నవతెలంగాణ-బోనకల్

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు గర్భిణులకు పోషక పదార్థాలను అందజేస్తుందని బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వల్లూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం పోషక పక్షం వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కొండ సుజాత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఆయాలు, బాలింతలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సెడార్ వ్యాలీ' ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం

- మంత్రి తుమ్మల రాక

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని కొత్త కలెక్టరేట్ ఎదురుగా గల సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరుగనున్నాయని పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి, సీనియర్ సైంటిస్ట్, డాక్టర్ పి.కె. సుందరమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి ఈ. సోమశేఖర శర్మ హాజరుకానున్నారని, జిల్లాకే తలమానికంగా అత్యాధునిక వసతులతో విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు తల్లిదండ్రులు, పుర ప్రముఖులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.



బస్టాండ్ ఆవరణలో గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-పెనుబల్లి

మండల కేంద్రంలోని వీఎం బంజర్ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఓ వ్యక్తి నుండి గంజాయిని పెనుబల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ఇలా ఉన్నాయి. లంకపల్లి గ్రామానికి చెందిన బోయిని వెంకటరమణ అనే వ్యక్తి నుండి 1.110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా నుండి విజయవాడకు గంజాయిని తరలిస్తున్నాడని సమాచారంతో వీఎం బంజర బస్టాండ్‌లో అతన్ని అరెస్ట్ చేసి పంచనామ నిర్వహించి కేసు నమోదు చేశారు. గతంలో వెంకటరమణపై గంజాయి తరలింపు, పట్టుబడిన కేసులు ఉన్నాయని ఎస్సై వెంకటేష్ పేర్కొన్నారు. సత్తుపల్లి కోర్టులో రిమాండ్ చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

మహత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్



ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జ్యోతి రావు పూలే జయంతిని బార్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే మహనీయుడి జన్మదినం జరుపుకోవడం నేటి తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, అర్చన కుమారి, డి.రాంప్రసాద్, బిందు ప్రియ, కె.దీప, బార్ కౌన్సిల్ కొల్లి సత్యనారాయణ, కార్యదర్శి గద్దల్ దిలీప్ కుమార్, కార్యవర్గం సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కత్తి దాడులు అమానుషం

- గ్రామాల్లో పెరుగుతున్న విష సంస్కృతిని అరికట్టాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-చర్ల



చిన్న చిన్న విషయాలకే ఉద్వేగానికి గురై మనిషిని మనిషి చంపుకునే అంత కోపతాపాలు పెంచుకొని కత్తులతో దాడులు చేసుకోవడం చాలా అమానుషమైన విషయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రాత్రి పూసుగుప్పలో తాటి భూపతి, సోడి వినోద్ అనే ఇద్దరు యువకులపై అదే గ్రామానికి చెందిన పండా కృష్ణమూర్తి అనే ఆటో కార్మికుడు పదునైన కత్తితో హత్య ప్రయత్నం చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. రక్తపు మడుగులో ఉన్న వారిద్దరిని గ్రామస్తులు ముందు చర్ల హాస్పిటల్‌కి తరలించారు. అక్కడి నుండి ఏరియా హాస్పిటల్ భద్రాచలం తరలించారు. వారిని శుక్రవారం ఏరియా హాస్పిటల్‌లో మచ్చ పరామర్శించి, మాట్లాడారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న మా పైకి ఆటోను ఎందుకు వేగంగా తీసుకువచ్చావని అడిగినందుకే ఆవేశపూరితంగా కృష్ణమూర్తి రాత్రి పది గంటల సమయంలో దాడి చేసిన విషయాన్ని తెలుసుకున్న మచ్చ వారిని ఓదారుస్తూ అతి చిన్న విషయమైన దీనికే ప్రాణం తీసే అంత కోపం రావడం సమంజసం కాదని ఏదైనా ఉంటే కూర్చొని సామరస్యంగా మాట్లాడుకోవాలన్నారు. ఇలా ఒకరినొకరు చంపుకుంటూ పోయే పరిస్థితి మరొకసారి రాకుండా సంబంధిత యంత్రాంగం దృష్టి సారించి, అలా దురుసుగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యాన్ని కల్పించారు. కాగా కత్తిపోట్లకు గురైన సోడి వినోద్‌కు సుమారు 12 సెంటీమీటర్లు చిన్నప్రేగు తొలగించాల్సి వచ్చిందని, తాటి భూపతికి కిడ్నీ సమీపం వరకు కత్తిపోటు జరగడం వలన తనకు మేజర్ ఆపరేషన్ చేయాల్సి వచ్చిందని ఏరియా హాస్పిటల్ వైద్యులు, హాస్పిటల్ సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ తెలిపారు. ప్రస్తుతానికి ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చాలా పెను ప్రమాదం తప్పిందని వైద్యులు తెలిపారు. అయితే సంఘటన తెలుసుకున్న చర్ల సీఐ రాజు వర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు పేరెల్లి సంతోష్, పట్టణ కమిటీ సభ్యులు ధనకొండ రాఘవయ్య, పూసుగుప్ప గ్రామస్తులు గుండి గోపాలకృష్ణ, సోడి జగపతి, సోడి నీలయ్య, సోడి రవి, పెద్ద ఎత్తున మహిళలు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఫూలే చిత్రపటానికి ఎంపీ రవిచంద్ర నివాళి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి సందర్భంగా రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావుతో కలిసి భద్రాచలంలోని రెడ్డి సత్రంలో జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు పాల్గొని, నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే అని అన్నారు. సమాజంలో కుల లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని ఆ రోజుల్లోనే భావించిన గొప్ప నాయకుడు ఫూలే అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ దిండిగాల రాజేందర్, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మానే రామకృష్ణ, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, వివిధ మండలాల పార్టీ బాధ్యులు రాంబాబు, నర్సింహ మూర్తి, దొడ్డి తాతారావు, ఆకోజు సునీల్, కృష్ణారెడ్డి, కణితి రాముడు, బోదెబోయిన బుచ్చయ్య, రేసు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

20 కోట్లతో పినపాక నియోజకవర్గం అభివృద్ధి

పులుసు బొంత ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభిస్తాం

భూ భారతిని ఏప్రిల్ 14న ప్రారంభిస్తాం





- ప్రగతి భవనంను పూలే భవనగా మార్చాం
- విలేకర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-మణుగూరు

రూ.20 కోట్లతో పినపాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని, పులుసు బొంత ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభిస్తామని, భూ భారతిని 14న ప్రారంభిస్తామని, దొరల ప్రభుత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రగతి భవనమును జ్యోతిరావు పూలే భవనంగా మార్చామని రాష్ట్ర రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం రూ.1 కోటి 57 లక్షల భూమిని తాకట్టు పెట్టారని అన్నారు. ధరణి కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. దానిని బంగాళాఖాతంలో పడేసినమన్నారు. ప్రస్తుతం అనేక సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా శిల్పారామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వ అధికారులతో భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. 2025 భూభారత చట్టం పేద రైతు నుండి ఆసాముల వరకు అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు. అప్పల భారంతో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రతి సమస్య పరిష్కరించుకుంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చి 15 నెలలు గడిచిందన్నారు. అప్పుల భారంతో కురుకుపోయిన రాష్ట్రాన్ని సరిదిద్దుకుంటూ ఇచ్చిన ఎన్నికల హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామన్నారు. ఉచిత కరెంట్, ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్, యువతకు భరోసానిచ్చే రాజీవ్ వికాస్ నియోజకవర్గంలో 5000 మంది యువకులకు అమలు చేస్తామన్నారు. గత ఉగాది నుండి సన్నబియ్యంతో పేదవాడికి కడుపు నింపుతున్నామన్నారు. ఆరు గ్యారెంటీలను ఒకటిగా అమలు చేస్తున్నామన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రతిపక్షం ఎన్ని కుట్రలు చేసినా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే పులుసుబంత ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రారంభిస్తామన్నారు. మండలంలో నాక్ సహకారంతో ఐదు కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న భవన సముదాయాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం కూనవరం పంచాయతీలోని వంక ముఖేందర్ గృహంలో సన్న బియ్యం భోజనం చేశారు. రామనుజవరం పగిడేరు మధ్యలో ఉన్న పిత్మవాయి వాగుపై ఒక కోటి తొంబై రెండు లక్షలతో హై లెవెల్ బ్రిడ్జిని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పగిడేరులో పోచంపల్లి వాగుపై కోటి పది లక్షలతో హై లెవెల్ వంతెనకు శంకుస్థాపన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, తుళ్లూరు బ్రహ్మయ్య, బి.అయోధ్య, మండల, పట్టణ అధ్యక్షులు పీరినాకి నవీన్, బి.శివ సైదులు, ప్రసాద్, శ్రీ వాణి, విజయ్ గాంధీ, చందా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గౌతాపురం గ్రామంలో రూ.90 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాలతో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భజన ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలపై మంత్రి పొంగులేటికి వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సొసైటీ మాజీ చైర్మెన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్ కుమార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు భజన ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెం పూడికృష్ణా రెడ్డి, పార్టీ టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, పార్టీ మండల నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సారపాక ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి

మండలంలోని సారపాకలో గల ముత్యాలమ్మ తల్లిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. శుక్రవారం ముత్యాలమ్మ తల్లి వారి ప్రథమ జాతర మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పటేల్, పీఓ రాహుల్, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు అమ్మవారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగున పొంగులేటికి ఘన స్వాగతం

మండల పర్యటనకి విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అడుగ డుగునా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘనంగా స్వాగతం పలికారు. మండల సరిహద్దు గ్రామమైన పినపాక పట్టి నగర్ గ్రామం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటికి ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా మండల కేంద్రమైన బూర్గంపాడులో స్వాగతం పలికారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

అశ్వాపురం : మండలంలోని ఆర్అండ్‌బీ రహదారి దగ్గర నుండి బిజీ కొత్తూరు గ్రామానికి రూ.63లక్షలు, కురసం వారి గూడెం నుండి జగ్గారం గ్రామం వరకు రూ.1.92 కోట్ల వ్యయంతో బీటీ రోడ్లను నిర్మాణం చేపట్టేందుకు శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపనలు చేశారు. మంత్రికి బిజీ కొత్తూరు, జగ్గారంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. శంకుస్థాపన అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పీవో రాహుల్, సీపీఐ రాష్ట్ర నాయకులు బొల్లోజు అయోధ్య, నెల్లిపాక సొసైటీ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్ రెడ్డి, తహశీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాలి కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, భూ రెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

తలసేమియా, సికిల్సెల్ ఎనిమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రం భద్రాచలంలో ఉచితంగా తలసేమియా, సికిల్సెల్ ఎనిమీయా వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించు కార్యక్రమమును కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వారి కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. తలసేమియా, సికిల్సెల్ ఎనిమీయా వ్యాధి రక్త హీనత పుట్టుకతో సంక్రమిస్తుందని వారి చికిత్స కోసం క్రమం తప్పకుండా వ్యాధి తీవ్రతను బట్టి రెండు, మూడు నెలలకు ఒక్కసారి చొప్పున వారికి రక్తం ఎక్కించి వారిని కాపాడాల్సి ఉంటుందని, ప్రజలందరూ వైద్యులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం డా.ఎస్.ఎల్.కాంతారావు మాట్లాడుతూ... ఈ కార్యక్రమం నిర్వహణకు సహకరించిన కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కిట్స్ సమకూర్చిన ఐటీసీ పీఎస్పీడీ మిల్ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, పి.శ్యామ్ కిరణ్, జనరల్ మేనేజర్, డి.చెంగల్రావుకు ఐఆర్సిఎస్ భద్రాచలం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డా.ఎస్.ఎల్.కాంతారావు, వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, వి.కామేశ్వరరావు, గోళ్ళ భూపతిరావు, జి.సంజీవరావు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- సభల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభలు 2025 ఏప్రిల్ 25, 26, 27 తేదీల్లో ఖమ్మం నగరంలో జరుగుతున్నాయని మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు భూపేందర్ తెలిపారు. భద్రాచలం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీ నందు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభల పోస్టర్ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రవీందర్ అధ్యక్షతన పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు భూపేందర్ హాజరై మాట్లాడుతూ... రాష్ట్రంలో 10లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్ఎఫ్ఐ ఉందని, నిత్యం రంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని వారు తెలిపారు. విద్యారంగంలో కార్పొరేటీకరణ ప్రయివేటీకరణ కేంద్రీకరణ వ్యాపారికరణతో పాటు నూతన సంస్కరణ పేరుతో విద్యారంగంలో తీసుకు వస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ విద్యార్థులందరినీ ఐక్యం చేసి దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నడుపుతుందని వారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు అధునాతన విద్యా విధానం పేరుతో నూతన విద్యా విధానం 2020 తీసుకొచ్చిందని వారు తెలిపారు. నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టే విధానాలు అమలు చేస్తుందని రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ గురుకుల వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యల పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, రాజు, నవీన్, పల్లవి, నవ్య, దీప్తి, కళ్యాణి, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి బయ్యా అభిమన్యు గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం అనునిత్యం పోరాడుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొడు తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేందర్, సుధీర్, ప్రశాంత్, నవీన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక బుద్ధుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఆధునిక బుద్ధుడు మహాత్మ జ్యోతిరావు ఫూలే అని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలం పట్టణంలో మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ, దళిత సంక్షేమ సంఘం, తెలంగాణ మాదిగ దండోరా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. ఆధునిక భారతదేశ చరిత్రలో సామాజిక పరివర్తన ఉద్యమాలకు బలమైన పునాది వేసిన ప్రముఖ గొప్ప వ్యక్తులలో పూలే అన్నారు. పూలే తన జీవితకాలం అంతా మనువాద సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. అంతిమంగా పూలే కొనసాగించిన సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన ఉద్యమానికి నీతి నిబద్ధతతో కొనసాగింపులు ఇవ్వడమే వారికి ఇచ్చే నిజమైన గౌరవం అని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య, తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు గురజాల వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆర్.నారాయణ, డాక్టర్ విద్యాసాగర్, ఉదయ్ హాస్పిటల్ యాజమాన్యం ఈటె రాజేశ్వరరావు, ఎమ్మార్పిఎస్ నాయకులు అలవాల రాజా మాదిగ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం, ఉపాధ్యక్షులు పేరాల నాగరాజు, సెక్రటరీ పూసల శ్రీనివాసచారి, బీసీ సంఘ నాయకులు బొలిశెట్టి రంగారావు, కాంగ్రెస్ నాయకులు అన్నెం సత్యాలు, రమాకాంత్ మామిడి, ముస్లిం మైనారిటీ నాయకులు ఎస్.కె మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

గుట్టలుగా పేరుకుపోతున్న రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు

- మండలానికి ఎన్ని యూనిట్లు వస్తాయి అన్నదానిపై సందేహం
- పెరుగుతున్న ఆశావాహుల సంఖ్య

నవతెలంగాణ-అశ్వాపురం



రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు గుట్టలుగా పేరుకు పోతున్నాయి. రోజురోజుకు ఆశావాహుల సంఖ్య పెరిగిపోతోంది. ఉన్నత విద్యను అభ్యసించి ఎటువంటి ఉపాధి లేకపోవడంతో ఉపాధి కోసం యువత నుండి దరఖాస్తులు వెల్లువల వస్తున్నాయి. ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయానికి ఎస్సీ కేటగిరి నుండి 230, ఎస్టి 341, బిసి 372, ఈబిసి 14, మైనార్టీ 22తో కలిపి శుక్రవారం నాటికి ఈ పథకానికి మండలం నుండి మొత్తం 979 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇంత పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో ఎవరికి ఈ పథకం ద్వారా ఉపాధి కోసం రుణాలు వస్తాయో ఎవరికి రావో అన్న సందేహంలో లబ్ధిదారులు అయోమయంలో పడుతున్నారు. ఈ పథకం ద్వారా మండలానికి ఎన్ని యూనిట్లు కేటాయిస్తారనే అంశం చర్చనీయాంశంగా మారుతోంది. కనీసం వంద మందికైనా ఈ పథకం వర్తిస్తుందా అనే సందేహంలో రుణాల కోసం ఎదురుచూస్తున్నవారు ఉన్నారు. ఇంకా దరఖాస్తుకు మూడు రోజులు గడువు ఉండడంతో మరికొన్ని దరఖాస్తులు పెరిగే అవకాశం లేకపోలేదు.

సర్వర్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14 వరకే గడువు ఉండడంతో ఆన్‌లైన్ సెంటర్లన్నీ బిజీగా మారిపోయాయి. ఓ పక్కన ఆన్‌లైన్ సర్వర్ సహకరించకపోవడంతో దరఖాస్తు చేసుకునేందుకు ఆయా సెంటర్ల వద్దకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత సైట్ పనిచేయకపోవడంతో ఆశావాహులు వెను తిరిగి వెళుతున్నారు. కొందరు మాత్రం ఎలాగైనా దరఖాస్తు చేసుకొని వెళ్లాలన్న ఉద్దేశంతో అక్కడే పడిగాపులు కాసుకుంటూ సర్వర్ ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తూ కూర్చుంటున్నారు.

దరఖాస్తుకు రూ.100 వసూలు చేస్తున్న ఆన్‌లైన్ సెంటర్లు

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువత నుండి ప్రభుత్వం దరఖాస్తులు కోరడంతో ఆన్‌లైన్ సెంటర్లకు పండగ అయిపోయింది. దరఖాస్తుకు ప్రభుత్వం కేటాయించిన ధర కంటే అదనంగా తీసుకుంటున్నారు. ఆన్‌లైన్ సెంటర్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారి నుండి రూ.వంద వరకు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా మిగిలిన ధ్రువీకరణ పత్రాలకు జిరాక్స్‌ల పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారని పలువురు అంటున్నారు. ఆన్లైన్ సెంటర్లకు సంబంధిత శాఖ అధికారులు ఎవరూ ఎటువంటి నిబంధనలను విధించకపోవడంతో వారు ఇష్టానుసారంగా వసూలు చేస్తూ నిరుద్యోగ యువత జేబుకు చిల్లులు పెడుతున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

పేలిన బాణాసంచా...తప్పిన ప్రమాదం

- కారకులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కొత్తగూడెం



పోస్ట్ ఆఫీస్ సెంటర్లో బాణాసంచా పేల్చిన సందర్భంగా ప్రమాదం జరిగింది. దీనివలన ఎలాంటి ప్రణాపాయం జరుగకపోయినప్పటికీ స్థానికంగా సంచలనం రేపింది. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ కొత్తగూడెం పట్టణానికి విచ్చేసిన తరుణంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ, ఊరేగింపు ఏర్పాటు చేశారు. యూత్ కాంగ్రెస్ అద్యక్షులు పోస్టాఫీస్ సెంట్ రాగానే అయనకు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణా సంచా కాల్చారు. ఎగిసి పడుతూ రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్ పార్క్‌లో కానిన బాంబులు పడ్డాయి. దీంతో గడ్డి ఒక్కసారిగి అంటుకుంది. సుందరీకరణ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రాస్ ఎండకు ఎండి ఉండటంతో బాణా సంచా పైకి ఎగిరి గడ్డిపై పడగానే ఒక్కసారిగా మంటలు ఎగిశాయి. కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. మండలు పోగతో పోస్టాఫీస్ సెంటర్ భయాందోళనకు గురిఅయింది. అక్కడున్న ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు, ఇతరులు వెంటనే చలివేంద్రంలో ఉన్న వాటర్ క్యాన్స్‌లోని నీటిని చల్లారు. కొందరు మరోరకంగా మంటలను ఆర్పారు. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. అనుమతులు లేని బాణా సంచా కాల్చడంతో రోడ్డుకు పక్కనే ఉన్న వ్యాపార షాపుల్లోకి వెళ్లి ఉంటే భారీగా నష్టం జరిగి ఉండేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి

బాగా రద్దీగా ఉన్న ప్రాంతం వాహనాలు రాకపోకలు జరుగుతున్న తరుణంలో ఒక్కసారిగా మంటలు రేగడం, ప్రజలు పరుగులు తీయడం జరిగింది. మరోపక్క పెద్దపెద్ద ఫ్లెక్సీ హెూడింగులు ఉన్నాయి. అవన్నీ అగ్నికి అహుతి అయి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని, దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వినర్ జలాల్ డిమాండ్ చేశారు. దీనితో పాటు మున్సిపల్ పరిధిలో ఉన్న డివైడర్ పార్క్‌లో విలువైన గ్రాస్ కాలి బూడిదైంది. నష్ట పరిహారం వసూళ్ల చేయాలని డిమాండ్ చేశారు.

మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-దమ్మపేట

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం మండలంలో పర్యటించారు. మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో గల రామాలయంలో జరుగుతున్న అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలలో జారే పాల్గొన్నారు. అనంతరం అదే గ్రామంలో జల్లిపల్లి సత్యనారాయణ కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని పెళ్ళి కుమారుడిని ఆశీర్వదించారు. దురిశెట్టి సత్యనారాయణ కుమార్తె నిశ్చయతాంబూలాల వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. గుండె ఆపరేషన్ చేసుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న భూబత్తుల మారేష్‌ను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. నరకుల్ల రుక్మిణమ్మ కుటుంబాన్ని, ఎస్‌కె ఖాసీం కుటుంబ సభ్యులను, భోగ్గం శివ, మల్కాపురం అప్పారావు కుటుంబ సభ్యులను, దొడ్డ శివప్రసాద్ సతమణి సర్జరీ చేయించుకోగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. నక్కలపు రవి కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండగా అతన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మెరుగైన వైద్యం కోసం సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మోరంపూడి వెంకటేశ్వరావు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మండల వాసిని పరామర్శించిన ఎమ్మెల్యే

జ్వరం, కామెర్లు, ఊపిరితిత్తుల సమస్యలతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మండల వాసిని జారే గురువారం రాత్రి పరామర్శించారు. మండలంలోని ముష్టిబండ పంచాయతీ వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన ఎలికే లోకేష్ హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్ జయంత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రిలో ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి వైద్యులతో మాట్లాడి అతని ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఏ ఇబ్బంది ఉన్న తనకు తెలియజేయాలని, ధైర్యంగా ఉండమని లోకేష్‌కు, కుటుంబ సభ్యులకు సూచించారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు

నవతెలంగాణ-చంద్రుగొండ



2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనులకు అధికారులతో సమీక్షా సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో స్పెషలాఫీసర్ సంజీరావు అధ్యక్షతన నిర్వహించారు. బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మండలంలో రూ.22 లక్షల 40 వేలతో పనులను చేపడుతున్నట్టు తెలిపారు. ప్రధానంగా మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యం పై దృష్టి సారించి వాటికి 50% నిధులు కేటాయిస్తున్నట్లుగా తెలిపారు. ఎక్కడైతే ఇళ్లకు మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనుల నిర్వహణ లేనిచోట్ల ఈ నిధులను పెద్ద మొత్తంలో వెచ్చించాలని స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు తెలిపారు. రాజీవ్ యువ వికాస్ పథకానికి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ దానికి సంబంధించిన జిరాక్స్ కాపీలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 14 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బయ్యారపు అశోక్, ఎంపీఓ ఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు చదువు ఎంతో ముఖ్యం

- కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
- మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-పినపాక

పూలే జయంతి సందర్భంగా వారిని స్మరించుకొని సమాజానికి చేసిన సేవని చదువు పట్ల పేదవాళ్లకి ముఖ్యంగా ఆడబిడ్డలకి చదువు ఎంత ప్రాముఖ్యత ఉందో, మన నుంచి దూరమైన ఆయన చేసిన సేవలను గ్రహించి ఈనాడు మా ప్రభుత్వం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసమే పాటు పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం పినపాక నియోజకవర్గంలో ఆయన సుడిగాలి పర్యటన చేస్తూ మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకటరావు, కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఉప్పాక బ్రిడ్జి నుండి పోతిరెడ్డిపల్లి వరకు 96 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం పనులకు, పోతిరెడ్డి పల్లె నుండి క్రింది గుంపు వరకు 80 లక్షల వ్యయంతో బీచ్ రోడ్డు నిర్మాణం పనులకు, మల్లారం నుండి వెంకటేశ్వరపురం వరకు కోటి 44 లక్షల వ్యయంతో బీటి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎక్స్ వీఎఫ్‌సీ గ్రాంట్ నిధులతో ఒక కోటి 56 లక్షల వ్యయంతో పినపాకలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథంను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన సేవలను కొనియాడారు. జ్వరం నుండి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగయ్య, డాక్టర్ దుర్గ భవాని, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభకు దండుకట్టండి

- గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలి
- రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు భద్రాచలం నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులంతా దండుకట్టాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. పార్టీ పాతికేళ్ల సభ కనీవినీ ఎరుగని రీతిలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భద్రాచలం నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ ఇన్‌చార్జి మానె రామకృష్ణ అధ్యక్షతన స్థానిక రెడ్డి సత్రంలో శుక్రవారం జరిగింది. సమావేశానికి హాజరైన ఎంపీ సభ విజయవంతానికి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఏప్రిల్ 27 గులాబీ పార్టీ పండుగ రోజని ఆ రోజు గ్రామ గ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలని అన్నారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ మళ్లీ గెలవడం ఖాయం అన్నారు.

అనంతరం పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు మాట్లాడుతూ వరంగల్ సభ దిగ్విజయానికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ దిండిగాల రాజేందర్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మానే రామకృష్ణ, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, వివిధ మండలాల పార్టీ బాధ్యులు రాంబాబు, నర్సింహ మూర్తి, దొడ్డి తాతారావు, ఆకోజు సునీల్, కృష్ణారెడ్డి, కణితి రాముడు, బోదెబోయిన బుచ్చయ్య, రేసు లక్ష్మీ, సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం వరంగల్, ఎల్కతుర్తిలో ఈనెల 27న జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కార్యక్రమ బహిరంగ సభ పోస్టర్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావులు ఆవిష్కరించారు. శుక్రవారం కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వనమా రాఘవేందర్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతలక్ష్మి, మాజీ ఎంపీపీలు బాధవత్ శాంతి, భూక్యా సోన, పాల్వంచ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు మంత పూరి రాజు గౌడ్, ఆత్మకమిటి చైర్మెన్ బత్తుల వీరయ్య, మండల పార్టీ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి పెద్ద కష్టం

- మూత్రపిండాలు, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న 'వడ్రంగి వెంకన్న'
- దాతల సహాయం కోసం ఎదురుచూపు
- చిరు సాయం అందించిన బ్యూటీ లైఫ్ అసోసియేషన్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రెక్కాడితే కాని డొక్కాడని ఆ పేద కుటుంబానికి కష్టం వచ్చింది. పెద్దాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే స్తోమత లేక దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. మూత్రపిండాలు, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న 'వడ్రంగి వెంకన్న'కు స్థానికంగా ఉన్న బ్యూటీ లైఫ్ అసోసియేషన్ చిరు సాయం అందించింది. వివరాల్లోకి వెళితే...మండలంలోని గౌరవరం గ్రామానికి చెందిన కట్టోజి వెంకన్న వడ్రంగి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల వెంకన్న అనారోగ్యం బారిన పడటంతో భార్య విజయ ఓ ప్రయివేటు వైద్యశాలకు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. దీంతో వైద్యులు కిడ్నీతో పాటు క్యాన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని మెరుగైన వైద్యం చేయించాలని సూచించారు. కుటుంబ సభ్యులు కొంత వరకు ఆర్థిక సాయం అందించినప్పటికీ వైద్య ఖర్చుల పెరిగే కొద్దీ అవి ఏమాత్రం సరిపోవడం లేదు. ప్రస్తుతం విజయ దొరికిన కాడల్లా అప్పులు చేసి తన భర్తని వరంగల్‌లోని ఒక ప్రయివేటు వైద్యశాలలు చేర్పించి చికిత్స అందిస్తుంది. బాధిత కుటుంబ సభ్యులు స్థానికంగా గల బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ నిర్వాహకుల వద్దకు వెళ్ళి తమకు వచ్చిన కష్టాన్ని తెలిపారు. స్పందించిన నిర్వాహకులు బీఎల్ఏ గౌరవ సభ్యులందరి తరపున వైద్య ఖర్చుల నిమిత్తం ఫోన్ పే ద్వారా రూ.2 వేలు చిరు సాయం అందజేశారు. దాతలు ఫోన్ పే నెంబర్ 7670916840 ద్వారా తోచినంత ఆర్థిక సహాయం అందజేసి పేద కుటుంబానికి అండగా నిలవాలి అన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అశ్వాపురం : మణుగూరు నుండి పాల్వంచకు అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం లారీని పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. లారీలో రేషన్ బియ్యం తరులుతున్నాయన్న పక్కా సమాచారంతో పోలీసులు మండల కేంద్రంలోని కాలనీ గేటు వద్ద నిఘా వేసి పట్టుకున్నారు. పట్టుకున్న లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీలో సుమారు 100 క్వింటాల బియ్యం ఉన్నట్లు తెలుస్తోంది.

పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ-సుజాతనగర్

అణగారిన వర్గాల కోసం విద్యని ఆయుధంగా మలచిన సామాజిక ఉద్యమ నేత, కుల, దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించిన సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని సీపీఐ(ఎం) సుజాత నగర్ మండల కార్యదర్శి వీర్ల రమేష్ అన్నారు. శుక్రవారం సుజాతనగర్ పార్టీమండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నివాళి అర్పించి, ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొమర రెడ్డి, మండల కమిటీ సభ్యులు కొండె కృష్ణ, బాలు వెంకటేశ్వర్లు, చింతల శ్రీను, చింతలపూడి కృష్ణ, రాసాల హనుమంతురావు, సిరిగిరి మురళి, కేసుపాక వెంకటేశ్వర్లు,సత్యనారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ళు రిమాండ్

నవతెలంగాణ-అశ్వారావుపేట



మండలంలోని కంట్లం ఈస్ట్ బీట్, కావడిగుండ్ల సెక్షన్, అశ్వారావుపేట రేంజ్, పాల్వంచ డివిజన్ పరిధిలో నాటు తుపాకులతో వేటకు వచ్చిన ముగ్గురు వ్యక్తులను ఈ నెల 9వ తేదీ బుధవారం అదుపులోకి తీసుకున్న అశ్వారావుపేట ఎఫ్ఆర్ఓ మురళి రేంజ్ సిబ్బంది సహకారంతో విచారించి, కేసు నమోదు చేసారు. ఆ ముగ్గురు నిందితులను పాల్వంచ డిప్యూటీ సీ.ఎఫ్, ఎఫ్డీఓ దామోదర్ రెడ్డి పర్యవేక్షణలో గురువారం రాత్రి దమ్మపేట ఇంచార్జి మొదటి తరగతి న్యాయాధిపతి ఎదుట హాజరు పరిచారు. పరిశీలన అనంతరం ఆ ముగ్గురి ముద్దాయిలను 14 రోజులు పాటు రిమాండ్ విధిస్తు భద్రాచలం సబ్ జైల్‌కు పంపారు. ఈ విషయాన్ని శుక్రవారం స్థానిక ఎఫ్ఆర్ఓ మురళి తెలిపారు.

సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే



దుమ్ముగూడెం



కొత్తగూడెం

- జయంతి వేడుకల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మనువాదానికి వ్యతిరేకంగాలి కుల దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించిన సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని ములకపాడు సెంటర్‌లో గల యలమంచి సీతారామయ్య భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య అధ్యక్షతన పూలే జయంతి సభ జరిగింది. ముందుగా నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మచ్చా మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం విద్యను ఆయుధంగా మలచిన మహా సామాజిక ఉద్యమ నేత, కుల, దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించిన సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని ఆయన అన్నారు. కుల, దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించినవాడు పూలే మాత్రమే అన్నారు. నాటి బ్రాహ్మణ ఆధిపత్యం సమాజంపై తన అస్త్రాన్ని ఎక్కు పెట్టడం జరిగిందన్నారు. సమాజంలో నెలకొన్న దురాచారాలకు వ్యతిరేకంగా సంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని, స్త్రీ అభివృద్ధి సమాజ అభివృద్ధిగా భావించి ముందుకు నడిపించిన మహా నాయకుడు పూలే అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పనిచేశారని, సతీసహగమనాన్ని వ్యతిరేకంగా ఉద్యమించాలని, వితంతువులకు వివాహాలు ప్రోత్సహిస్తూ గొప్ప సంఘసంస్కర్తగా వెలుగొందారని అన్నారు. నేడు కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ పార్టీ సనాతన ధర్మం పేరుతో మనువాదాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుందని, వాటి ప్రయత్నాలను తిప్పి కొట్టడమే పూలేకు మనం ఇచ్చే ఘన నివాళి అన్నారు. లౌకిక తత్వ పార్టీలంతా ఏకమై బిజెపి పార్టీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మెన్ యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వై.శ్రీను బాబు, మండల కమిటీ సభ్యులు కాక కృష్ణ, కల్లూరి లక్ష్మయ్య, వర్స చిన్నారావు, వీర్రాజు, శ్రీను, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడటమే పూలేకు ఇచ్చే నివాళి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కనకయ్య

కొత్తగూడెం : సంఘ సంస్కర్త, సామాజిక ఉద్యమకారుడు, బడుగు, బలహీన అభ్యున్నతికై పాటు పడిన నాయకుడు అయిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక మంచికంటి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన పూలే చిత్రపటానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అట్టడుగు ప్రజల అభ్యున్నతి కోసం పూలే తన యావత్ జీవితాన్ని అంకితం చేశాడన్నారు. పూలే కలలు కన్న సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, డి.వీరన్న, నందిపాటి రమేష్, అమర్ సింగ్, వై.వెంకటేశ్వరరావు, నాగకృష్ణ, రాంచరణ్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళా కళాశాలలో : సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల హిస్టరీ విభాగం వారి ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద పూలే చిత్ర పటాన్ని పూల మాల వేసి నివాళులు అర్పించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హిస్టరీ విభాగం అధ్యాపకురాలు బి.మేఘన, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొత్తగూడెం : సామాజిక విప్లవకారుడు జ్యోతిభాపులే అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన అన్నారు. శుక్రవారం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షులు భూక్య రమేష్, సక్రం, శ్రీను, భంగి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో : సీపీఐ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, కె.రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, నూనావత్ గోవిందు, బత్తుల సురేష్, కత్తెర్ల రాములు, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

రామవరం అంబేద్కర్ భవన్‌లో : సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం పట్టణంలోని అంబేద్కర్ భవన్ (మాదిగ సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ వెంకన్న అధ్యక్షత వహించగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు గ్రహీత బరిగెల భూపేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ వెంకన్న, జిల్లా కార్యదర్శి సామర్ల సమ్మయ్య, జిల్లా నాయకులు మాతంగి లింగయ్య, కొత్తూరు మదనయ్య, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రూరల్ : అనగారిన జనాలలో చైతన్యం నింపేందుకు విద్యనే ఆయుధంగా మలిచిన మహానేత మహాత్మ జ్యోతిరావు పూలే అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబులు అన్నారు. పూలే జయంతిని పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన కామ్రేడ్ చంద్రరావు భవన్ నందు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే అనగారిన వర్గాల ప్రజలను చైతన్య పరిచి విద్యను అందించేందుకు విశేష కృషి చేశారని, సాంఘిక దురాచారాలు, బాల్యవాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించారని అన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాదాన్ని రాజ్యాంగంగా తీసుకువచ్చి సమాజంపై రుద్దాలని ప్రయత్నం చేస్తుందని దానికి వ్యతిరేకంగా పోరాడమే జ్యోతిరావు పూలేకు మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి.సంతోష్ కుమార్, డి.సీతాలక్ష్మి, సీనియర్ నాయకులు బిబిజి తిలక్, ఎం.వి.ఎస్.నారాయణ, పట్టణ కమిటీ సభ్యులు ఎన్.నాగరాజు, యు.జ్యోతి, ఎస్.భూపంద్ర, కోరాడ శ్రీనివాస్, కుంజ శ్రీనివాస్, రాయల రాములు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్ల : మహత్మ జ్యోతిరావ్ పూలే, సావిత్రి బాయ్ పూలే, అంబేద్కర్‌ల వంటి సామాజిక విప్లవకారుల అపూర్వమైన కృషి మరువలేనిదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్రహ్మాచారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పామర బాలాజీ, పొడుపు గంటి సమ్మక్క, ఉడుగుల షారోని, వరదల వరలక్ష్మి, మండల నాయకులు పాముల సాంబశివరావు, శ్యామల, కాంతయ్య, వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : సీపీఐ(ఎం) విధాన నిర్ణయంలో భాగంగా మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సామాజిక ఉద్యమ పితామహుడు జ్యోతి రావు పులే జయంతి ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి సోడెం ప్రసాద్ నేతృత్వంలో మూడు రోడ్ల ప్రధాన కూడలిలో గల పూలే విగ్రహానికి జిల్లా కమిటీ సభ్యులు బి.చిరంజీవి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండలంలోని మొద్దులు గూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్, యూటీఎఫ్ బాధ్యులు కొచ్చర్ల శ్రీనివాసరావు, మడిపల్లి వెంకటేశ్వరరావు, నారం అప్పారావు, బండి ఏసు తదితరులు పాల్గొన్నారు. ఇదె విగ్రహానికి రెండు బీసీ సంఘాల నాయకులు తాళం సూరిబాబు, ఆరేపల్లి రాము, వేముల ప్రతాప్, రాజా రమేష్, అక్కినేని నరేంద్ర, వెంకటేశ్వరరావు, రోహిత్‌లు నివాళులు అర్పించారు. మహాత్మా జ్యోతీ రావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల బాలబాలికలు పాఠశాలలో ప్రిన్సిపాల్‌లు రేణుకా రాణి, నిరోషా, ఆయా పాఠశాలల సిబ్బంది ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.

బూర్గంపాడు : విద్యా విధానం లో బడుగు బలహీన వర్గానికి విద్య అందరికీ అందించిన ఆదర్శమూర్తి జ్యోతిరావు పూలే అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సారపాక కార్యాలయంలో పూలే జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, అబిదా, మీనా, నాగమణి, మరియమ్మ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా, మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే దిశగా అలుపెరగని ఉద్యమాన్ని నిర్మించిన మహానుభావుడు పూలే అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో అర్జున్, పార్టీ జిల్లా నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోదూరు కృష్ణ, రమేష్, బ్రహ్మయ్య, భద్రు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం రూరల్



చర్ల



అశ్వారావుపేట



దమ్మపేట



బూర్గంపాడు

పవన్‌పై కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను ఖండించిన అబ్దుల్ రెహ్మాన్



నవతెలంగాణ-దమ్మపేట

కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను జనసేన పార్టీ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రెహ్మాన్ ఖండించారు. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కవిత ఒక ఐరన్ లెగ్ అని ఆమె కారణంగా ఏపీలో జగన్, ఢిల్లీలో కేజ్రీవాల్, తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాలు కూలిపోయాయని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇప్పటికే లిక్కర్ స్కాం కేసులో చిప్పకూడు తిన్నా ఏమాత్రం బుద్ధి రాలేదని, తెలంగాణ జాగృతి పేరుతో తెలంగాణ ఆస్తులను తెలంగాణ సంపదను దోచుకున్న చరిత్ర కవితదని అన్నారు. ఇప్పటికే ఏపీ మాజీ సీఎం జగన్ పార్టీతో ఉన్న చీకటి బంధం అందరికీ తెలిసిందే అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా జనసేన పార్టీ జెండా రెపరెపలాడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు కనకయ్య



నవతెలంగాణ-ములకలపల్లి

గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఒడ్డు రామవరం, వీ.కే రామారం గ్రామాల ఉపాధి పని ప్రదేశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కూలీలకు గత రెండు నెలలుగా బిల్లులు రాక అవస్థలు పడుతున్నా రన్నారు. కూలీలకు రోజు కూలి రూ.500 నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో టెంటు, మంచినీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్లు, పారా, గడ్డపార, కనీస మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ఉపాధి చట్టం వచ్చిందని ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేని పక్షంలో వ్యకాస ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ కూలీలను సమీకరించి ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు, మండల కార్యదర్శి మాలోతు రావూజా, గిరిజన సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, అమల, జగ్గు, హేమని, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కొత్త మైన్స్ రాకుండా కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకుంది

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మెన్ జనక్ ప్రసాద్



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణిలో కొత్త మైన్స్ రాకుండా కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకున్నదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో సింగరేణిలో కొత్త ప్రాజెక్ట్ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వీకే-7, ఓసీ, ఇల్లందులోని పూస పెల్లి ఓసీకి పర్మిషన్ తీసుకురావడం జరిగిందని ఐఎన్‌టీయుసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మెన్ జనక్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పీవీకే 5మైన్ నందు ఐఎన్‌టీయుసి కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ.రజాక్ అధ్యక్షతన పిట్ సెక్రటరీ చిలక రాజయ్య ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ జరిగింది. ఈ గేట్ మీటింగ్‌లో జనక్ ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక సమస్యలను పరిష్కారం చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే ఐఎన్‌టీయుసి యూనియన్ విజ్ఞప్తి మేరకు పెండింగ్‌లో వున్న డిపెండెంట్‌ల వయసును 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం జరిగిందని తెలిపారు. సింగరేణిలో మహిళలకు ఉద్యోగ అవకాశాలను పెంచడానికి 33 శాతం జీఓను తీసుకు రావడం, ఈ జీఓ ద్వారా అనేక మంది మహిళలు ఉగ్యోగాలు పొందారని తెలిపారు. సింగరేణిలో పెండింగ్‌లో వున్న పేర్ల మార్పిడి, సొంతింటి కల, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్‌ను కార్మికులకు యాజమాన్యమే చెల్లించడం తదితర సమస్యలను తప్పకుండ పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయుసి కేంద్ర కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌లు నర్సింహా రెడ్డి, త్యాగరాజన్, వికాస్ కుమార్, అల్ బర్ట్, భీముడు, ఎస్‌కె.గౌస్, కాల్వ నాగభూషణం, బూటుక రాజేశ్వర్ రావు, సకినాల సమ్మయ్య, మల్లారపు కొమరయ్య, పోశం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కొత్తగూడెం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం సుజాతనగర్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్ ఢీ కొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పోడియం దినేష్ (38) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుకుమా జిల్లా చెందిన వ్యక్తి. కూలి పనుల నిమిత్తం సుజాతనగర్ ప్రాంతానికి వచ్చినట్లు సమాచారం. సుజాతనగర్ వద్ద దినేష్ తన కుమారుడితో రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న క్రమంలో దినేష్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. దినేష్ అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. వక్కన ఉన్న కుమారుడికి గాయాలు కావడం, తీవ్ర భయాందోళనకు గురైన బాలుడుకి సరిగా మాటలు రాక, సరైన సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నాడు. తెలుగు భాష కాకపోవడంతో, కొద్దిసేపు ఎవరు, ఎక్కడివారు అనేది ఎవరికి అర్థం కాకుండా పోయింది. షోషల్ మీడియాలో తీవ్ర ప్రచారం కావడంతో కొద్దిసేపటికే ఆచూకి గుర్తించారు. ప్రస్తుతం ములకపల్లి మండలం ధర్మ నగర్ వద్ద నివసిస్తున్నాడని, మృతుడికి భార్య లక్ష్మి, 4 సంవత్సరాల ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు చిన్నవారు ఉన్నారని సమాచారం. కుటుంబ నేపథ్యం తెలిసిన తరువాత అసుపత్రి వద్ద ఉన్న వారి కళ్ల చెమర్చాయి. మానవీయ కోనంలో బాధాకరమైన సంఘటనగా భావించారు. మృతుడి తమ్ముడు పాండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుజాతనగర్ ఎస్ఐ.రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండల పరిధిలోని తీగలంచ గ్రామం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం స్థానిక అంగన్వాడీ సూపర్వైజర్ కె.విజయకుమారి పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామములోని తల్లులకు చిరు ధాన్యాల ప్రాముఖ్యత గూర్చి వివరించారు. మనకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలా(పెరడు)ల్లో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చిరు ధాన్యాలు పండించి, తీసుకోవాలని వివరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్ బి.రవి, అంగన్వాడీ టీచర్లు, కె.రమణ, సీహెచ్.సుమలత, ఆశా వర్కర్, గ్రామస్తులు, పిల్లలు పాల్గొన్నారు..

మేకలు తప్పిపోయాయని బాధితుడు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని రాయిగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతు పూనెం సూరయ్య అనే రైతుకు సంబంధించిన 26 మేకలు ఇటీవల కాలంలో అడవిలో మేస్తున్న క్రమంలో తప్పిపోయినట్టు బాధితుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయిగూడెం సమీపంలోని అతడి మొక్కజొన్న చేను సమీపంలో అడవికి మేకలను 22 రోజుల క్రితం తీసుకుని వెళ్లానని చెప్పారు. ఈ నేపథ్యంలో చేను పక్కనే తాను ఓ చెట్టు కింద కునుకు తీసి, లేసే లోగా మేస్తున్న తన మేకలు కనిపించలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షలకు పైగా ఉంటుందని బాధిత రైతు వాపోతున్నారు.

పోలీస్ కుటుంబాలకు కంటి పరీక్షలు

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని అయిత ఫంక్షన్ హాల్‌లో సబ్ డివిజన్ పోలీసు ఆఫీసర్స్, సిబ్బందికి వారి ఫ్యామిలీస్‌కి కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కంటి పరీక్షలు మాక్స్ విజన్ ఖమ్మం వారు డాక్టర్ శరత్, నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మేజర్ ప్రాబ్లం ఉన్న వారికి ఖమ్మంలో ఉన్న శరత్ మాక్స్ విజన్ డాక్టర్ ఆధ్వర్యంలో ఆపరేషన్ చేయబడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పి, ఇల్లందు, గుండాల, టేకులపల్లి సిఐలు, సబ్ డివిజన్ ఎస్సైలు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మహాత్మా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలూరి భవన్ లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ పాల్గొన్నారు. జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచి అధ్యక్షులు సిరాజ్ అహ్మద్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, తాళ్లూరి పద్మ, వీర భద్రం, నాగమణి, వీరయ్య, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.



పట్టణ పరిశుభ్రతే లక్ష్యం కావాలి : కమిషనర్ శ్రీకాంత్

నవతెలంగాణ-ఇల్లందు

దోమలు, ఇతర కీటకాలు, వైరస్‌లు నిరోధించి ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి పట్టణ పరిశుభ్రతే లక్ష్యం కావాలని మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్ అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం పట్టణంలోని ఇందిరా నగర్, కాకతీయనగర్‌లోని గృహాలకు పొడి చెత్త సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిషనర్ మాట్లాడారు. పంపిణీ చేసిన సంచిలో ఇంటినుండి వచ్చే రోజు వారి పొడి చెత్తను వేయాలన్నారు. వారంలో రెండు రోజులు బుధ, శనివారం వార్డుకు వచ్చే మునిసిపల్ వాహనానికి ఇవ్వవలసినదిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ అంకుల్ షావలి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ లాలీయా, జవాన్లు, ఆర్పిలు, టియంసి, సీఓలు పాల్గొన్నారు.

పర్ణశాలలో వైభవంగా వసంతోత్సవం

చూసి తరించిన భక్తజనం

నవతెలంగాణ- దుమ్ముగూడెం



శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ సీతారామచంద్ర స్వామివారికి అత్యంత వైభవంగా వసంతోత్సవాన్ని అర్చక స్వాములు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి సేవ నిర్వహించారు. వసంతోత్సవం కార్యక్రమంలో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో స్వామివారిని చూసి తరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిత్యం నిర్వహించే హెూమం, పూర్ణాహుతి బలిహరణ, సాయంత్రం తిరువీధి సేవ కార్యక్రమాలను సాంప్రదాయానుసారంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలలో ఆలయ ఇన్చార్జి అనిల్ కుమార్, ముఖ్య అర్చకులు కారంపూడి కిరణ్ కుమార్, ఆచార్యులు ప్రతాపురం భార్గవాచార్యులు, వెంకటాచార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహాచార్యులు, పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి


నవతెలంగాణ-కొణిజర్ల

సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి సీనియర్ నాయకుడు కొప్పుల క్రిష్ణయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, మండల నాయకులు బోయినపల్లి శ్రీనివాస్ రావు, తాతా వెంకయ్య, షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

జ్యోతిరావు పూలే విగ్రహాన్ని శుభ్రం చేసిన సీపీఐ(ఎం) నాయకులు

మండల కేంద్రంలో రహదారి పక్కన జ్యోతిరావు పూలే విగ్రహం మట్టితో పేరుకపోవడంతో సీపీఐ(ఎం) నాయకులు తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి కుటుంబరావు, బోయినపల్లి శ్రీనివాస్ రావులు బకెట్ లతో నీళ్ల తెచ్చి షాంపులతో శుభ్రంగా కడిగారు. మహనీయుడైన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని నాయకులు శుభ్రం చేస్తున్న అటుఇటూ వెళుతున్న యువకులు చూస్తూ.వెళుతున్నారు తప్ప కనీసం నివాళులర్పించడానికి కూడా యువకులు ఆసక్తి చూపకపోవడం విస్మయానికి గురిచేసింది.

న్యాయవాది మృతికి బార్ అసోసియేషన్ తీవ్ర సంతాపం



నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖమ్మం పట్టణానికి చెందిన న్యాయవాది గురిజాల నాగేంద్ర అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. వారి మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గద్దల దిలీప్ కుమార్, కార్యవర్గం, ఐలు, ఐఏఎల్, టీడీపీ, బిఆర్ఎస్, కాంగ్రెస్ న్యాయవాద సంఘాలు వారికి, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

ఆశీల కాంట్రాక్టర్‌పై బ్లాక్‌మెయిల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక జేసీసీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం గ్రామపంచాయతీ ఆశీల కాంట్రాక్టర్ పూనెం కృష్ణ దొరపై కొంతమంది వ్యక్తులు బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరింపులకు, దౌర్జన్యాలకు పాల్పడడంపై ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక జేఏసీ భద్రాచలం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఆదివాసీ సీనియర్ నాయకులు పూనెం వీరభద్రం మాట్లాడుతూ ఆదివాసీ తెగకు చెందిన పూనెం కృష్ణ దొరకు ఆశీల కాంట్రాక్టు దక్కడంపై జీర్ణించుకోలేక వలస లంబాడీ కులానికి చెందిన భూక్య రంగ, భూక్య పండు, రాచమల్ల రాము, వారి అనుచరులు ఆశీల పనులు చేయనివ్వకుండా అడ్డుకుంటూ బ్లాక్ మెయిల్ చేస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చెయ్యడంలో భాగంగా భద్రాచలం గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ఐక్యవేదిక నాయకులు పూనెం వీరభద్రం, పాయం రవివర్మ పాల్గొన్నారు.

పేదోడి ఇంట్లో పెద్దోళ్ళు భోజనం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



సన్న బియ్యం మహిమతో పెద్దోళ్ళు అందరూ కలసి నేలపైన కూర్చొని ఓ పేదవాడి ఇంట్లో భోజనం చేయడంతో పలువురు వారిని ఎంతో ఆసక్తిగా చూశారు. సహజంగా ఓ పేదవాడు శాసన సభ్యుడిని కలవాలి అంటే ఎన్నో రోజులు పడుతుంది. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల్లో సన్న బియ్యం పేద ప్రజలకు ఇచ్చే కార్యక్రమం చేపట్టడంతో శుక్రవారం అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ రాజపురం గ్రామంలో మెండు నాగయ్య ఇంట్లో నేలపైన కూర్చొని భోజనం చేసి సన్న బియ్యం అన్నం ఎలా వుంటుందని వారిని అడిగి తెలుసుకుంటూ వారితో కలసి భోజనం చేశారు. అంతేకాకుండా తహశీల్దార్, ఎంపీడీఓ, కాంగ్రెస్ నాయకులు అంత వారితో కలసి భోజనం చేయడంతో ఆ కుటుంబం అంత హర్షం చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జారే ఆదినారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, దుబాకుల రాము, పర్స వెంకట్, వేముల నరేష్, గణపతి రెడ్డి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో దా'రుణాలు'

- ఖమ్మం సహకార బ్యాంక్ లోన్ లలో మాయాజాలం
- గిరిజనుల భూములను ష్యూరిటీగా పెట్టి రుణాలు
- విషయం తెలిసి గగ్గోలు పెడుతున్న బాధితులు
- ఖమ్మం డీసీసీబీ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన
- ఖమ్మం రూరల్ తహశీల్దారు కార్యాలయంలో వినతి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం డీసీసీబీ పరిధిలో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. రుణాల పేరుతో బురిడీ కొట్టించే ఘటనలు తలెత్తుతున్నాయి. తమవి కానీ ఆస్తులను తనఖా పెట్టి రుణాలు పొందుతున్న ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఇవేకాక నకిలీ బంగారంతో రుణాలు పొందిన సంఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే డీసీసీబీ రుణాలు పక్కదారి పట్టిన ఘటనలు అనేకం ఉన్నాయి. బ్యాంక్ ఉద్యోగుల సహకారంతోనే ఈ అక్రమ వ్యవహారాలు సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా గిరిజనులు తమకు తెలియకుండా తమ భూములను మార్టిగేజ్ చేసి డీసీసీబీ సిబ్బంది రుణాలు ఇచ్చారని శుక్రవారం బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు జరిగిన అన్యాయంపై ఖమ్మంరూరల్ తహశీల్దారు రాంప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.

బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బురిడీ...

ఖమ్మం రూరల్ మండలం కాచిరాజీగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ చావిడి రామారావు భూమి లేకున్నా నకిలీ పత్రాలు సృష్టించాడు. పత్రాలలో పేర్కొన్న భూమిని అక్రమంగా రికార్డులో ఎక్కించుకున్నాడు. అదే భూమిని చూపించి డీసీసీబీ నుంచి దాదాపు రూ. కోటికి పైగా రుణాలు తీసుకున్నాడు. దీనిపై బాధిత రైతులు శుక్రవారం డీసీసీబీ ప్రధాన కార్యలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం రూరల్ తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు.



అక్రమంగా సబ్సిడీ రుణాలు..

అక్రమంగా రుణాలు పొందడమే సాహసోపేతమైతే... అవి కూడా సబ్సిడీ లోన్ లు కావడం చర్చనీయాంశంగా మారింది. కాచిరాజుగూడెం సర్వే నెం. 267లో తమ స్వాధీనంలో ఉన్న భూమి పై నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించారని, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని బాధితులు ఆరోపించారు. వివిధ పేర్లతో ఇదే గ్రామానికి చెందిన చావిడి రామారావు, నాగమణి దంపతులు రూ.కోటికి పైగా రుణాలు తీసుకున్నారు. ఈ రుణాలు కూడా సబ్సిడీ లోన్ లు కావటం గమనార్హం. బ్యాంక్ లను మోసం చేసి తమ భూములను అక్రమంగా వారి పేరు మీద రికార్డు చేసుకున్నారని కస్నాతండాకు చెందిన గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు. గిరిజనులైన తమ భూములను ఆక్రమించుకోవడమే కాకుండా.. గూండాలను తీసుకువచ్చి తమను బెదిరిస్తున్నారని వాపోతున్నారు. తమ పేరుతో అక్రమంగా రుణాలు తీసుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రూరల్ తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఆమ్మర ఝాన్సీ, మంగమ్మ నిల, భాస్కర్, సేంద్య, ఆజ్మీరా కోట్య తదితరులు ఉన్నారు.

హైకోర్టు పరిధిలో వివాదం: రాంప్రసాద్, తహశీల్దారు

ప్రస్తుతం ఈ వివాదం హైకోర్టు పరిధిలో ఉంది. జరిగిన ఘటనను జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లాను. ఇప్పటికే దీనిపై సర్వే చేపట్టాం. రిపోర్టును హైకోర్టుకు సమర్పిస్తాము.

జాతీయ ఆహార భద్రతా పథకంలో వరి రైతుల అనుభవాలు

నవతెలంగాణ-వైరా

వైరా మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా రైతులకు అందజేసిన వరి విత్తనం కెఎన్ఎం 1638 రకం సాగు చేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాలను అధికారులు సందర్శించారు. కెఎన్ఎం 1638 రకం సాగు చేసిన రైతుల అనుభవాలను తెలియజేశారు. అష్టగుర్తి, ముసలిమడుగు గ్రామాలలో పై రకం వరి విత్తనం సాగుచేసిన వెంపటి వెంకటేశ్వరరావు, నర్వనేని గోపాలరావు తదితర రైతులు వరి సాగులో మెళకువలు, అనుభవాలను వివరించారు. కెఎన్ఎం 1638 వరి సన్నరకం అని, స్వల్ప కాలిక(120 రోజుల) పంట అని, అగ్గి తెగులు, ఉల్లి కోడ్ తట్టుకుంటుందని, మరియు దోమపోటును కూడా కొంతవరకు తట్టుకుంటుందని తెలిపారు. ఈ వరిలో ఎటువంటి చీడ పీడలు ఆశించలేదని, దుబ్బు బాగా కట్టి కంకులు కూడా బాగా వచ్చినట్లు తెలిపారు. ఎకరానికి 30, 35 బస్తాల దిగుబడి వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాధికారి డి.పుల్లయ్య, వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏడీఏ టెక్ వాసవిరాణి, ఏఓ టెక్ ప్రత్యూష, ఎస్.పవన్ కుమార్, వైరా ఏఓ మాయన్ మంజూఖాన్, మాజీ సర్పంచ్ ఇటికాల మురళీ, వైరా విశాల సహకార పరపతి సంఘం వైస్ చైర్మన్ కొనిదన కోటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, ఏఈఓలు వాసంతి, సైదులు, వెంకటనర్సయ్య రైతులు పాల్గొన్నారు.

110 సంవత్సరాల వృద్ధురాలు అనారోగ్యంతో మృతి

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరాలు, 110 సంవత్సరాల వృద్ధురాలు దాసరి అచ్చమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. దాసరి అచ్చమ్మ గ్రామంలో సిపిఎం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేది. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతదేహాన్ని పార్టీ మండల కమిటీ సభ్యురాలు గుడ్డురి ఉమ, లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, సిపిఎం శాఖా కార్యదర్శి గుడ్డురి వెంకట నరసయ్య, పార్టీ మాజీ శాఖ కార్యదర్శి పత్తి రాధాకృష్ణ, ఐద్వా నాయకురాలు కిలారు సత్యవతి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

సీతారామ నీళ్లు మండల రైతాంగానికి అందించాలి

- పంటలకు స్వామినాథన్ సిఫార్సు ప్రకారం
- గిట్టుబాటు ధర కల్పించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ

నవతెలంగాణ-ములకలపల్లి

సీతారామ ప్రాజెక్ట్ కాలువలో పారే నీళ్లు మండల రైతాంగానికి సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ సభ 89వ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని మాదారంలోని తెలంగాణ రైతు సంఘం జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ.. మండలంలోని మూకమామిడి చెరువు, కమలాపురం పెద్దయ్య చెరువు, జగన్నాధపురం, కొమ్ముగూడెం, వికేరామారం చెరువులకు సీతారామ ప్రాజెక్ట్ కాలువలో పారె సాగునీరు మండల కేంద్రంలోని వివిధ చెరువులు కుంటలను నింపి మండల



రైతాంగానికి అందించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల పంటలకు అనువైన నేలగా మండలం గుర్తింపు పొంది ఉందని, అన్ని రకాల పంటలకు సాగునీరు అందించేందుకు చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. మండల రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు కాలువ సాగునీరు అందించకపోతే మండల వ్యాప్తంగా రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, గోగ్గల ఆదినారాయణ, చనగాని వినోద్, అన్నవరపు సాయి, గణపతి సత్యం, ముదిగొండ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ మూడు నెలల ఏరియల్స్ ఇస్తానన్న మున్సిపల్ కమిషనర్

- ఐక్యత విజయంతో సాధించిన మున్సిపల్ కార్మికులు
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్

నవతెలంగాణ-మణుగూరు

మున్సిపాలిటీ కార్మికులు ఐదో రోజులుగా చేట్టిన సమ్మె శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐదు రోజుల నుండి సమ్మె నిర్వహిస్తూ ఏరియల్స్ పిఎఫ్, ఇతర సమస్యలపై కార్మికుల ఐక్యంగా పోరాటం చేపడం ఫలితంగానే సాధించుకున్నారని అన్నారు. ఏరియల్ మూడు నెలలు, పీఎఫ్ 15 లక్షల రూపాయలు ప్రమాదవ శాత్తు చనిపోతే మట్టి ఖర్చులు నిమిత్తం 20వేలు, చనిపోయిన ఇంట్లో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్లపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్మికులకు తెలియపరిచారని, ఆ కార్మికులు కమిషనర్‌కి ప్రత్యేకమైన అభినందనలు తెలియజేస్తూ సమ్మె విరమించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ



జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొడిశాల రాములు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు టీవీ ఎంవి. ప్రసాద్, మున్సిపల్ వర్కర్ నాయకులు పల్లపు నాగేశ్వరరావు, దుర్గయ్య, లక్ష్మీనారాయణ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

- సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం నివాళి

నవతెలంగాణ-కొణిజర్ల



ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన పల్లిపాడు గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గాజనబోయిన శేషయ్య(78) ఉదయాన్నే వాకింగ్ కోసం వెళ్లి తిరిగి వస్తుండగా వైరా మండల దాచాపురం గ్రామానికి చెందిన వెల్పుల వెంకటేశ్వరరావు వైరా నుంచి కొణిజర్ల వెళుతుండగా పల్లిపాడు వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ బలంగా ఢీకొనడంతో తలకు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వాహనదారుడైన వెంకటేశ్వరరావుకి సైతం స్వల్ప గాయాలయ్యాయి.

శేషయ్య మృతదేహానికి సీపీఐ(ఎం) నాయకులు నివాళి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పల్లిపాడు గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయుకులు గాజనబోయిన శేషయ్య మృతదేహానికి పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి, భూక్యా వీరభద్రం, టౌన్ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్‌లు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరజీవి శేషయ్య చిన్నతనంలోనే పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితుడై పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణ, నిబద్ధతతో నీతి నిజాయితీ కలిగిన నాయకుడిగా ఎదిగారు. లాలాపురం సొసైటీ డైరెక్టర్‌గా, దిద్దుపూడి చాపల సొసైటీ అధ్యక్షులుగా సమర్థవంతంగా పనిచేశారని గుర్తు చేశారు. పార్టీ అనుబంధ ప్రజా సంఘం ప్రజా నాట్య మండలిలో పనిచేసారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘంలో కూలి రేట్లు పెంపు కోసం పోరాటం, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను హరికథలు, బుర్రకథలు రూపంలో ప్రసారం చేసారని కొనియాడారు. శేషయ్యను ప్రభుత్వం కళాకారునిగా గుర్తించినప్పటికీ



సీపీఐ(ఎం) సిద్ధాంతాలకు లోబడి మాత్రమే ప్రభుత్వ కళారూపాల్లో పాల్గొని ఆదర్శంగా నిలిచిరన్నారు. తన చివరి శ్వాస వరకు ఎర్రజెండా వీడలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైరా పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల మోహన్ రావు, అనుమోలు రామారావు, పార్టీ పల్లిపాడు, లాలాపురం గ్రామ శాఖల కార్యదర్శులు దామా వెంకటేశ్వర్లు, సంక్రాంతి పురుషోత్తమ రావు, మాజీ సర్పంచ్ సంక్రాంతి చంద్రశేఖర్, తాటిపల్లి వీరభద్రం, సంక్రాంతి నరసింహారావు, మల్లం బాబు, మండవ బ్రహ్మేశ్వరరావు, గుడారి నాగేశ్వరరావు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, తదితరులు శేషయ్య కి నివాళులర్పించారు.



సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు అఫ్జల్‌కు పరామర్శ

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నాయకుడు అఫ్జల్‌ను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వర రావు, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యం పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి అఫ్జల్‌కు తగిన మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రయత్నం చేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా వుండాలని, అఫ్జల్ త్వరలోనే కోలు కుంటారని తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జబ్బర్, వన్ టౌన్ కార్యదర్శి నాగులు మీరా తదితరులు ఉన్నారు.



విద్యుత్ శాఖ పొలం బాట కార్యక్రమం

- నూతన స్తంభాలు ఏర్పాటు

నవతెలంగాణ- ఎర్రుపాలెం

మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామం నందు విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను అధిగమించేందుకు నూతన 25 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫారాన్ని వైరా డివిజన్ డిఈ బండి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రైతులకు విద్యుత్ వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేస్తూ పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఎర్రుపాలెం సెక్షన్ పరిధిలో మీనవోలు గ్రామంలో విద్యుత్ స్తంభాలు దగ్గరగా లేకపోవడంతో విద్యుత్ సౌకర్యం అందని పేద కుటుంబాలకు చేరువలో నూతన విద్యుత్ స్తంభాలను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మధిర ఏడీఈ ఎం అనురాధ, ఏఈ జి.అనుష, విద్యుత్ శాఖ సిబ్బంది పుల్లయ్య నారాయణరెడ్డి, వెంకట్, నాయకులు పాండురంగారావు, తిరుమలరావు, రామకష్ణ, వేమిరెడ్డి అనురాధ, జానీ పాషా, సందీప్‌రెడ్డి, జమలయ్య తదితరలు పాల్గొన్నారు.

దోమలతో ఇబ్బందులు పడుతున్న మున్సిపాలిటీ ప్రజలు

- ఇంటింటి సర్వేలో ప్రజల గోడు

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీలో సైడ్ కాలువలు సరిగా లేకపోవడంతో ఇంటి చుట్టూ పక్కల మురుగునీరు నిలవడంతో దోమలు పెరుగుతున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు అన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీనగర్‌లో నివసిస్తున్నటువంటి పేదలకు కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు పథకాలలో ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు కావడం లేదని అన్నారు. సింగరేణి నుంచి వచ్చే దుమ్ము ధూళి, గ్రామాలలో అశుభ్రతతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. సైడ్ కాలవలు లేక దోమలు వద్ధి చెందుతున్నాయని అన్నారు. చుట్టుపక్కల ఉన్న చెట్లని శుభ్రం చేయాలని అన్నారు. అత్యధికమైన పేదలుగా గాంధీనగర్ వాసులు నివసిస్తున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పల్లపు నాగేశ్వరరావు, గాంధీనగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పని చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్

నవతెలంగాణ-మణుగూరు

సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్ అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 158వ జయంతిని మండల కమిటీ ఆధ్వర్యంలో శ్రామిక భవనంలో నిర్వహించారు. అంటరానితనం, కుల నిర్మూలన, సామాజిక సేవలు, అందరికీ చదువు, అణిచివేతకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు నిర్వహించి ఈ దేశానికి సేవ చేశారని మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు సావిత్రిబాయి పూలే చదువు అందరికీ అందాలని మహిళలకు చదువు నేర్పిన ఘనత ఆమోదన్నారు. ఆ రోజులలో ఎన్నో అవమానాలు ఎదుర్కొని సమాజ సేవ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొడిశాల రాములు, జిల్లా నాయకులు సత్ర పల్లి సాంబశివరావు, పల్లపు నాగేశ్వరరావు, టీవీఎం ప్రసాద్ దుర్గయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త, కుల వ్యతిరేక సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సేవాదళ్ కో ఆర్డినేటర్ చోటా బాబా, టీపిసిసి సభ్యులు జిల్లా ఓబిసి సెల్ అధ్యక్షులు, కామేపల్లి పిఏసిఎస్ చైర్మెన్ పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్, షేక్ రషీద్ కార్పొరేటర్లు రాపర్తి శరత్, లకావత్ సైదులు నాయక్, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, గజ్జి సూర్యనారాయణ నగర అనుబంధ సంఘ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ పాల్గొన్నారు.



రైతులు అధైర్యపడొద్దు

- సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం
- పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఆర్థిక సాయం అందజేస్తాం : మంత్రులు తుమ్మల, పొన్నం, శ్రీధర్‌బాబు
- సిద్దిపేట జిల్లా చిన్న కోదూరులో నష్టపోయిన పంటల పరిశీలన

నవతెలంగాణ-చిన్నకోదూరు

పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, నష్టపోయిన పంట వివరాలను సేకరించి ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తెలిపారు. సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామంలో గురువారం ఉదయం కురిసిన వడగండ్ల వానలకు నష్టపోయిన పంటలను జిల్లా కలెక్టర్ మనుచౌదరి, వ్యవసాయ అధికారులతో కలిసి మంత్రులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తం గా 24వేల ఎకరాలు పంట నష్టం జరిగిందని, అందులో సిద్దిపేట డివిజన్‌లో పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగిందని అన్నారు. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ప్రతి రైతును ఆదుకుంటామని భరోసా కల్పించారు. వ్యవసాయ అధికారులు రైతుల వెంటే ఉండి నష్టపోయిన వరి, మిర్చి, మామిడి పంటల వివరాలను సేకరించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు సర్వే నివేదికను అందించిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడుతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల, బడుగు బలహీన వర్గాలకు, రైతులకు సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ రాధిక, ఏడీఏ పద్మ, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

- కొనసాగుతున్న మట్టి తవ్వకాలు
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలోని ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నట్టు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలోని ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యల్లో కన్వేయర్ బెల్ట్ ద్వారా టన్నెల్ లోపలున్న మట్టిని బయటకు తరలిస్తున్నట్టు వివరించారు. సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. టీబీఎం భాగాలను కత్తిరించే పనులు, సిల్ట్‌ను బయటకు తరలించే పనులు, ఊట నీటిని బయటకు తరలించే పనులు వేగంగా జరుగుతున్నాయని, సహాయక బృందాలు నిర్విరామంగా టన్నెల్ లోపల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ విపత్తు నిర్వహణ విభాగం, రెస్క్యూ టీమ్‌లు, టన్నెల్ నిపుణుల సమన్వయంతో, అత్యాధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్టు వివరించారు. సమీక్షా సమావేశంలో ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే హైడ్రా అధికారులు సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య ర్యాట్ హెూల్ మైనర్స్ ప్రతినిధి, జేపీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

నవతెలంగాణ - మహమ్మదాబాద్


ఫైల్

ఉపాధి హామీ పనికి వెళ్లిన కూలీ వడదెబ్బతో మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ గ్రామంలో శుక్రవారం జరిగింది. తోటి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన మాల జయమ్మ(55) మూడు వారాలుగా ఉపాధి హామీ పనులకు వస్తుండేది. గురువారం నీరసంగా ఉందని తోటి కూలీలకు తెలిపింది.. అయినా రోజు లాగే గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వచ్చింది. ఉదయం పని ప్రదేశానికి వెళ్లి పని ప్రారంభించే క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

బాలోత్సవం సమ్మర్ క్యాంప్ వచ్చేసిందోచ్

- విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక విభాగాల్లో ఉచితంగా శిక్షణ
- క్లాసులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
- దరఖాస్తులకు తుది గడువు మే ఒకటో తేదీ
- వివరాలు వెల్లడించిన బాలోత్సవం నిర్వాహకులు

మే 5 నుంచి 22 వరకు ఎస్వీకేలో నిర్వహణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆటా, పాటా, సాంస్కృతిక, వైజ్ఞానిక దృక్పథం ద్వారా పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించే తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్ వచ్చేసింది. వచ్చే నెల ఐదో తేదీ నుంచి 22 వరకు జరుగనున్నది. శుక్రవారం ఎస్వీకేలో జరిగిన విలేకర్ల సమావేశంలో పిల్లలకు ఏయే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారనే అంశాలపైనా, విధివిధానాలపైనా వివరాలను తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్. సోమయ్య, ఉపాధ్యక్షులు సుజావతి, సంయుక్త కార్యదర్శి రూపారుక్మిణి, కమిటీ సభ్యులు బ్రహ్మణి వెల్లడించారు. సమ్మర్ క్యాంపు ద్వారా పిల్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందిస్తామనీ, విజ్ఞానం, వినోదం, వైజ్ఞానిక దృక్పథం ద్వారా పిల్లల్లో యూనిటీ పెంచడం వంటివాటిపై దృష్టి సారిస్తామని చెప్పారు. చిన్నచిన్న పదాల ద్వారా ఇంగ్లీష్, తెలుగు భాషల్లో పిల్లలు అనర్గళంగా మాట్లాడేలా తర్ఫీదు ఇస్తామన్నారు. సెల్‌ఫోన్‌లలో రీల్స్, గేమ్స్‌కు అలవాటు పడటంతో పిల్లలు మానసిక రుగ్మతలకు గురికావడం తీవ్రమవుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దీని ద్వారా పిల్లల్లో సృజనాత్మకత దెబ్బతింటున్నదనీ, పిల్లల మానసిక ఎదుగుదలపైనా ప్రభావం చూపి దురలవాట్ల వైపు మరలుతున్నారని వాపోయారు. ఎదిగే పిల్లలు ఇలా తయారవ్వటం సమాజాభివృద్ధికి శ్రేయస్కరం కాదన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జంక్‌ఫుడ్, బయటి పదార్థాలు తినడం, నిరంతరాయంగా సెల్‌ఫోన్ చూడటం వల్ల జరిగే అనర్థాల గురించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో చెప్పి ఆ అలవాట్లను పిల్లలతో వీలైనంత మేరకు మాన్పించి వారు ఆరోగ్యంగా ఉండేలా చూడటం కూడా శిక్షణలో భాగమని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థల మాదిరిగా సమ్మర్ క్యాంపులు పెట్టి నెలకు ఐదారు వేల రూపాయలు వసూలు చేయడం, పిల్లలను బట్టీ చదువులకు పరిమితం చేయడం తమ విధానం కాదని స్పష్టం చేశారు. పిల్లల్లో సాంస్కృతిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథాలను పెంపొందించడం తమ సమ్మర్ క్యాంపు ఉద్దేశమని నొక్కి చెప్పారు. తాము ఫీజు వసూలు చేయబోవట్లేదన్నారు. మూడేండ్ల నుంచి ఉచితంగా నిర్వహించిన సమ్మర్ క్యాంపుల ద్వారా తమ పిల్లల ప్రవర్తనలో ఎంతో మార్పు వచ్చిందని తల్లిదండ్రులు వచ్చి చెప్పడం, అభినందించడం తమకు సంతోషం కలిగిస్తున్నదన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు.

ఆక్టివిటీస్ : డ్రాయింగ్, క్లాసికల్ డ్యాన్స్, క్రాఫ్ట్, స్టోరీ టెల్లింగ్, ఇండోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్, వైజ్ఞానిక అవగాహన క్లాసులు

అర్హులు : మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు

దరఖాస్తు తుదిగడువు : మే 1

రిజిస్ట్రేషన్ ఫీజు : రూ.100

క్లాసులు : మే 5 వతేదీన ప్రారంభం...మే 22న ముగింపు సభ


సమయం : ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ప్లేస్ : సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి

సంప్రదించాల్సిన నెంబర్లు : 94900 94676, 94900 98343

మెయిల్ ఐడీ : telanganabalotsav@gmail.com

'చెత్తకుప్పకు' ధారావి నివాసితులు



(మొదటిపేజీ తరువాయి)

గృహాలు, సౌకర్యాలతో ఆధునిక పట్టణ కేంద్రంగా మార్చటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నది. అక్కడ నివసించేవారికి ఇన్-సిటు, ఎక్స్-సిటు పునరావాసం కల్పించాలని ఇది ప్రతిపాదిస్తుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్వీఆర్ శ్రీనివాస్ ఈ ప్రాజెక్ట్ సీఈఓగా ఉన్నారు.

ఈ పునరాభివృద్ధి ధారావి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ప్రయివేట్ లిమిటెడ్ (డీఆర్‌పీపీఎల్)ను ప్రస్తుతం నవభారత్ మెగా డెవలపర్స్ ప్రయివేట్ లిమిటెడ్ (ఎన్ఎండీపీఎల్) అని పిలుస్తారు. ఇది ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ). దీనిలో అదానీ ప్రాపర్టీస్ ప్రయివేట్ లిమిటెడ్ (ఏపీపీఎల్) 80 శాతం ఈక్విటీని, రాష్ట్ర గృహనిర్మాణ శాఖకు చెందిన మురికివాడ పునరావాస అథారిటీ (ఎస్ఆర్ఏ) 20 శాతం వాటాను కలిగి ఉన్నది. ఎన్ఎండీపీఎల్ చైర్మెన్‌గా కూడా శ్రీనివాసే ఉన్నారు. కంపెనీల రిజిస్ట్రార్ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఎన్ఎండీపీఎల్ చెల్లించిన మూలధనం రూ.400 కోట్లు. బీఎంసీ కమిషనర్ భూషణ్ గగ్రాని కూడా ఈ ఎస్పీవీలో డైరెక్టర్‌గా ఉన్నారు. ఎన్ఎండీపీఎల్ బోర్డులో తొమ్మిది మంది డైరెక్టర్లు ఉన్నారు. వారిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ బోర్డులో డైరెక్టర్‌గా ఉన్న ప్రణవ్ అదానీ కూడా ఒకరు. మిగిలిన ఎనిమిది మంది కూడా అదానీ గ్రూపులోని వివిధ కంపెనీల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, డైరెక్టర్లు.

అర్హతలేని లబ్దిదారుల పేరుతో తరలింపు

ధారావి పునరావాస ప్రాజెక్టు నిర్మాణ పనులు ఈ ఏడాది ద్వితీయార్థం నాటికి ప్రారంభమవుతాయని శ్రీనివాస్ చెప్పారు. నివాసితులకు పునరావాసం కల్పించటానికి ఎన్ఎండీపీఎల్ ఏండేండ్ల గడువును కలిగి ఉన్నదని తెలిపారు. ధారావి ప్రాజెక్టు కింద లబ్దిదారులను రెండు వర్గాలుగా విభజించారు. ఇందులో ఒకరిని అర్హులుగా, మరొకరిని అనర్హులుగా వర్గీకరించారు. అర్హులు అంటే.. 2000, జనవరి 1 లేదా అంతకముందు గృహ నిర్మాణాలను కలిగి ఉన్నవారు. దాదాపు 1.5 లక్షల మంది 'అర్హులకు' ధారావిలోనే 'ఇన్ సిటు' పునరావాసం లభిస్తుంది. ఇక అర్హతలేని లబ్దిదారుల్లో దాదాపు 50వేల నుంచి 1 లక్ష మందికి డియోనార్ డంప్ వద్ద 'నామమాత్రపు' ధరలకు అద్దె యూనిట్లు అందుతాయని ప్రభుత్వం ప్రకటించింది. మిగిలినవారికి ప్రభుత్వం కుర్లా డెయిరీ, వాడాలా, కంజుర్‌మార్గ్, ములుంద్ మధ్య భూమిని కేటాయించింది. గతేడాది సెప్టెంబర్‌లో బీఎంసీ 311 ఎకరాల పెద్ద డియోనార్ ల్యాండ్‌ఫిల్‌లోని 124 ఎకరాలను పునరావాస ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. లబ్దిదారుల సర్వే పూర్తయిన తర్వాత ఈ భూమిని ఎన్ఎండీపీఎల్‌కు అప్పగిస్తామని గృహ నిర్మాణశాఖాధికారులు తెలిపారు. ఎన్ఎండీపీఎల్‌కు కేటాయించిన 124 ఎకరాల భూమిలో ప్రస్తుతం డంప్ వద్ద ఉన్న మొత్తం ఘన వ్యర్థాలలో 40 శాతం (దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నులు) ఉన్నాయి. ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్ట్ కోసం మాకు సుమారు 200-300 ఎకరాల భూమి అవసరం. దీంతో మేము డియోనార్ ప్రాంతాన్ని ఎంచుకున్నాం అని డీఆర్‌పీ సీఈఓ శ్రీనివాస్ అన్నారు.



కులం జులుం పై గళమెత్తిన మహనీయుడు పూలే

పూలే జయంతి వేడుకల్లో.. టీపీఎస్‌కే గౌరవ అధ్యక్షులు జి.రాములు, అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ - ముషీరాబాద్

కులం జులుంపై గళమెత్తిన మహనీయుడు జ్యోతిబా పూలే అని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే) గౌరవ అధ్యక్షులు జి. రాములు, అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా టీపీఎస్‌కే అధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్‌కే హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో వారు హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జి.రాములు మాట్లాడుతూ.. కులోన్మాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి, కర్మ సిద్ధాంతం కాదు.. బతుకు సిద్ధాంతం కావాలని, తలరాతలు కాదు.. బతుకు రాతలు మారాలని మార్చిన మహనీయుడు పూలే అని అన్నారు. ఆయన జ్ఞానమే నేడు మనకు పునాది అని తెలిపారు. దేశం అనే దేహానికి శూద్రులే ప్రాణం, రక్తనాళాలు అని ప్రకటించిన సామాజిక విప్లవ ప్రవక్త పూలే అని కొనియాడారు. బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని, రైతులు, ఇతర తక్కువ కులాల హక్కుల కోసం పోరాడారని చెప్పారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బాలికల విద్య కోసం పోరాడటమే కాకుండా అభాగ్యులైన పిల్లల కోసం అనాధ ఆశ్రమాన్ని ప్రారంభించిన మొదటి సంస్కర్తగా పూలేను విశ్వసిస్తారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని, అలాంటప్పుడే ఆయనకు ఘనమైన నివాళులర్పించిన వారవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నరేష్, కవి, రచయిత పొన్నం రాజయ్య, సీహెచ్ ఇందిర, వి.శారద, పి.సందీప్, యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.

మీకు ప్రాథమిక హక్కులుంటే..

న్యూఢిల్లీ : ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆలోచించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ ఆపుర్తి నిగమ్ (ఎన్ఏఎన్) కుంభకోణం కేసును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకబదిలీ చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. వ్యక్తుల కోసం ఉద్దేశించిన రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద రిట్ పిటిషన్‌ను మీరెలా దాఖలు చేస్తారంటూ ఈడీని జస్టిస్ అభయ్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 32వ అధికరణ రాజ్యాంగ పరిష్కారాల హక్కుకు హామీ కల్పిస్తుంది. తమ ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడినట్లైతే సుప్రీం కోర్టును పరిష్కారం కోరడానికి వ్యక్తులకు సాధికారత కల్పిస్తోంది. తమ హక్కుల అమలు కోసం నేరుగా సుప్రీంను ఆశ్రయించేందుకు వారిని అనుమతిస్తోంది. సుప్రీం బెంచ్ వ్యాఖ్యల నేపథ్యంలో ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు అనుమతి కోరారు. ఈడీకి కూడా ప్రాథమిక హక్కులు వున్నాయని వ్యాఖ్యానించారు. ఈడీకి ప్రాథమిక హక్కులు వుంటే అది ప్రజల ప్రాథమిక హక్కులు గురించి కూడా ఆలోచించాలని బెంచ్ వ్యాఖ్యానించింది. ఆ తర్వాత పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి రాజును కోర్టు అనుమతించింది. చత్తీస్‌గఢ్‌లోని కేసులో మాజీ ఐఏఎస్ అధికారి అనీల్ తుటేజ తనకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను దుర్వినియోగం చేశారని ఈడీ గతేడాది పేర్కొంది. చత్తీస్‌గఢ్‌లోని కొన్ని రాజ్యాంగ శక్తులు హైకోర్టున్యాయమూర్తితో టచ్‌లో వుంటూ మనీ లాండరింగ్ కేసులోని నిందితులకు న్యాయపరమైన ఉపశమన కలిగేలా చూస్తున్నారంటూ ఈడీ ఇటీవల దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది. ఈనేపథ్యంలో ఆ కేసును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలని కోరింది.

మద్దతు ధర లేక ధాన్యానికి నిప్పు

కౌలుకు తీసుకున్న ఐదెకరాలు... ఆరునెలల శ్రమ బూడిద

- బస్తాకు రూ.1600 మాత్రమే ధర పలకడంపై ఓ రైతు ఆవేదన
- ధరల విషయంలో ఖరీదు దారులు, కమీషన్ దారుల మాయాజాలం
- మార్కెట్ అధికారుల మౌన సమ్మతితో దోపిడీ
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు



నవతెలంగాణ-సూర్యాపేట

కౌలుకు భూములు తీసుకుని ఆరునెలలు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం లేదనే నిస్సహాయతతో రైతులు ధాన్యానికి నిప్పంటించే స్థితికి చేరుతున్నారు. మార్కెట్‌లో నడిచే కుమ్మక్కు వ్యూహాలు, కమీషన్ దారులు, ఖరీదు దారులు, మార్కెట్ అధికారులు చేతులు కలిపి ధాన్యానికి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఈ వైనం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన రైతు బత్తుల లింగరాజు ధాన్యానికి తగిన ధర రాకపోవడంతో ధాన్యానికి నిప్పుపెట్టాడు. ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, ఆరు నెలల పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులున్నా, ఖర్చులు లెక్కచేయకుండా ధాన్యం పండించాడు. చివరికి మార్కెట్‌కు 70 బస్తాల ధాన్యాన్ని తీసుకురాగా, మద్దతు ధర రూ.2,320-2,300 ఉండగా ఒక్క బస్తాకు కేవలం రూ.1600 మాత్రమే ధర పలికింది. పెట్టుబడి కూడా రాని స్థితిలో ఆ రైతు ధాన్యానికి నిప్పంటించాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా ఎంతో కష్టపడి ఐదు ఎకరాలు కౌలుకు చేశానని, ధర ఎక్కువ వస్తుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కి ధాన్యం తీసుకొస్తే ఖరీదు దారులు, కమీషన్ దారులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు రోజులుగా అన్నం తినకుండా ధాన్యం రాశి వద్ద పడుకున్నానని బోరున విలపించాడు. కనీసం మద్దతు ధర కూడా రానీ ఈ ధాన్యం తనకు వద్దని నిప్పంటించినట్టు తెలిపాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ సిబ్బంది హుటాహుటిన వచ్చి రైతుతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని నిప్పంటుకున్న ధాన్యాన్ని ఆర్పారు. ఈ ఘటన వ్యవసాయ వ్యవస్థలో ఉన్న లోపాలను మరోసారి చాటి చెబుతోంది. ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ, అది మార్కెట్ స్థాయిలో అమలు కాకపోవడం దారుణం. మధ్యవర్తుల పాత్ర, అధికారుల నిర్లక్ష్యం వల్ల అసలు రైతుకే నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రైతుకు గిట్టుబాటు ధర కచ్చితంగా లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జాబ్‌మేళాలో తోపులాట

(మొదటిపేజీ తరువాయి)

వచ్చారు. దాంతో నిరుద్యోగులు ఒక్కసారిగా గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్లే క్రమంలో తోపులాట జరిగి పలువురు గాయపడ్డారు. అనంతరం మెగా జాబ్‌మేళాను మంత్రులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ మేళాకు 23,238 మంది నిరుద్యోగులు హాజరు కాగా 5,631 మందికి మంత్రి సురేఖ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు ధనసరి సీతక్క (అనసూయ), కొండా సురేఖ మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని, ఉద్యోగం చేస్తూనే పట్టుదలతో మరో ఉద్యోగావకాశం కోసం ప్రయత్నించాలని అన్నారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యను పారదోలడానికి ఇలాంటి జాబ్ మేళాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ జాబ్ మేళాకు ఊహించిన దాని కంటే భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరవడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. జాబ్‌మేళాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సొంత ఊరు దాటితేనే భవిష్యత్ బంగారం అవుతుందన్నారు. ఉద్యోగాలు పొందిన వారు అంకితభావంతో పనిచేయాలన్నారు. కేసీఆర్ 10 ఏండ్ల పాలనలో పదివేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక 60 వేల ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా మరిన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. ఇలాంటి జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని, అవకాశాలు వస్తే వాటిని వదులు కోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని నానాజీ వాకాడే, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబానీ, ఖుస్రు పాషా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలివ్వాలి : టీఎంఎస్టీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జనవరి నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు తెలిపారు. వారికి వెంటనే జీతాలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న 194 మోడల్ స్కూళ్లలో సుమారు 776 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని వివరించారు. వారంతా చిన్న ఉద్యోగులనీ, వారికిచ్చే వేతనం అతి తక్కువ అని తెలిపారు. మూడు నెలల నుంచి వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబ పోషణ కష్టమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ ఖర్చుల కోసం అప్పులు చేస్తున్నామంటూ ఆందోళన చెందుతున్నారని వివరించారు. వారి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రెగ్యులర్ టీచర్స్‌కు రావాల్సిన డీఏ బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తునికి పండ్ల తళుకులు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

- అడవి బిడ్డలకు వేసవి ఆదాయ వనరు
- పట్టణాల్లో ప్రకృతి ప్రసాదంగా కొనుగోళ్లు
- రసాయనాలు లేని పోషక విలువల పండు
- కిలో రూ.50 చొప్పున విక్రయం
- ఏడాదిలో నెలన్నర రోజులు మాత్రమే లభ్యం

తునికి ఆకే కాదు.. పండ్లు కూడా అడవి బిడ్డలకు ఆసరా అవుతున్నాయి. వేసవి ఉపాధి మార్గంగా.. ఆదాయ వనరులుగా ఆదుకుంటున్నాయి. మండు వేసవిలో ఆకుతో లబ్ధి పొందుతున్న గిరిజనులు.. నెల రోజులుగా ఈ పండ్లూ అమ్ముకొని జీవిస్తున్నారు. అడవిలో చెట్లపై పక్వానికి వచ్చిన కాయలను గడ్డిలో మాగబెట్టి పండ్లయ్యాక తీసుకొచ్చి పట్టణాల్లో విక్రయిస్తున్నారు. ఒక్కో గిరిజనుడు 20 నుంచి 30 కేజీల పండ్లను అమ్ముతున్నాడు. కొందరు రోడ్ల వెంబడి విక్రయిస్తు న్నారు. కిలో రూ.100 చొప్పున లభిస్తున్నాయి. రసాయనాలు వినియోగించని అత్యంత పోషక విలువలున్న శ్రేష్టమైన తునికి పండ్లను పట్టణవాసులు ఆదరిస్తూ కొంటున్నారు. రోజుకు ఒక్కో ఆదివాసీ గిరిజనుడు పది కేజీలకు పైగా విక్రయించి రూ.వెయ్యికి పైగా ఆదాయం పొందుతున్నాడు.

తునికి పండు ప్రత్యేకతలే వేరు

తునికి పండు విలువ తెలిసినవారు, రుచి చూసినవారు మళ్లీ మళ్లీ తినాలనుకుంటారు. చెప్పుకుంటూ పోతే ఈ పండు ప్రత్యేకతే వేరు. నెలన్నర రోజులు (మార్చి మూడోవారం నుంచి ఏప్రిల్ వరకు) మాత్రమే లభించే ఈ పండ్ల చెట్లను ఎవరూ పెంచరు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడమూ ఉండదు. అడవిలో మాత్రమే లభించే తునికి పండ్లను గిరిజనులు సేకరిస్తారు. అధిక పోషక విలువలు, ఫైబర్ కలిగిన తునికి పండ్లు పూర్తి ప్రకృతి ప్రసాదించిన వరమని, ఈ పండ్లు అమూల్యమని వైద్యులు చెబుతున్నారు. అడవిలో మాత్రమే ఉండే తునికి చెట్లకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయటం ఉండదు. పూర్తి సహజసిద్ధమైనవి. పండు పైభాగంలో గట్టిగా ఉంటుంది. పండిన తరువాత ఈ పైభాగాన్ని తేలికగా తీసేయొచ్చు. లోపల గుజ్జు, గింజలు ఉంటాయి. ఈ గుజ్జు రుచి అద్భుతంగా ఉంటుంది. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

తునికి పండ్లలో పోషకాలు..

తునికి పండ్లు (టెండూ పండ్లు) అడవుల్లో సహజంగా లభిస్తాయి. దీనిలో అనేక పోషక విలువలున్నాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిం చడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయని చెబుతుం టారు. డయాబెటిస్ ఉన్నవారికి సహాయ పడతాయి. పండ్లలో యాంటీఆక్సి డెంట్లు ఉండటం వల్ల క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇదీ జుట్టుకూ మేలు. జీర్ణక్రియకూ సహాయపడుతుంది. శరీరంలోని హానికరమైన టాక్సిన్లను తొలగిం చడంలోనూ ఈ పండు తోడ్పడుతుంది.

తునికి పండ్ల సేకరణ కష్టం


అనూష, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ ఆదివాసి గ్రామం. నేను నర్సింగ్ పూర్తి చేశాను. ప్రతి వేసవిలో తునికి పండ్ల సేకరణ చేపడుతాం. ఇది ఎంతో కష్టతరమైన ప్రక్రియ. ఎండలో అడవంతా తిరగాలి. రోజంతా ఎండలో కూర్చుని అమ్మితే రూ.500కు మించి రావడం లేదు.

అటవీ పరిసర పట్టణాల్లో ఎక్కువ విక్రయం

ప్రస్తుతం తునికి పండ్లు రాష్ట్రంలో అటవీ ప్రాంతం ఉన్న అన్ని నగరాల్లోనూ లభిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, చర్ల, కొత్తగూడెం, ఇల్లందు, ఖమ్మం జిల్లాలోని కారేపల్లి తదితర ప్రాంతాల్లోని ప్రధాన రోడ్డు మార్గాల్లో విరివిగా విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కువగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని అటవీప్రాంతాల్లో తునికి పండ్లు లభిస్తున్నాయి. ఈసారి వర్షాలు విస్తారంగా కురవటంతో పంట బాగా వచ్చిందని గిరిజనులు చెప్తున్నారు. కానీ దీన్ని సేకరించడం ఒకింత కష్టతరమేనంటున్నారు. తునికి కాయలను తీసుకొచ్చిన తర్వాత మాగబెట్టేందుకు రెండ్రోజులు పడుతుంది. ఆ తర్వాత బస్సులో తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. రోజంతా అమ్మితే రూ.500 వరకు ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. పురుషులు వీటిని సేకరిస్తే మహిళలు ఉచిత బస్సు సౌకర్యం నేపథ్యంలో ఎక్కువగా వీటిని విక్రయిస్తున్నారు.

భార్యా భర్తలకు సంబంధించిన విషయాల్లో ఇతరుల ప్రమేయం అవసరమా లేదా? ఒక వేళ ఉన్నా ఎంత వరకు ఉండాలో అంత వరకే ఉండాలి. అలా కాదు అని ప్రతి విషయంలో కలగజేసుకుంటే చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. దాంతో సమస్యలు మరింత ఎక్కువవుతాయి. వాళ్ళు కూడా తమ విషయాలు మరొకరితో చెప్పకునే ముందు వారికి ఎంత వరకు చెప్పాలో అంతే చెప్పాలి. అది కూడా ఒకటికి రెండు సార్లు ఆలోచించి పంచుకోవాలి. అలా కాకుండా అన్ని విషయాలు ఇతరులకు చెప్పకుంటే ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో ఉదాహరణే ఈ వారం ఐద్వా అదాలత్...



ఇతరుల జోక్యం అవసరమా..?

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

లతకు ఆకాష్‌తో పెండ్లి జరిగి పదేండ్లు అవుతుంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ పదేండ్లలో భార్యా భర్తల మధ్య బంధం ఎలాగుంది అంటే బాగానే ఉందని చెప్పలేము, అలాగని బాగోలేదని కూడా చెప్పలేము. ఎందుకంటే వాళ్ల సంతోషంగా ఉంటే ఇక్కడి వరకు వచ్చే వారు కాదు కదా! ఆకాశ్ తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని భార్యతో కాకుండా ఇతరులతో చెబుతుంటాడు. లతతో తనకు ఎలాంటి సమస్య వచ్చినా వాటి గురించి కూడా వేరే వాళ్లకు చెబుతుంటాడు. ఆ విషయాలన్నీ వాళ్ల వచ్చి లతకు చెబుతారు. వాళ్ల వచ్చి చెప్పే వరకు ఆకాష్‌కు ఏం కావాలో లతకు తెలిసేది కాదు. ఆ మూడో వ్యక్తి కుటుంబంలో ఒకరు అయితే పెద్దగా ఇబ్బందులు ఏమీ వుండేవి కావు. కానీ అలా కాకుండా అతను స్నేహితులతో మాట్లాడడం, వాళ్ల వచ్చి 'మీరు ఆకాష్‌ను సరిగ్గా చూసుకోవడం లేదు. పెండ్లి జరిగి పదేండ్లు అయినా ఇంకా మేము వచ్చి ఈ విషయాలు చెప్పడం ఏం బాగోలేదు. కానీ మాట్లాడక తప్పడం లేదు. మీలో మార్పు వస్తుందని ఆకాష్‌తోపాటు మేము కూడా ఎదురు చూస్తున్నాము. కానీ మీలో ఎలాంటి మార్పూ లేదు. పైగా మీ వల్ల ఆకాష్ రోజురోజుకు కుంగిపోతున్నాడు. అతనికి ఇక మీతో కలిసి ఉండటం ఇష్టం లేదు. విడిపోవాలని అనుకుంటున్నాడు. వారం పది రోజుల్లో నోటీసులు పంపిస్తా డంటా. అందుకే మేము ఈలోపు మీతో మాట్లాడాలని వచ్చాము. భార్యాభర్తలు విడిపోతుంటే భరించలేక మేము మీతో ఈ విషయాలన్నీ చెబుతున్నాం' అని చెప్పారు.

'అసలు సమస్య ఏంటీ? ఎందుకు అతను నా నుండి విడిపోవాలని అనుకుంటున్నారు' అనే విషయం నాకు తెలియాలి కదా! ఆకాష్ ఇంటికి వచ్చిన తర్వాత లత అడిగితే నోరు తెరిచి సమాధానం చెప్పడు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కాక ఆమె ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

> 'మీ ఇద్దరి మధ్య సమస్యకు కారణం మనసు విప్పి మాట్లాడుకోకపోవడం. మీరు కేవలం భార్యాభర్తలు మాత్రమే కాదు. తల్లిదండ్రులు కూడా. ఆ విషయం మర్చిపోతున్నారు. మీరిద్దరూ విడిపోతే పిల్లల పరిస్థితి ఏంటీ?

మేము విషయం తెలుసుకుందామని ఆకాష్‌కు ఫోన్ చేసి పిలిపిస్తే అతను చెప్పింది ఏంటంటే... 'లతకు ఒక్క పని కూడా సరిగ్గా రాదు. వంట చేయడానికి చాలా టైం తీసుకుంటుంది. ఈ విషయం మా అమ్మకు, అక్కకు చెబితే మెల్లిగా నేర్చుకుంటుందిలే అంటారు. అంతే కానీ ఆమెను గట్టిగా అస్సలు అడగరు. అమ్మ చాలా సార్లు లతకు ఇంటి పనిలో, వంట పనిలో సాయం చేస్తుంది. నేర్పించడానికి ప్రయత్నం చేసింది. ఇప్పుడు కాస్త పర్వాలేదు. ఇల్లు శుభ్రంగా పెట్టుకోదు. అందుకే ఒక పనమ్మాయిని పెట్టుకున్నాము. ఇక ఆమెకు వుండేది ఒక్క వంట పని మాత్రమే. అది కూడా సరిగ్గా చేయదు. ఆఫీస్ నుండి 7 గంటలకు ఇంటికి వస్తుంది. రాగానే పని మొదలుపెట్టదు. కొద్ది సేపు కూర్చొని టీ తాగి పిల్లల హోం వర్క్‌లో సాయం చేసి మెల్లిగా అప్పుడు వంట చేస్తుంది. పిల్లలు తిని 9 గంటలకు పడుకుంటారు. పిల్లలను ఎనిమిది గంటల కల్లా పడుకోబెట్టమని నేను ఎన్నో సార్లు చెప్పాను. అయినా నా మాట వింటే కదా! ఈ విషయాలే నా స్నేహితులతో పంచుకుంటాను. ఇద్దరం కలిసి ఎక్కడికైనా బయటకు వెళదామంటే రాదు. ఆఫీసుకు సెలవు, పిల్లలకు సెలవు ఉన్న రోజుల్లోనే వెళదామంటుంది. ఈ విషయమే అక్కతో చెప్పాను. ఆమె వచ్చి చెప్పినా వినదు. ఇంటి కోడలు ఇంటి ఆడపడుచు చెప్పిన మాట వినాలి కదా! అయినా మా అక్క నాకు కాకుండా ఆమెకే సపోర్ట్ చేస్తుంది. ఇంట్లో ఏ ఒక్కరూ నాకు సపోర్టు చేయరు. అమ్మా, అక్కా చివరకు పిల్లలు కూడా ఆమెకే సపోర్ట్. అందుకే నేను నా బాధలు నా స్నేహితులకు చెప్పుకుంటాను. లత మాత్రం నన్ను అర్థం చేసుకోవడం లేదు. అందుకే ఆమెక విడాకులిచ్చి నేను చెప్పినట్టు వినే ఆమెను పెండ్లి చేసుకుందామనుకుంటున్నాను' అన్నాడు.

దానికి లత 'ఆకాష్ నాతో అస్సలు ఏమీ మాట్లాడడు. మా అత్తయ్యనే ఇంట్లో వంట చేయడం గురించి, ఏదైనా పని గురించి నాతో మాట్లాడుతుంది. ఆకాష్ మాత్రం నాకు అది నచ్చలేదు, ఇదైతేనే ఇష్టం అని నాతో ఎప్పుడూ చెప్పలేదు. బయటకు ఎక్కడికైనా ట్రిప్ ప్లాన్ చేసేటప్పుడు ముందు నాకు చెబితే కదా ఆఫీస్‌లో లీవ్ తీసుకోడానికి. కానీ నాకు ముందు చెప్పడు. అలాంటప్పుడు నాకు సెలవులు ఎలా ఇస్తారు. ఇలా నాతో ఏమీ చెప్పకుండా అన్నీ తన స్నేహితులకు చెప్పుకుంటే నాకెలా అర్థమవుతుంది. పెండ్లయి పదేండ్లు అవుతుంది. ఇప్పటి వరకు ఆయన ఇష్టాఇష్టాలు కూడా నాకు తెలియదు. ఏ విషయం అయినా వాళ్లకు చెబుతాడు. చివరకు మా ఫిజికల్ లైఫ్ గురించి కూడా తన స్నేహితులతో పంచుకుంటున్నాడు. ఆ విషయంలో అయినా నా ఇష్టం గురించి అడగడు. అసలు ఆయనకు నేనొకదాన్ని ఇంట్లో ఉన్నాననే విషయమే తెలుసో లేదో నాకు అర్థం కావడం లేదు. ఇలా ఇబ్బందులు పడుతూ విడాకులు తీసుకోవల్సింది నేను కదా! కానీ ఆయన నా నుండి విడిపోతా అంటున్నాడు. ఈ విషయం కూడా తన స్నేహితులు చెబితేనే నాకు తెలిసింది. నేనంటే ఆయనకు చాలా చులక భావం. ఇలాంటి వ్యక్తితో ఉండటం చాలా కష్టం. అందుకే ఆయన అడిగినట్టు విడాకులు ఇచ్చి నా బతుకు నేను బతుకుతాను' అంది.

> విడిపోవడం అంటే అంత తేలియకైనా విషయం కాదు. మీరు కాస్త అర్థం చేసుకొని ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకుంటే కలిసి ఉండడంలో ఉండే ఆనందం ఏంటో మీకు తెలుసుకుంది

ఇద్దరి మాటలు విన్న తర్వాత కూర్చోబెట్టి 'మీ ఇద్దరి మధ్య సమస్యకు కారణం మనసు విప్పి మాట్లాడుకోకపోవడం. మీరు కేవలం భార్యాభర్తలు మాత్రమే కాదు. తల్లిదండ్రులు కూడా. ఆ విషయం మర్చిపోతున్నారు. మీరిద్దరూ విడిపోతే పిల్లల పరిస్థితి ఏంటీ? ఆకాష్ ముందు మీరు మీ భార్యతో ఎలాంటి సమస్య వచ్చినా ఆమెతోనే చెప్పండి. ఆమెకు చెప్పడం రాకపోతే మా దగ్గరకు రండి. అంతే కానీ స్నేహితులతోనో, మీ అక్కతోనే ఇక చెప్పకండి. దీని వల్ల మీ మధ్య సమస్యలు మరింత పెరుగుతాయి. నాలుగ్గోడల మధ్య ఉండాల్సిన విషయాలు బయటి ప్రపంచానికి తెలిసిపోతే మీకు సమాజంలో విలువ ఉండదు. మీ స్నేహితులకు చెబితే మీపై జాలి పడతారని మీరు అనుకుంటు న్నారు. కానీ అదే పనిగా మీ వ్యక్తిగత విషయాలు చెబితే మీరు వాళ్లకు చులకనైపోతారు. విడిపోవడం అంటే అంత తేలికైన విషయం కాదు. మీరు కాస్త అర్థం చేసుకొని ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకుంటే కలిసి ఉండడంలో ఉండే ఆనందం ఏంటో మీకు తెలుస్తుంది' అని చెప్పాము.

అలాగే లతతో 'మీ భర్త ఇష్టాయిష్టాలు తెలుసుకోవల్సిన బాధ్యత నీకు ఉంది. మీ అత్త గారిని, మీ ఆడపడుచును అడిగి ఆకాష్ ఇష్టాలేంటే తెలుసుకోవల్సిన అవసరం నీకు ఉంది. అప్పుడు అతనికి నచ్చింది చేసి పెట్టొచ్చు. అతను మీతో మాట్లాకపోతే మీరే మాట్లాడించే ప్రయత్నం చేయండి. పదేండ్ల నుండి కలిసి ఉంటున్నారు. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చారు. ఇద్దరూ ఆ మాత్రం మాట్లాడుకోకపోతే ఎలా? అనవసరంగా ఏవేవో ఊహించుకుని సంసారాన్ని చేతులారా పాడుచేసుకోవద్దు' అని సర్ది చెప్పి పంపించాము.

- వై వరలక్ష్మి, 9948794051

సమతుల్యంగా ఉండాలంటే..!

హార్మోన్ల అసమతుల్యత.. ప్రస్తుతం చాలామంది మహిళలు ఎదుర్కొంటోన్న సమస్య. దీని కారణంగా నెలసరి-ప్రత్యుత్పత్తి సమస్యలే కాదు.. జీర్ణ సంబంధిత సమస్యలు, బరువు పెరగడం, శక్తి కోల్పోవడం, మానసిక సమస్యలు, చర్మ సంబంధిత సమస్యలు.. వంటివి తలెత్తుతాయి. అయితే ఇన్ని అనారోగ్యాలకు కారణమయ్యే హార్మోన్లను తిరిగి సమతుల్యం చేసుకోవాలంటే.. ఆహారమే కాదు.. మనం అనుసరించే జీవనశైలి కూడా కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు.



ఎండ పొడ.. తగలాల్సిందే!

నిద్ర లేచీ లేవగానే చాలామంది చేసే పని.. మొబైల్ పట్టుకోవడం. దీనివల్ల శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు పెరుగుతాయంటున్నారు నిపుణులు. ఇది ఒత్తిడిని కలిగించే హార్మోన్. ఉదయాన్నే ఒత్తిడి దరిచేరితే.. ఇక ఆ రోజంతా చిరాగ్గానే గడపాల్సి వస్తుంది. కాబట్టి.. అటు ప్రశాంతంగా రోజును ప్రారంభిస్తూనే, ఇటు హార్మోన్ల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలంటే లేలేత ఎండలో ఓ అరగంట గడపమంటున్నారు నిపుణులు. ఇది జీవ గడియారాన్ని ప్రేరేపించి.. భౌతిక, మానసిక, ప్రవర్తన పరంగా మార్పులు తీసుకొస్తుంది. తద్వారా చక్కటి జీవనశైలిని పాటించే అవకాశం ఉంటుంది.. ఇక ఇదే ఎండలో చిన్నపాటి వ్యాయామాలు చేయడం, నడక.. వంటివి చేస్తే మరీ మంచిది.

చెప్పుల్లేకుండా.. కాసేపు!

అడుగు తీసి బయటపెట్టామంటే చెప్పులు వేసుకోవాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు చాలామంది. కానీ ఉదయాన్నే కాసేపు చెప్పుల్లేకుండా నడవడం వల్ల హార్మోన్ల ఆరోగ్యం మెరుగుపడుతుం దంటున్నారు నిపుణులు.

ఈ వ్యాయామాలు చేస్తున్నారా?

రోజంతా ఉత్సాహంగా ఉండడంలో ఉదయాన్నే చేసే వ్యాయామాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఈ ప్రక్రియ హార్మోన్ల సమతుల్యతనూ ప్రేరేపిస్తుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా బరువులెత్తడం, కార్డియో వ్యాయామాలు హార్మోన్ల స్థాయుల్ని క్రమబద్ధీకరిస్తాయి. ఇటు శారీరక ఫిట్‌నెస్, అటు హార్మోన్ల ఆరోగ్యాన్నీ మెరుగుపరచుకోవచ్చంటున్నారు.

సమానత్వం కోసం పోరాడిన తత్వవేత్త పూలే

(మొదటిపేజీ తరువాయి)

గొప్ప సంఘసంస్కర్తల్లో అగ్రగణ్యుడన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల విద్యకు కృషి చేసిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం చేసి, జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వానికి సూచించిన మహనీయుడు పూలేనన్నారు. అయితే దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, మతతత్వ పార్టీలు సామాన్యులకు విద్య, ఉపాధి దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తున్నాయని తెలిపారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నాయని విమర్శించారు. మతాన్ని రెచ్చగొడుతూ పిల్లలకు విద్యను దూరం చేయాలనే కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూలే ఆశయాలకు అనుగుణం గా సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, డీజీ నరసింహారావు, రమణ, సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల కన్నా కాసులే మిన్న

న్యూఢిల్లీ: రైళ్లలో సీనియర్ సిటీజన్లకు రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్లు వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. కోవిడ్ నేపథ్యంలో 2020 మార్చి 20 నుంచి సీనియర్ సిటీజన్లకు రాయితీని ఎత్తివేశారు. అప్పటి నుంచి సీనియర్ సిటీజన్ల క్యాటగిరీలో అంటే గత ఐదేండ్లలో రైల్వే శాఖకు అదనంగా రూ. 8,913 కోట్ల ఆదాయం వచ్చినట్టు తేలింది. సమాచార హక్కు చట్టం కింద సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ డేటా నుంచి ఈ సమాచారాన్ని సేకరించారు. రైల్వేశాఖకు చెందిన టికెట్లు, ప్రయాణికుల వివరాలను సీఆర్ఐఎస్ మెయింటైన్ చేస్తోంది.

కనికరంలేని మోడీ సర్కార్..

రైల్వే శాఖ ప్రతి ప్రయాణికుడిపై 46 శాతం రాయితీ ఇస్తోందని మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 2020, మార్చి 20 కన్నా ముందు.. రైల్వే టికెట్లపై 60 ఏండ్లు నిండిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40 శాతం రాయితీ, 58 ఏండ్లు దాటిన మహిళలకు 50 శాతం రాయితీ కల్పించేవారు. సీఆర్ఐఎస్ డేటా ప్రకారం మార్చి 20, 2020 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు 31.25 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు రైళ్లలో ప్రయాణించారు. రాయితీ ఎత్తివేయడంతో ఆ ప్రయాణికుల నుంచి రూ. 8913 కోట్ల ఆదాయం వచ్చినట్టు ఆర్టీఐ సమాచారం ద్వారా వెల్లడైంది. గత ఐదేండ్లలో 18.2 కోట్ల మంది పురుషులు, 13.06 కోట్ల మంది మహిళలు, 43 వేల మంది ట్రాన్స్‌జెండర్ ప్రయాణికులు సీనియర్ సిటిజన్ కోటాలో ప్రయాణించినట్టు తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ వేసిన పిటిషన్ ఆధారంగా ఈ సమాచారం బహిర్గతమైంది. పురుష ప్రయాణికుల ద్వారా 11,531 కోట్లు, మహిళా ప్రయాణికుల ద్వారా 8,599 కోట్లు, ట్రాన్స్‌జెండర్ల ద్వారా రూ.28 లక్షల ఆదాయం వచ్చింది. ఈ మొత్తం ఆదాయం రూ.29 వేల కోట్లు దాటింది. అయితే పురుషులకు చెందిన 40 శాతం, మహిళలకు చెందిన 50 శాతం రాయితీ తీస్తే ఆ మొత్తం అమౌంట్ నుంచి రూ.8913 కోట్లు సీనియర్ సిటిజన్ కోటా నుంచి వచ్చినట్టు అవుతుందని చంద్రశేఖర్ తెలిపారు.

ఆర్టీసీలో కండక్టర్ల కొరత

హైదరాబాద్ రీజియన్‌లో 265 మంది...

సికింద్రాబాద్ రీజియన్‌లో 258 మంది కొరత

డిప్యుటేషన్‌పై ఉన్నవాళ్లంతా రీజియన్లలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో కండక్టర్ల కొరత తీవ్రమైంది. మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కండక్టర్ల కొరత ఆర్టీసీని వేధిస్తుంది. హైదరాబాద్ రీజియన్‌లో 265 మంది, సికింద్రాబాద్ రీజియన్‌లో 258 మంది కండక్టర్ల కొరత ఉన్నట్టు ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. వేసవి సెలవుల దృష్ట్యా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో బస్‌భవన్ సహా ఇతర ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు అందరూ తమ సొంత రీజియన్లలో రిపోర్టు చేయాలని చీఫ్ పర్సనల్ మేనేజర్ శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. బస్‌భవన్, ఆర్టీసీ కాల్‌సెంటర్, హకీంపేట శిక్షణా కేంద్రంలో మొత్తం 67 మంది కండక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమ సొంత రీజియన్లలో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్

ఆర్‌ఆర్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి

ఎన్‌హెచ్‌ల భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఆర్‌ఆర్‌ఆర్, ఎన్‌హెచ్‌లపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

వచ్చే వందేండ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, ఆర్‌ఆర్‌ఆర్ పనుల పురోగతిపై ఐసీసీసీలో సీఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలనీ, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదిక తయారీని వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్‌ఏఐ) పంపించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీఎం ఆరాతీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయనీ, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించడం లేదని అధికారులు సీఎంకు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్న నేపథ్యంలో రైతులతో మాట్లాడి భూసేకరణ పూర్తి చేయాలని సీఎం తెలిపారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలనీ, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్‌ఆర్‌ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, చీఫ్ ఇంజినీర్లు తిరుమల, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

కంచ గచ్చిబౌలి భూముల స్కాంలో బీజేపీ ఎంపీ హస్తం

(మొదటిపేజీ తరువాయి)

భూమిగానే గుర్తించాలని 1996లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అలాంటి భూముల లెక్కలు తీయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇచ్చింది పాయింట్ ఫోర్ క్యానపీ ఉన్న భూమి కచ్చితంగా అటవీ భూమే. 1980 ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం అటవీ భూములను తాకట్టుపెట్టే లేదా అమ్మే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు" అని కేటీఆర్ అన్నారు. భూ స్కాంలో ఒక బీజేపీ ఎంపీ హస్తం ఉందని కేటీఆర్ విమర్శించారు. "ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రయివేట్ లిమిటెడ్ అనే బ్రోకర్ కంపెనీని తీసుకొచ్చి సదరు బీజేపీ ఎంపీ ఈ కాన్సెప్ట్‌ను చెప్పారు. ఎఫ్ఆర్‌బీఎంను బైపాస్ చేసి డబ్బులు తీసుకొస్తామని చెప్పి అందుకు కమిషన్ ఇవ్వాలని ఆ కంపెనీ కోరింది. సదరు కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.169 కోట్ల లంచం చెల్లించింది. ఆ తరువాత బీకన్ ట్రస్టీషిప్ అనే కంపెనీని ముందు పెట్టి మోసానికి పాల్పడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే రూ.75 కోట్లకు ఒక ఎకరం చొప్పున ఆ 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి బదలాయి స్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చింది. కానీ ఆ భూమిని ఏలియనైజేషన్ చేయలేదు. సేల్ డీడ్ చేయలేదు. మ్యూటేషన్ కూడా చేయలేదు. అంటే ప్రభుత్వానికి ఆ భూమిపై ఓనర్‌షిప్ రాలేదన్నట్టే. టీజీఐఐసీకీ ఆ భూములపై యాజమాన్య హక్కు లేదు. తనది కాని భూమిని బ్రోకర్ కంపెనీ మాట విని తాకట్టు పెట్టింది. ఎలాంటి వెరిఫికేషన్ చేయకుండా బ్యాంకు రూ.పదివేల కోట్ల డబ్బులు చెల్లించింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రకారం కంచ గచ్చిబౌలి ఏరియాలో గజం విలువ రూ.26,900 కోట్లు మాత్రమే. 400 ఎకరాలకు 5,239.84 కోట్లు మాత్రమే. కానీ రెవెన్యూ శాఖ మాత్రం ఆ భూమి విలువ రూ.30 వేల కోట్లు అని చెప్పుకుంది. ప్రభుత్వం, బ్రోకర్ సంస్థ, బ్యాంకు కుమ్మక్కై ఆ భూమికి లేని విలువను ఉన్నట్టుగా చూపించి రూ.10వేల కోట్ల లోన్ తీసుకున్నారు. రిజర్వ్ బ్యాంకును, బ్యాంకులను, దేశాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసింది. రూ. 75 కోట్లు ఎకరమని జూన్‌లో జీవో ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలల తర్వాత మళ్లీ ఇంకో సంస్థతో నవంబర్ 23న కొత్త వాల్యుయేషన్ తీసుకొచ్చి ఎకరం రూ. 52 కోట్లు మాత్రమే అని రిపోర్ట్ తయారు చేసింది. ఐదు నెలల కాలంలో రూ. 25 కోట్ల విలువ ఎందుకు తగ్గింది? ఆ తర్వాత బహిరంగ మార్కెట్లో రిలయబుల్ వ్యాల్యూ అసెస్మెంట్ అని ఎకరాకు రూ.41.6 కోట్లు మాత్రమే అని ప్రభుత్వం ప్రకటించింది. ఇలా 400 ఎకరాల భూమి విలువను రూ.30 వేల కోట్ల నుంచి రూ. 16,640 కోట్లకు ప్రభుత్వం కుదించింది. అదే బ్యాంకరు, అదే బ్రోకర్ని అడ్డం పెట్టుకొని ఆ భూములను తమ మనుషులకు అడ్డికి పావుసేరుకు అమ్మడానికి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నాడు" అని కేటీఆర్ ఆరోపించారు. ఈ స్కాంలో హస్తమున్న బీజేపీ ఎంపీ పేరును త్వరలోనే బయట పెడతామని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కోర్టుకు పోతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ తరపున ప్రధానమంత్రితో పాటు ఆర్థిక శాఖ మంత్రిని కలిసి అవినీతిపై ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు.

పూలే మార్గం అందరికి ఆచరణీయం

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏ. రాజశేఖర్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్‌కుమార్, రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్సీ)చైర్మెన్‌గా మరో రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ నియమితుల య్యారు. హెచ్‌ఆర్‌సీ సభ్యులుగా శివాడి ప్రవీణ, బి.కిషోర్‌లను ప్రభుత్వం నియమించింది. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మెన్, లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల ఐదున సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన సెలక్షన్ కమిటీ తాజాగా వీరి పేర్లను ఖరారు చేసింది.

జస్టిస్ ఏ.రాజశేఖర్‌రెడ్డి ప్రొఫైల్

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సిర్సనగండ్లలోని సాధారణ వ్యవసాయ కుటుంబంలో 1960, మే 4న జన్మించారు. తల్లిదండ్రులు జయప్రద, రామానుజరెడ్డి. హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీ నుంచి పట్టభద్రులైన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బంగారు పతకం పొందారు. 1985, ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. 2004లో కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా, 2005లో అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీస్ ట్యాక్స్‌కు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా పని చేశారు. 2013, ఏప్రిల్ 12న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన 2014లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022, ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు.

జస్టిస్ షమీమ్ అక్తర్ ప్రొఫైల్

నల్లగొండ జిల్లాలో 1961, జనవరి 1న రహీమున్నీసా బేగం, జాన్ మహమ్మద్‌కు షమీమ్ అక్తర్ జన్మించారు. నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదివారు. నాగ్‌పూర్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా నుంచి న్యాయపట్టా పొందారు. 1996లో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పీజీ కాలేజ్ ఆఫ్ లా నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 2006లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. 2002లో నల్లగొండ జిల్లా, సెషన్స్ జడ్జిగా, తర్వాత పలు కోర్టుల్లో పనిచేశారు. హైకోర్టులో రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా పనిచేశారు. 2017లో హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2022 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు.

భారత్ నుంచి వంద మంది

న్యూఢిల్లీ : ఇజ్రాయెల్ స్పైవేర్ పెగాసస్ అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. భారత్‌తో పాటు పలు దేశాల్లోని పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖులను పెగాసస్ లక్ష్యంగా చేసుకున్నదని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ స్పైవేర్ వినియోగంతో పలువురు ఫోన్లు హ్యాక్ అయ్యాయని, వారిపై 'అనధికారిక' నిఘా జరిగిందని ఆందోళనలు వెలువడ్డాయి. దీనిపై పెగాసస్‌ను తయారు చేసే ఇజ్రాయెల్ ఎన్ఎస్ఓ గ్రూపు టెక్నాలజీస్, 'మెటా'కు చెందిన వాట్సప్ మధ్య అమెరికా న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతోంది. యూఎస్ కోర్టులో కొత్త చట్టపరమైన దాఖలును ఉటంకిస్తూ 'మీడియానామా' ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ సమాచారం ప్రకారం.. 2019 వాట్సప్ హ్యాకింగ్ ప్రచారంలో ఇజ్రాయెల్ స్పైవేర్ పెగాసస్ ఉపయోగించి లక్ష్యంగా చేసుకున్న 1223 మందిలో వంద మంది భారత్‌లో ఉన్నారు. ఏప్రిల్ 2019 నుంచి మే 2019 మధ్య రెండు వారాల వ్యవధిలో 1400 మంది వాట్సప్ వినియోగదారులపై ఎన్ఎస్ఓ గ్రూపునకు చెందిన స్పైవేర్ ఉపయోగించబడిందని 'వాట్సప్' ఆరోపించింది. 2019లో తన స్పైవేర్ పెగాసస్‌ను ఉపయోగించి.. 1400 వాట్సప్ ఖాతాలపై అనధికార నిఘాకు ఎన్ఎస్ఓ గ్రూపు బాధ్యత వహిస్తుందని గతంలో యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పునిచ్చింది. ఎన్ఎస్ఓ గ్రూపు వాట్సప్‌నకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని ప్రత్యేక విచారణలో నిర్ణయిస్తారని సమాచారం. పైన తెలిపినట్టు రెండు వారాల వ్యవధిలో పెగాసస్ ఉపయోగించి లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల సంఖ్యను దేశాలవారీగా వాట్సప్ జాబితా చేసింది. పెగాసస్ బాధిత వాట్సప్ వినియోగదారులు ప్రపంచవ్యాప్తంగా 51 దేశాలలో ఉన్నారు. ఈ జాబితాల్లో మెక్సికో ముందున్నది. 456 మందిని ఎన్ఎస్ఓ పెగాసస్ టార్గెట్‌గా చేసుకున్నది. ఇక తర్వాతి స్థానంలో భారత్ ఉన్నది. ఈ టార్గెట్‌లో భారత్ నుంచి వంద మంది ఉన్నారు. భారత్ తర్వాత.. బహ్రెయిన్ (82), మొరాకో (69), పాకిస్థాన్ (58), ఇండోనేషియా (54)లు ఉన్నాయి. ఇక టర్కీ నుంచి 26 మంది, స్పెయిన్ నుంచి 21 మంది, ఫ్రాన్స్ నుంచి ఏడుగురిని ఈ స్పైవేర్ ద్వారా టార్గెట్ చేశారు. అయితే, 2019 వాట్సప్ హ్యాకింగ్ ప్రచారంలో లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల వివరాలు మాత్రం అస్పష్టంగా ఉన్నాయి. అయితే, మెటా వాదనలను ఎన్ఎస్ఓ తోసిపుచ్చినట్టు ఇజ్రాయెల్ వార్త సంస్థ ఒకటి వివరించింది. 2021 జులైలో 17 మీడియా సంస్థల బృందం, మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ జరిపిన దర్యాప్తులో.. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులపై అనధికారిక నిఘా కోసం పెగాసస్‌ను ఉపయోగిస్తున్నట్టు తేలింది. భారత్‌లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ వంటి వారు టార్గెట్ జాబితాలో ఉన్నట్టు ఇప్పటికే వెల్లడైన విషయం విదితమే. ఈ ఆరోపణలను భారత ప్రభుత్వం ఖండించింది. భారత్‌లో అక్రమ నిఘా సాధ్యం కాదని అప్పటి కేంద్ర సమాచార సాంకేతిక మంత్రి వైష్ణవ్ 2021 జులైలో పార్లమెంటులో తెలిపారు. అయితే, ఆరోపణలపై సుప్రీంకోర్టు ఒక నిపుణుల కమిటీని ఏర్పర్చింది. 2022 ఆగస్టులో ఈ ప్యానెల్.. 29 ఫోన్లకు గానూ ఐదింటిలో మాల్వేర్‌ను గుర్తించిందని కోర్టు వివరించింది. అయితే, విచారణకు కేంద్రంలోని మోడీ సర్కారు సహకరించలేదని ప్యానెల్ కనుగొన్న విషయాన్ని కూడా న్యాయస్థానం గమనించింది.

మూసీ పునరుజ్జీవ పనులు వేగవంతం చేయండి



సీఎం రేవంత్ ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బాపూఘాట్‌లో నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్‌తోపాటు మీరాలం ట్యాంక్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సీఎం పరిశీలించారు. మీరాలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని చెప్పారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మూసీ పునరుజ్జీవంపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కె. శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌తోపాటు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. మీరాలం ట్యాంక్‌పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. 2.5 కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలనీ, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితోపాటు మీరాలం ట్యాంక్ వద్ద వివిధ చోట్ల ఐలాండ్‌లా ఉన్న మూడు ప్రాంతాలు పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

సింగపూర్‌లోని గార్డెన్స్‌ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివద్ధి చేయాలని సీఎం సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలు ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వెంచర్ పార్క్, థీమ్ పార్క్, హంపీ థియేటర్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్‌తోపాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్టులు, హోటళ్లు అందుబాటులో ఉండాలని సూచించారు. ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్‌ను అభివద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పారు. పీపీపీ మోడల్‌లో ఈ ఐలాండ్ జోన్‌ను అభివద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

మీరాలం ట్యాంక్‌లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీతో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలనీ, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని సీఎం సూచించారు.

మీరాలం బ్రిడ్జితోపాటు ఈ ఐలాండ్ జోన్‌ను పక్కనే ఉన్న జూపార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇక్కడి డెవలప్‌మెంట్ ప్లాన్‌ను దష్టిలో పెట్టుకొని జూపార్కును అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్నీ అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా అభివద్ధి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ట్రిబుల్ ఆర్ పనులను వేగవంతం చేయాలి : అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న ఫ్యూచర్ సిటీ వరకు హైదరాబాద్ మెట్రో సేవలను విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో మెట్రో విస్తరణపై సీఎం సమీక్షించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ఈ సందర్భంగా సీఎం అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్టు అధికారులు సీఎంకు వివరించారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కి.మీమేర మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. దాదాపు 30వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్‌ఖాన్‌పేట్ వరకు పొడిగించాలని సూచించారు. అందుకవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలన్నారు. హెచ్ఎండీఏ, ఎఫ్ఎస్‌డీఏ (ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ) సంయుక్తంగా ఈ మెట్రో రూట్ విస్తరణ బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా మొత్తం 76.4 కి.మీ విస్తరణకు రూ.24,269 కోట్ల అంచనాలతో డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించిందని తెలిపారు. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసిందని గుర్తు చేశారు. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలనీ, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు పనులనూ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ సమీపంలోనే భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా డ్రైపోర్ట్ నిర్మాణానికి రూపకల్పన చేయాలని సూచించారు. హైదరాబాద్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై దృష్టి సారించాలని అధికారులకు సీఎం సూచించారు.

ఐదు మ్యాచులు, నాలుగు పరాజయాలు, ఓ గెలుపు. ఐపీఎల్18లో సన్‌రైజర్స్ కథ ఇది. భారీ అంచనాలతో సీజన్‌ను మొదలెట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పూర్తిగా నిరాశపరిచింది. బ్యాట్, బంతితో పాటు ఫీల్డింగ్‌లోనూ చెత్త గణాంకాలను నమోదు చేసింది. సీజన్లో రెండో విజయం కోసం ఎదురుచూస్తున్న సన్‌రైజర్స్ నేడు బలమైన పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది.

కథ మారుతుందా?

పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ ఢీ నేడు

విజయంపై కన్నేసిన ఆరెంజ్ ఆర్మీ

నవతెలంగాణ-హైదరాబాద్

సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై మరో కీలక సమరానికి సిద్ధమైంది. వరుస పరాజయాలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న పాట్ కమిన్స్ సేన.. కాస్త విరామం తర్వాత మళ్లీ గ్రౌండ్‌లోకి అడుగుపెడుతోంది. తొలి మ్యాచ్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో అదరగొట్టిన సన్‌రైజర్స్ ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచుల్లో తేలిపోయింది. జట్టులోని కీలక బ్యాటర్లు ఆత్మవిశ్వాసం కోల్పోయినట్టు కనిపిస్తుండగా.. నేడు ఉప్పల్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. మరోవైపు పంజాబ్ కింగ్స్ నాలుగు మ్యాచుల్లో మూడింట విజయాలు సాధించిన మంచి ఫామ్‌లో ఉంది. సన్‌రైజర్స్, పంజాబ్ కింగ్స్ మ్యాచ్ నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం.



బ్యాటర్లు మెరుస్తారా?

సన్‌రైజర్స్ సక్సెస్ ఫార్ములా టాప్ ఆర్డర్ బ్యాటింగ్ లైనప్‌పై ఆధారపడి ఉంది. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మలు పవర్‌ప్లేలో పవర్‌ఫుల్ స్కోరు సాధించటం కీలకం. కానీ ఈ సీజన్లో ట్రావిషేక్ జోడీ అంచనాలను అందుకోలేదు. హెడ్ ఒకట్రెండు ఇన్నింగ్స్‌ల్లో మెరిసినా, ఆ తర్వాత డీలా పడ్డాడు. ఇషాన్ కిషన్ తొలి మ్యాచ్‌లో శతకబాదిన తర్వాతి మ్యాచుల్లో దారుణంగా తేలిపోయాడు. టాప్–3 బ్యాటర్లు పవర్‌ప్లేలోనే నిష్క్రమించటం సన్‌రైజర్స్ పతనానికి దారితీస్తోంది. తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి ఈ సీజన్లో తడబాటుకు గురవుతున్నాడు. బ్యాట్‌తో, బంతితో ఏమాత్రం ఆకట్టుకోవటం లేదు. హెన్రిచ్ క్లాసెన్ ధనాధన్‌పై ఎటువంటి అనుమానం లేదు. 15 ఓవర్ల తర్వాత క్రీజులోకి వస్తేనే క్లాసెన్ ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూపించగలడు. కానీ వరుస వికెట్లతో క్లాసెన్ పవర్‌ప్లే ముగియగానే క్రీజులోకి అడుగుపెడుతున్నాడు. యువ ఆటగాడు అనికెత్ వర్మ నిలకడగా మంచి ఇన్నింగ్స్‌లు ఆడినా.. గత రెండు మ్యాచుల్లో తేలిపోయాడు. సొంతగడ్డపై నేడు బ్యాటర్లు సమిష్టిగా మెరిస్తే మరో భారీ స్కోరుపై కన్నేయవచ్చు. బౌలింగ్ విభాగంలో పాట్ కమిన్స్, మహ్మద్ షమి టైటాన్స్‌పై రాణించారు. మిడిల్ ఓవర్లలో సన్‌రైజర్స్ స్పిన్నర్లు సైతం మాయ చేయగలిగితే ఆరెంజ్ ఆర్మీకి నేడు ఎదురుండదు!.

పంజాబ్ కింగ్స్ శిబిరంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బిగ్ ఇన్నింగ్స్ కోసం ఎదురుచూస్తున్నాడు. ప్రియాన్ష్ ఆర్య, ప్రభసిమ్రన్ సింగ్, శశాంక్ సింగ్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కో జాన్సెన్, విజయ్‌కుమార్ వైశాక్‌లు కీలకం కానున్నారు. బ్యాట్‌తో, బంతితో సమిష్టిగా రాణిస్తూ అద్భుత విజయాలు సాధిస్తోన్న పంజాబ్ కింగ్స్ నేడు ఉప్పల్‌లోనూ అదే ఫార్ములాతో బరిలోకి దిగుతోంది.

పూజలు ఫలిస్తాయా?

సొంతగడ్డపై ఆడిన మూడు మ్యాచుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండింట పరాజయం చవిచూసింది. దీంతో ఆతిథ్య జట్టు విజయం సాధించేందుకు ఉప్పల్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ ముంగిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూరేటర్ చంద్రశేఖర్, గ్రౌండ్ సిబ్బంది నేడు మ్యాచ్‌కు ఉపయోగించే పిచ్‌పై పూజలు నిర్వహించారు. వరుస పరాజయాలు ఎదురైనా.. స్టేడియానికి అభిమానులు భారీ స్థాయిలో రావటం సన్‌రైజర్స్‌కు అతిపెద్ద అనుకూలత.

పోరాటం ముగిసింది

కపిల, తనీశ జోడీ ఓటమి

ఆసియా చాంపియన్‌షిప్స్



నింగ్‌బో (చైనా): 2025 ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో టీమ్ ఇండియా పోరాటానికి తెర పడింది. సింగిల్స్ విభాగాల్లో అగ్రశ్రేణి షట్లర్లు ఇదివరకే ఇంటిముఖం పట్టగా.. తాజాగా డబుల్స్ విభాగంలోనూ పతక వేటలో ఆశలు ఆవిరయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టో జోడీ వరుస గేముల్లో పరాజయం పాలైంది. ఐదో సీడ్ చైనా షట్లర్లు చున్ మన్, యింగ్ సుయెట్‌లు 22–20, 21–13తో 41 నిమిషాల్లోనే వరల్డ్ నం.18 భారత జోడీపై విజయం సాధించారు. తొలి గేమ్‌లో 8–0తో తిరుగులేని ముందంజ వేసిన కపిల, తనీశ జోడీ.. ఆధిక్యం నిలుపుకోలేదు. 10–10తో స్కోరు సమం చేసిన చైనా షట్లర్లు ద్వితీయార్థంలో 19–19తో గట్టి పోటీ ఇచ్చారు. టైబ్రేకర్‌లో తొలి గేమ్ సాధించిన చైనా జోడీ.. రెండో గేమ్‌ను అలవోకగా ఖాతాలో వేసుకున్నారు. 9–9 వరకు రెండో గేమ్ పోటీలో నిలిచిన తనీశ, కపిల జంట ఆ తర్వాత లయ తప్పింది. తనీశ క్రాస్టో, ధ్రువ్ కపిల ఓటమితో ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత పోరాటం ముగిసింది.

ఫీల్ గుడ్ సినిమా



రాజేంద్రప్రసాద్, నటి అర్చన కాంబినేషన్‌లో రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'షష్టి పూర్తి'.
పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
ఇళయరాజా ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. ఇందులో తొలిపాటను కీరవాణి రచించగా ఇటీవల విడుదల చేశారు. సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ విడుదల చేసిన ఈ పాటకు అద్భుతమైన రెస్పాన్స్ లభించింది. రెండో పాటను హీరో రవితేజ ఆవిష్కరించి, యూనిట్‌కి బెస్ట్ విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మా రాజేంద్రప్రసాద్ అన్నయ్య చేసిన ఈ సినిమా చూడండి.. డెఫినెట్‌గా బావుంటుంది. మంచి ఫీల్ గుడ్ సినిమా అవుతుందనిపిస్తోంది. దర్శక నిర్మాతలకు, ఆర్టిస్టులకు అందరికీ ఆల్ ది బెస్ట్' అని చెప్పారు. 'ఇరు కనులు కనులు కలిసి మురిసె మొదటి చూపులో...తొలి పిలుపు తగిలి మెరుపు మెరిసే మనసు నింగిలో..' అంటూ రెహమాన్ రాసిన ఈ పాటను ఎస్పీ చరణ్, విభావరి ఆలపించారు.
దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ, 'సినిమాలో చాలా అందమైన యుగళ గీతం ఇది. ఇళయరాజా బాణీ ఇవ్వగానే నాకు 'సాగర సంగమం'లో 'మౌనమేలనోయి 'పాటలాంటి గొప్ప పాట అవుతుందనే అనుభూతి కలిగింది. ఈ ట్యూన్‌కి రెహమాన్ మంచి సాహిత్యం సమకూర్చారు. ఇళయరాజా ఒక్క కరక్షన్ కూడా చెప్పకుండా ఓకే చెప్పేశారు. ఎస్పీ చరణ్, విభావరితో ఈ పాట పాడించారు. రాజమండ్రిలో ఈశ్వర్ నృత్య దర్శకత్వంలో హీరో, హీరోయిన్లు రూపేష్,ఆకాంక్ష సింగ్‌లపై ఈ పాటను చిత్రీకరించాం' అని అన్నారు.


మరిన్ని అవకాశాల కోసం..



నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, నిర్మాత హర్షిత్ రెడ్డి ఇటీవల ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ బృందంలో డిప్యూటీ కాన్సుల్ జనరల్ స్టీవెన్ కానోలీ, వైస్ కాన్సుల్ హారియట్ వైట్, స్టెఫీ చెరియన్ ఉన్నారు.
భారత్–ఆస్ట్రేలియాల మధ్య ముఖ్యంగా సినిమా, సాంస్కృతిక రంగాల్లో సంబం ధాలను ఎలా మరింత పటిష్టం చేసుకోవాలనే దానిపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.
ఇరు దేశాల మధ్య సినిమా సహ నిర్మాణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నటీనటులు, సాంకేతిక నిపుణుల టాలెంట్ ఎక్స్ఛేంజ్ వంటి పలు కీలక అంశాలపై మాట్లాడుకున్నారు. హైదరాబాద్ నగరంపైన, తెలుగు సినిమాపైన ఆస్ట్రేలియా ప్రతినిధులు ఎంతో ఆసక్తి, ఉత్సాహం చూపించారు. ఈ చర్చల ద్వారా ఇరు దేశాల సృజనాత్మక రంగాల మధ్య బంధం మరింత బలపడుతుందని, ఆస్ట్రేలియాలో తెలుగు సినిమాకు మరిన్ని మంచి అవకాశాలు వస్తాయని ఇరు పక్షాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

నవచిత్రం

వేసవి కానుకగా 'వీరమల్లు..' రిలీజ్



పవన్ కళ్యాణ్

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో ఆయన ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అగ్ని లాంటి ఆవేశం, న్యాయం చేయాలనే ఆలోచన ఉన్న యోధుడిగా.. మునుపెన్నడూ చూడని సరికొత్త అవతార్‌లో కనిపించనున్నారు. మొఘల్ రాజుల నుండి కోహినూర్ వజ్రాన్ని దొంగిలించడంతో పాటు, ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ఇది కేవలం కథ కాదు.. ఇది ఒక విప్లవం. న్యాయం కోసం యుద్ధం చేయనున్న వీరమల్లు. వేసవి కానుకగా మే 9వ తేదీన తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.
ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, ఎ.ఎం.జ్యోతి కృష్ణ దర్శకులు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా కీలక పాత్రలు పోషిస్తున్నారు.
నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఆ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సర్‌ప్రైజ్ చేస్తాయి



డి. మధు

తమన్నా ప్రధాన పాత్రధారణిగా నటించిన చిత్రం 'ఓదెల 2'. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి ఇది సీక్వెల్. సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి.మధు ఈ చిత్రాన్ని నిర్మించారు.
తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 17న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి.మధు మీడియాతో ముచ్చటించారు.

■ నేను సంపత్ నందికి తెలియకుండానే 'ఓదెల' ఫస్ట్ పార్ట్ చూశాను. సినిమా చూసి చాలా ఎక్సైట్ అయ్యాను. అనుకోకుండా ఆయనే 'ఓదెల2' కథని నాతో చెప్పారు. కంటెంట్ బాగా నచ్చి, ఈ ప్రాజెక్ట్ చేశాను. పైగా తనతో నాకు మంచి వేవ్ లెంత్ కుదిరింది. భవిష్యత్తులో ఆయనతో మరిన్ని ప్రాజెక్ట్స్ చేయాలని ఉంది.

■ ఇందులో నాగ సాధుగా తమన్నా అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఫస్ట్ లుక్‌తోనే ఆ క్యారెక్టర్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ కథ విషయంలో తమన్నా చాలా ఎగ్జైట్ అయ్యారు. చాలా హార్డ్ వర్క్ చేశారు. కరెక్ట్ టైంలో, కరెక్ట్ కథ ఆమె దగ్గరకు వెళ్లిందని నేను నమ్ముతున్నాను. ఈ సినిమా కథ లాజికల్‌గా ఉంటుంది. ప్రతి దానికి ఒక ఆధారంతోనే చూపించాం. ఇందులో చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. అవన్నీ కూడా ఆడియన్స్‌ని చాలా సర్‌ప్రైజ్ చేస్తాయి. అజినీస్ లోక్‌నాథ్ ఈ జోనర్‌కి పర్ఫెక్ట్ మ్యూజిక్ డైరెక్టర్. చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోరు చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అలాగే సినిమాటోగ్రాఫర్ సౌందర్ రాజన్ విజువల్స్‌తో మంచి ట్రీట్ ఇచ్చారు.

■ ఈ కథలో ప్రతి పాత్రకి ఇంపార్టెన్స్ ఉంటుంది. వశిష్ట క్యారెక్టర్ కూడా చాలా బాగుంటుంది. తమన్నా, వశిష్ట.. ఈ రెండు క్యారెక్టర్స్ మధ్య టగ్ ఆఫ్ వార్‌లా ఉంటుంది. అలాగే మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, హెబ్బా..ఈ పాత్రలన్నీ కూడా చాలా బాగుంటాయి. ప్రేక్షకులు పాత్రలతో లీనం అవుతారు. ఇందులో గ్రాఫిక్స్‌కి చాలా ఇంపార్టెన్స్ ఉంది. పంచభూతాల కాన్సెప్ట్‌ని గ్రాఫిక్స్‌లో చూపించాం. ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలి, ఒక మంచి సక్సెస్‌ని అందుకోవాలని ప్యాషన్‌తో ఎక్కడా రాజీపడకుండా నిర్మించాం.

అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో 'సోదరా'



ఆర్తి గుప్తా, సంపూర్ణేష్ బాబు

సంపూర్ణేష్ బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'సోదరా'. ఈ చిత్రంలో ఆయనతోపాటు సంజోష్ కూడా ముఖ్యపాత్రలో నటిస్తున్నాడు. ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి మోహన్ మేనంపల్లి దర్శకుడు.
చిత్రీకరణ పూర్తిచేసుకుని, నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం ఈనెల 25న వేసవి కానుకగా ప్రేక్షకులను ఎంటర్‌టైన్‌చేయడానికి థియేటర్స్‌ల్లో విడుదల కాబోతుంది.
ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ చిత్ర ట్రైలర్‌ను దర్శకుడు సాయి రాజేష్, నిర్మాత ఎస్‌కేఎన్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి విడుదల చేశారు.
ఈ సందర్భంగా సాయి రాజేష్ మాట్లాడుతూ, 'సంపూతో నేను సినిమా తీసి 13 ఏళ్లు అయ్యింది. 'హృదయ కాలేయం' సూపర్‌హిట్ తరువాత సంపూ నన్ను ఆర్థికంగా చాలా ఆదుకున్నాడు. తాను సంపాదించుకున్న డబ్బులో అందరికి సహాయం చేస్తుంటాడు. సంపూ నా దృష్టిలో స్టార్' అని అన్నారు.
'ఈ సినిమా పవన్‌కల్యాణ్ 'బ్రో' సినిమాలా ఘన విజయం సాధించాలని, అందరికి మంచి గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాను నేను థియేటర్‌లో ఒక షో బుక్ చేసుకుని మా ఫ్రెండ్స్ అందరికి చూపిస్తాను. ఇలాంటి చిన్న సినిమాలను నా వైపు నుంచి ప్రోత్సాహించాలనే బాధ్యత వల్ల ఈ నిర్ణయం తీసుకుంటున్నాను' అని ఎస్‌కేఎన్ అన్నారు. సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ, 'నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన సాయి రాజేష్ ఈ వేడుకకు రావడం హ్యాపీగా ఉంది. అప్‌డేట్ అయిన తమ్ముడు, అమాయకుడైన అన్న మధ్య జరిగే స్వచ్ఛమైన కథే ఈ సినిమా. ఇప్పటి వరకు ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కంటెంట్‌కు మంచి స్పందన వచ్చింది. నేను రియల్‌లైఫ్‌లో ఎలా ఉంటానో అలాంటి పాత్రని ఇందులో చేశాను. అందరూ ఈ సినిమాను ఆదరించి మాకు మంచి విజయం అందిస్తారని కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఈ వేడుకలో దర్శకుడు మోహన్ మైనంపల్లి, దర్శకుడు కృష్ణ చైతన్య, హీరో చైతన్య, దర్శకుడు నవీన్ మేడారం, డిఓపీ జాన్, ఎడిటర్ శివ,లిరిక్ రైటర్ పూర్ణాచారి, హీరోయిన్ ఆర్తి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ సంఘటనలతో స్ఫూర్తితో '23'



'మల్లేశం, 8 ఎ.ఎమ్, మెట్రో' చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్. నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొంది ఆయన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ '23'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. ఇటీవల విడుదల టీజర్ సెన్సేషనల్ రెస్పాన్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తాజాగా హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సినిమా నుంచి 'కోసీ కోయ్యంగానే' సాంగ్‌ని లాంచ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ పాటని రా అండ్ రస్టిక్ ఎనర్జీ ఉన్న పవర్‌ఫుల్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. ఈ సాంగ్‌కి వరంగల్ శంకర్ రాసిన సాహిత్యం ఉద్రూతలూగించేలా ఉంది. రేలా జాన్ సాంగ్ హై ఎనర్జీతో పాడటం మరింత ఆలరించింది. ఈ సాంగ్‌లో లీడ్ యాక్టర్స్ రస్టిక్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.
'రియల్ ఇన్సిడెంట్స్‌ని స్ఫూర్తిగా తీసుకుని తెరకెక్కిస్తున్న ఈచిత్రం అందర్నీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు రాజ్ చెప్పారు. తేజ, తన్మయి, ఝాన్సీ, పావోన్ రమేష్, తాగుబోతు రమేష్, ప్రణీత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం: రాజ్ ఆర్, సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి, సంగీతం: మార్క్ కె రాబిన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకట్ సిద్దారెడ్డి, ప్రొడక్షన్ డిజైన్: లక్ష్మణ్ ఏలే, ఆర్ట్ డైరెక్షన్: విష్ణు వర్ధన్ పుల్లా, కాస్టింగ్ డైరెక్షన్: మహేష్ గంగిమల్ల, డైలాగ్స్: ఇండస్ మార్టిన్, ఎడిటింగ్: అనిల్ ఆలయం, సాహిత్యం: చంద్రబోస్, రెహమాన్, సింధు మార్టిన్.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886